ఆదివారం 8 నవంబరు 2026

https://www.telugudesam.org



నేడు సెలవు

పాఠకులకు దీపావళి శుభాకాంక్షలు. పండుగ సందర్భంగా ఆదివారం పత్రికకు శెలవు. సోమవారం చైతన్య రథం పత్రిక వెలువడదు. మంగళవారం పునర్దర్శనం.



కూటమి హావా



పట్టణాల నుంచి పల్లెల వరకు ఒకటే ప్రభంజనం...స్థానిక ఎన్నికల్లో కూటమి విజయ పరంపర కొనసాగుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన కూటమి...జడ్పీటీసీ-ఎంపీటీసీ ఎన్నికల్లో నూ ప్రభంజనం సృష్టించారు. "చెప్పాం... చేస్తున్నాం" కూటమి నినాదాన్ని ప్రజలు కూడా సమర్థిస్తూ మంచి ప్రభుత్వానికి విజయం చేకూర్చారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఫలితాల్లో రికార్డు స్థాయిలో విజయాలు నమోదు చేసి సత్తా చాటింది. పలుచోట్ల వైసీపీ కంచు కోటలను బద్దలు కొట్టింది. పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని టీడీపీ వైవసం చేసుకుంది. అర్ధరాత్రి కడపటి వార్తలందేసరికి కూటమి అభ్యర్థులు 7,254 ఎంపీటీసీ స్థానాలు, 495 జడ్పీటీసీ స్థానాల్లో గెలుపొందారు. - మిగత 2లో..

- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఫలితాల్లో విజయపరంపర
- రికార్డు స్థాయిలో గెలుపుబాట
- మంచి ప్రభుత్వానికి అండగా ప్రజలు
- టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల సంబరాలు
- అర్ధరాత్రి కొనసాగుతున్న కౌంటింగ్ ప్రక్రియ



మొత్తం ఎంపీటీసీ స్థానాలు	**- 9829**
కూటమి	- 7259
వైసీపీ	- 1616
ఇతరులు	- 274
మొత్తం జడ్పీటీసీ స్థానాలు	**- 659**
కూటమి	- 495
వైసీపీ	- 54
ఇతరులు	- 4







సుపరిపాలనకు నిదర్శనం విజయం

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి హవాపై మంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా స్పందించారు. నగరమైనా, పట్టణమైనా, పల్లెలైనా ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికే జై కొడుతున్నారు. సుపరిపాలనకు ఈ విజయం నిదర్శనం. ఘన విజయానికి కారకులైన ప్రజలు, కూటమి పార్టీ కార్యకర్తలు, నేతలకు హృదయ పూర్వక కృతజ్ఞతలు. ఓటమి లేని కూటమి జైత్ర యాత్ర.. జనం మనపై పెట్టుకున్న నమ్మకం, మనకు అప్పగించిన బాధ్యత. గెలుపు అహంకారం దరిచేరకుండా ప్రజాసేవకు పునరంకితం అవుదామని పిలుపు నిచ్చారు. ప్రగతి, ప్రజా సంక్షేమంలోనూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా నిలిపేందుకు అంతా కలి సి పనిచేద్దామని ఆకాంక్షించారు.

విశాఖలో సీఐఐ సమ్మిట్

- 12, 13 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహణ
- 59 దేశాల ప్రాతినిధ్యం.. 15 మంది విదేశీ మంత్రుల భాగస్వామ్యం
- వాణిజ్యం నుంచి క్వాంటం టెక్నాలజీ వరకు.. ఆరు కీలక రంగాలపై చర్చలు
- ప్రపంచ మార్కెట్లతో ఏపీ పరిశ్రమల అనుసంధానమే లక్ష్యం
- ఏర్పాట్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

3



వైసీపీ మూకలపై చర్యలు తీసుకోండి

- బ్యాలెట్ బాక్స్ లాక్కెళ్లిన లేళ్ల అప్పిరెడ్డి ముఠాపై ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు
- 19 కేసులున్న ఆయన అమాయకుడా ?
- ఓటమి భయంతోనే కుట్రలు, అల్లర్లు
- వైఎస్ జగన్‌ను నిలదీసిన ఎమ్మెల్సీ వర్ల రామయ్య

6





ప్రతి ఇంటా వెలుగులు నింపాలి

సీఎం చంద్రబాబు దీపావళి శుభాకాంక్షలు

దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు శు భాకాంక్షలు తెలిపారు. నరకాసురుని చెర నుంచి లోకానికి విముక్తి తో... చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా అంతా దీపావళి పండుగ జరుపుకుంటాం. ఈ దీపావళి ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నింపాలి. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలి. ప్రతిఒక్కరి జీవితంలో కొత్త ఆశలు చిగురించాలని ఆకాంక్షించారు. మనం వెలిగించే ప్రతి దీపం మన ఇంటికే కాకుండా సమాజానికీ వెలుగునివ్వాలి. సాటి వారి జీవితాల్లో సంతోషాన్ని నింపడం కూడా పండుగలో భాగం కావాలి. మన పండుగలు ఇచ్చే సందేశాన్ని అర్థం చేసుకుని పరస్పర సహకారంతో, ఐకమత్యంతో మనమంతా ముందుకుసాగాలని ఆకాంక్షించారు.




చైతన్యరథం

కూటమి హవా

మొదటి పేజీ తరువాయి..

అత్యధిక మెజారిటీతో గెలుపొందిన అభ్యర్థులు

- పల్నాడు జిల్లా నకరికల్లు మండలం టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి డాక్టర్ నాగోతు వెంకట లక్ష్మీసరోజ 32,919 ఓట్ల మెజార్టీతో సీపీఎం అభ్యర్థిపై రికార్డు స్థాయిలో విజయం సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో ఇదే అత్యధిక మెజార్టీ కావడం గమనార్హం.
- పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు జనసేన జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దిగిన పమిడిపాటి శ్రీనివాస రావు 30,273 ఓట్ల మెజార్టీతో సత్తాచాటారు. క్రోసూరు మండలంలో మొత్తం 33 వేల ఓట్లు పోలవ్వగా సమీప ప్రత్యర్థిపై రాష్ట్రం లోనే అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో జనసేన శ్రేణు లు సంబరాలు చేసుకుంటున్నాయి.
- పల్నాడు జిల్లా నూజెండ్ల మండలంలో కూటమి బలపరిచిన జనసేన జెడ్పీటీసీ అభ్యర్థి శింగంశెట్టి వెంకట బాలప్రసాద్ 28863 మెజారిటీతో గెలుపు
- పల్నాడు జిల్లా మాచవరం మండలం కూటమి బలపరిచిన టీడీపీ అభ్యర్థి కత్తి సరోజిని 22,882 ఓట్లు మెజార్టీతో సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి దొండేటి వెంకాయమ్మపై విజయం సాధించారు.
- నంద్యాల జిల్లా డోన్ మండల టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి రేగటి లక్ష్మీ వేదవతి.. సమీప ప్రత్యర్థి అభ్యర్థి రాజేశ్వరిపై 23,169 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- ఎన్టీఆర్ జిల్లా మైలవరం టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి పుత్త బ్రహ్మం 21,407 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.
- ప్రకాశం జిల్లా ముండ్లమూరు జడ్పీటీసీ స్థానం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసిన మండలపు సౌమ్య 18,728 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.
- పల్నాడు జిల్లా గురజాల మండల టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి మద్దినేని లక్ష్మి సమీప ప్రత్యర్థిపై 17 వేల పైచిలుకు ఓట్ల మెజారి టీతో ఘన విజయం సాధించారు.
- ప్రకాశం జిల్లా గిద్దలూరు మండల టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి చేరెడ్డి శ్రీలక్ష్మి 12,616 ఓట్ల మెజార్టీతో ఘన విజయం అందుకున్నారు.
- కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం తెలుగుదేశం జడ్పీటీసీ అభ్యర్థి నాగిపోగు పుల్లయ్య 17,295 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- పల్నాడు జిల్లా పిడుగురాళ్ల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి ఉన్నం దీపిక 20,167 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు.
- ప్రకాశం జిల్లా దొనకొండ జడ్పీటీసీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి మోడీ ఈశ్వరమ్మ 15,785 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.









చనిపోయాక విజయం



తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం ధుమంతుని గూడెంలో ఎంపీటీసీ అభ్యర్థి విజయం సాధించినా.. అక్కడ విషాదం నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం ధుమంతునిగూడెం ఎంపీటీసీ జనసేన పార్టీ అభ్యర్థిగా గారపాటి దివ్య (28) పోటీ చేశారు. మహిళా ఎంపీటీసీ అభ్యర్థి ఓట్ల లెక్కింపునకు సరిగ్గా ఒక్కరోజు ముందు గుండెపోటుతో కన్ను మూశారు. శనివారం ఓట్ల కౌంటింగ్‌లో ఆమె 352 ఓట్ల మెజా రిటీతో వైసీపీ అభ్యర్థిపై విజయం సాధించారు. ఓ వైపు ఆమె గెలుపు..మరో వైపు ఆమె లేదన్న నిజాన్ని గ్రామస్తులు జీర్ణించు కోలేకపోతున్నారు.

సత్యనారాయణ కుమార్తె బొత్స అనూష ఓటమి పాల య్యారు. అదే స్థానంలో టీడీపీ నుంచి పోటీ చేసిన పాశల నీరజ ఘన విజయం సాధించారు. ఏకంగా 5,136 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.

తెర్లాంలో సిరి సహస్ర విజయం

విజయనగరం జిల్లా తెర్లాం జడ్పీటీసీ స్థానాన్ని మజ్జి శ్రీను కుమార్తె, టీడీపీ అభ్యర్థి సిరి సహస్ర సొంతం చేసుకున్నారు. 6,651 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ గెలుపు వైసీపీ చేసిన ఆరోపణలకు ఓటర్లు ఇచ్చిన చెంపపెట్టుగా భావిస్తున్నారు.

తండ్రి, కుమార్తెల విజయం

పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలో తండ్రి, కుమార్తెలు విజయం సాధించారు. మాతుమూరు, పాంచాలి ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేసిన తండ్రి జి.యుగంధర్, కుమార్తె కావ్య గెలుపొందారు.

కృష్ణగిరి జడ్పీటీసీగా కూటమి మద్దతుతో విజయం

కర్నూలు జిల్లా కృష్ణగిరి టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరించడంతో ఇక్కడ స్వతంత్ర అభ్యర్థికి టీడీపీ మద్దతు ఇచ్చింది. టీడీపీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థి మర్రి శ్రీరాములు 15,704 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు.

ఒక్క ఓటుతో టీడీపీ అభ్యర్థుల విజయం

నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి అరుణ, పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మల్లిపూడి టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి కొల్లి అరుణకుమారి ఒక్క ఓటుతో గెలుపొందారు.

భార్య,భర్తల విజయం


ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు 3, 4 ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేసిన భార్యాభర్తలు విజయలక్ష్మి, కృష్ణమూర్తి విజయం సాధించారు.

బొత్స కుమార్తెకు పరాజయం

విజయనగరం జిల్లాలో బొత్స కుటుంబానికి ఎదురు దెబ్బ తగిలింది. బొండపల్లి స్థానంలో జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దిగి న బొత్స

విశాఖలో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్

- 12, 13 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహణ
- 59 దేశాల ప్రాతినిధ్యం... 15 మంది విదేశీ మంత్రుల భాగస్వామ్యం
- వాణిజ్యం నుంచి క్వాంటం టెక్నాలజీ వరకు... ఆరు కీలక రంగాలపై చర్చలు
- ప్రపంచ మార్కెట్లతో ఏపీ పరిశ్రమల అనుసంధానమే లక్ష్యం
- ఏర్పాట్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు







అమరావతి(చైతన్యరథం): ప్రపంచ పెట్టుబడులు, అంతర్జాతీ య వాణిజ్యం, సాంకేతిక భాగస్వామ్యాలకు ఆంధ్రప్రదేశ్‌ను కీలక కేంద్రంగా నిలిపే లక్ష్యంతో నవంబరు 12, 13 తేదీల్లో విశాఖ పట్నంలో 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026ను ప్రభుత్వం నిర్వహించనుంది. 'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాల జీ, ట్రస్ట్' థీమ్‌తో రెండురోజుల పాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సుకు సుమారు 59 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరు కానున్నారు. 15 మంది విదేశీ మంత్రులు, 40 మందికి పైగా అంతర్జాతీయ వక్తలు, 350 మంది విదేశీ ప్రతినిధులు, 900 మంది భారతీయ ప్రతినిధులు కలిపి సుమారు 1,250 మంది ఈ సదస్సులో భాగస్వాములు కానున్నారు. ఈనెల 12, 13వ తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026 నిర్వహణ ఏర్పాట్లు, చర్చించాల్సిన అంశాలు, ప్రతిపాదిత డిక్లరేషన్లపై అధికారులు, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీతో క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు.

సదుపాయాలు...నాలెడ్జ్ ఏపీ అనుకూలతలు

సమీక్షలో సీఎం మాట్లాడుతూ విధాన రూపకర్తలు, పెట్టుబడి దారులు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, అంకుర సంస్థలను అను సంధానిస్తూ చర్చలను వ్యాపార, సాంకేతిక భాగస్వామ్యాల దిశగా సమ్మిట్ నిర్వహించాలి. ప్రపంచ మార్కెట్లతో రాష్ట్ర పరిశ్రమలను అనుసంధానించడం, ఎంఎస్ఎంఈలకు కొత్త వ్యాపార పరిచయా లు కల్పించడం ప్రధాన లక్ష్యం కావాలి. సాంకేతిక సహకారాన్ని విస్తరించడం, యువత నైపుణ్యాలకు అంతర్జాతీయ అవకాశాలను పరిచయం చేయడం వంటి అంశాల్లో ఏపీ ప్రాధా న్యం పెంచేలా సదస్సు ఉండాలి. ఎస్క్రో అకౌంట్ ద్వారా పారిశ్రా మిక రాయితీల చెల్లింపు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి విధానాలు ప్రపంచ వ్యాప్తం కావాలి.

రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, సెమీకండక్టర్ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేయాలి. అత్యుత్తమ పాలసీ లు, సమర్థులైన నిపుణులు, మౌలిక సదుపాయాలు, నాలెడ్జ్, బలమైన నాయకత్వం వంటి అనుకూలతలు ఉన్న రాష్ట్రం ఏపీ ఒక్కటే.

రాష్ట్రంలో పెట్టుబడులు సురక్షితం, సులభతరమనే విష యం పారిశ్రామిక వేత్తలకు తెలియాలని సీఎం సూచించారు.

ఆరు ప్రధాన రంగాలపై చర్చ

విశాఖలో జరిగే సీఐఐ సమ్మిట్ ప్రపంచ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, అంతర్జాతీయ సంస్థల ప్రము ఖులు, సాంకేతిక నిపుణులను ఒకే వేదికపైకి రానుంది. వ్యాపార సంస్థల మధ్య భాగస్వామ్యాలను పెంపొందించేందుకు 400 బిజినెస్ టు బిజినెస్ సమావేశాలు, ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపులకు బిజినెస్ టు గవర్నమెంట్ సమావేశాలు జరగను న్నాయి. సింగపూర్ నేపాల్, కంబోడియా, మయన్మార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెనడా, స్లోవాక్ రిపబ్లిక్, మారిషస్, మొజాంబిక్, ఈజిప్ట్, అల్జీరియా, టాంజానియా, గ్వాటెమాలా వంటి పలు దేశాల నుంచి ప్రభుత్వ ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరు కానున్నారు. అదేవిధంగా వివిధ దేశాల రాయబారులు, ప్రపంచ ఆహార కార్యక్రమం, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమానికి చెందిన ప్రతినిధులు హాజరుకానున్నా రు. అయితే ఈ సమ్మిట్‌లో వాణిజ్యం నుంచి క్వాంటం వరకు ఆరు ప్రధాన రంగాలపై చర్చించేలా ఉండాలని సీఎం ఆదేశించా రు. వాణిజ్యం – పెట్టుబడులు – గ్లోబల్ వాల్యూ చైన్స్, ట్రస్ట్-జియో ఎకనమిక్స్- గ్లోబల్ కో ఆపరేషన్, వ్యవసాయం-ఆహార భద్రత-జీవ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, ప్రతిభ-నైపుణ్యాలు-అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు, సాంకేతికత-ఆవిష్కరణలు-భవిష్యత్ పరిశ్రమలు, స్వచ్ఛ ఇంధనం-సుస్థిర వృద్ధి... అనే ఈ ఆరు ప్రధానాంశాలపై చర్చించనున్నారు. ఈ సమీక్షకు అధికారు లు, ఇతర సిఐఐ ప్రతినిధులు హాజరయ్యారు.

మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి అభినందించిన మీడియా కో-ఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పురపాలక (మున్సిపల్), పరిషత్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి (టీడీపీ – జనసేన – బీజేపీ) సాధించిన ఘన విజయం పట్ల తెలుగుదేశం పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును మీడియా కో-ఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో, ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో సాగుతున్న కూటమి ప్రభుత్వ అద్భుత పనితీరుకు ఈ ఎన్నికల ఫలితాలే తిరుగులేని నిదర్శనమని పేర్కొన్నారు. యువగళం స్ఫూర్తితో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు, విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు నారా లోకేష్ చేపడుతున్న చర్యలు... ప్రభుత్వ సంక్షేమ-అభివృద్ధి విధానాల పట్ల ప్రజలు సంపూర్ణ విశ్వాసం ప్రకటించారని తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు సమర్థ నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ భారీ విజయం సాధ్యమైందని కొనియాడారు. ఎన్నికల విజయం కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు, నాయకులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

మీ జీవితాల్లో దీపావళి కొత్త వెలుగులు తేవాలి

- తెలుగు ప్రజలకు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుభాకాంక్షలు



అమరావతి (చైతన్యరథం): దీపావళి పండుగ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని, దేశ విదేశాల్లో స్థిరపడిన తెలుగువారికి హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. దేశ సంస్కృతికి, జాతికి మూలమైన ఆదర్శాలను విలువలను సజీవంగా ఉంచే మన పండుగలలో అందమైన వెలుగుల రవళి..దీపావళి ముఖ్యమైన పండుగ. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ కుల మత ప్రాంతీయ భాషా భేదాలు లేకుండా అందరూ జరుపుకునే దివ్వెల పండుగ. దుష్ట శిక్షణ – శిష్ట జనరక్షణకు, చెడు పై మంచి గెలుపునకు సంకేతంగా జరుపుకొనే ఈ దీపావళి తెలుగు ప్రజలకు వారి మీ కుటుంబాలకు అష్టైశ్వర్యాలు, ఆనందోత్సాహాలు తేవాలని, అజ్ఞానపు చీకట్లను పారదోలి జీవితాల్ని తేజోమయం చేయాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు.

మురసు సహాయక చర్యలపై సీఎం సమీక్ష

- **నిత్యావసరాల తగ్గింపు చర్యలపై దిశానిర్దేశం**
- **క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష**
- **పంట నష్టం నివేదిక పూర్తి చేయాలని ఆదేశం**

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో మురసు తుఫాన్ ప్రభా వం, తదనంతర సహాయక చర్యలు, బాధితులకు అందుతున్న పరిహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం క్యాంపు కార్యా లయంలో సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ తదితర కీలక శాఖల అధికారులతో మాట్లాడిన సీఎం, క్షేత్రస్థాయిలో చేపడుతున్న సహాయ పునరావాస చర్యలపై ఆరా తీశారు. తుఫాన్ ధాటికి కూలిపోయిన విద్యుత్ స్తంభాలు, పునరు ద్ధరణ పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు తక్షణ ఆర్థిక సాయం అందించే అంశంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. పంట నష్టం అంచనాల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దెబ్బతిన్న ఉద్యాన పంటలకు సంబంధించి దాదాపు 92 శాతం మేర అంచనాలు పూర్తయ్యాయని, వ్యవసాయ పంటలకు సంబంధిం చి ఈ నెల 9వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో నష్టాల అంచనా వేసే ప్రక్రియ ముగుస్తుందని అధికారులు వెల్లడించారు. రెండు తుఫాన్ల ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, కూలిన స్తంభాలను తిరిగి ఏర్పాటు చేయడం వంటి పనులపై సీఎం ఆరా తీశారు. అర్నబ్ తుఫాన్ వల్ల సుమారు 30 వేల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని... అన్ని గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరించినట్లు చెప్పారు. ఇక మురుసు తుఫాన్ వల్ల ప్రభావితమైన 1825 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు విద్యుత్ శాఖ



అధికారులు తెలిపారు. దెబ్బతిన్న 7850 విద్యుత్ స్తంభాలను బాగు చేసినట్లు వివరించారు. ఇక తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ నిరంతరాయంగా సాగుతోందని తెలిపిన పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పా రు. ఇప్పటివరకు 3.82 లక్షల కుటుంబాలకు తుఫాన్ సహాయ చర్యల్లో భాగంగా నిత్యావసరాలను అందించామని వెల్లడించారు. రేపటిలోగా పూర్తి స్థాయిలో పంపిణీని పూర్తి చేస్తామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు.

నిత్యావసరాల ధరలను అదుపు చేసేలా చర్యలు

మరోవైపు మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరల నియంత్ర ణకు తీసుకుంటున్న చర్యలపై సీఎం ఆరా తీశారు. ఉల్లిపాయ లు, బియ్యం, పామాయిల్, గోధుమ పిండి, కందిపప్పు వంటి వాటి ధరలను నియంత్రించడంతోపాటు..కొన్ని నిత్యావసరాలను రేషన్ దుకాణాల్లో అందించే ఏర్పాట్లు ఎంత వరకు వచ్చాయని ముఖ్యమంత్రి అడిగారు. కిలో రూ.35కే ఉల్లిపాయలను రైతు బజార్ల ద్వారా పంపిణీ చేస్తున్నామని అధికారులు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా 8 వేల క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కె ట్లోకి దిగుమతి చేసుకున్నట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను అదుపు లో ఉంచేలా నిరంతరం మిల్లర్లు, హోల్ సేల్ వ్యాపారస్తులను మాట్లాడుతున్నామని అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్ లో బీపీటీ సోనా-సాంబ-కేఎన్ఎం రకాల బియ్యాన్ని రూ.66 కు, హెచ్ఎంటీ-ఆర్ఎన్ఆర్ రకాల బియ్యాన్ని రూ.76కు, జై శ్రీరామ్ రకాన్ని రూ.82కు, కామన్ వెరైటీలను రూ.47కు విక్రయించేందుకు వ్యాపారస్తులు అంగీకరించారని తెలిపారు. దీంతో పాటు ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిన 204 వ్యాపార స్తులపై కేసులు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. ధరణి బ్రాండ్ బియ్యాన్ని రైతు బజార్లల్లో అందుబాటులో ఉంచనున్నట్టు చెప్పారు. బహిరంగ మార్కెట్లో రూ.70లకు విక్రయిస్తున్న బియ్యాన్ని రైతుబజార్లల్లో రూ.50లకు అందుబాటులోకి తెచ్చా మని.. అలాగే బీపీటీ రకం బియ్యాన్ని రూ.49లకు విక్రయిస్తు న్నామని తెలిపారు. ఇప్పటివరకు 150 కౌంటర్ల ద్వారా 27, 430 క్వింటాళ్ల బియ్యాన్ని 1.03 లక్షల కుటుంబాలు వినియోగించుకున్నట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడిం చారు. రూ.125కు లీటర్ పామాయిల్, రూ.100కు కిలో కందిపప్పు, రూ.25కు కిలో గోధుమ పిండిని రేషన్ దుకాణాల ద్వారా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్టు అధి కారులు తెలిపారు. ఈ సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు మంత్రి నారాయణ దీపావళి శుభాకాంక్షలు

- **ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష**
- **రాష్ట్ర అభివృద్ధి, ఇంటింటా సంక్షేమ వెలుగులు నింపడమే ప్రభుత్వ ధ్యేయమన్న మంత్రి**

అమరావతి (చైతన్యరథం): వెలుగుల పండుగ, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీక అయిన దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ఐకమత్యం, సోదరభావంతో వేడుకలు జరుపుకోవాలని పిలుపునిస్తూ, సుపరిపాలనతో రాష్ట్రాన్ని వికాస పథంలో పరుగులు తీయిస్తూ, అమరావతి నిర్మాణంతో పాటు ప్రతి మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్ది ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తామని హామీ ఇస్తూ, ఈ పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని, బాణసంచా కాల్చే సమయంలో చిన్నారుల భద్రతపై తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు, అలాగే ఈ వెలుగుల పండుగ నెల్లూరు జిల్లా ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో నూతన వెలుగులు, ఉత్సాహాన్ని నింపాలని మంత్రి నారాయణ ఆకాంక్షించారు.



లేళ్ల అప్పిరెడ్డి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం తీవ్ర నేరం!

గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకవర్గం వెంగళాయపాలెం పోలింగ్ స్టేషన్ లు 25, 26, 27, 28, 29, 30, 31, 32 నుండి బ్యాలెట్ బాక్సులను ఆర్టీసీ బస్సులో (AP07ZTE2751) ప్రిసైడింగ్ అధికారులు కలెక్ట్ చేసుకుని నాగార్జున యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తుండగా వైసీపీ నేతలు ఆటంకాలు సృష్టించారు.

- వెంగళాయపాలెం నుంచి బయలుదేరిన బస్సు పక్కనే ఉన్న చల్లావారిపాలెం వద్దకు రాగానే వైసీపీ నేతలు ఎన్నికల విధుల్లో ఉన్న ప్రిసైడింగ్ అధికారి ఈమని మధుసూదన్ రెడ్డిపై దాడికి పాల్పడి అతని వద్ద నుంచి సీల్ వేసిన బ్యాలెట్ బాక్సును లాక్కున్నారు.
- ఎన్నికల సిబ్బందిని కాపాడేందుకు వెళ్లిన పోలీసులపై కూడా వైసీపీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, అతని అనుచరులు సుమారు 200 మంది దాడికి పాల్పడి చంపేస్తామంటూ బెదిరింపు చర్యలకు దిగారు.
- విధుల్లో ఉన్న ఎన్నికల సిబ్బందిపై, పోలీసు అధికారులపై దాడి చేయడం నేరం కాదా?
- బ్యాలెట్ బాక్సులు లాక్కున్న లేళ్ల అప్పిరెడ్డిపై చర్యలు తీసుకోకుండా సన్మానం చేయాలా?

లేళ్ల అప్పిరెడ్డి నేర చరిత్ర తెలుసుకుని వైసీపీ నేతలు మాట్లాడాలి.

- తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి చేయడంతోపాటు అనేక అసాంఘిక కార్యకలాపాల్లో అప్పిరెడ్డిపై 19కి పైగా కేసులు నమోదయ్యాయి.
- మిర్చియార్డు ఛైర్మన్ గా ఉన్న సమయంలో రాత్రింబవళ్లు శ్రమించి రైతులు పండించిన మిర్చి పంటను కూడా దొంగిలించిన నీచ చరిత్ర లేళ్ల అప్పిరెడ్డిది.
- భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, మిర్చియార్డు తగులబెట్టడం వంటి ఎన్నో ఘటనల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. ఇతనికి ఉన్న నేరచరిత్ర కారణంగా 2014 ఎన్నికల్లో పోటీచేస్తే గుంటూరు ప్రజలు అత్యంత దారుణంగా ఓడించారు.
- ఆస్తుల విధ్వంసం, కిడ్నాప్‌లు, దాడులు, అధికారులపై దౌర్జన్యం వంటి 19 కేసులు అప్పిరెడ్డిపై ఉన్నాయి.
- వైసీపీ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వెంగళాయపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ 456 ఓట్లతో విజయం సాధించింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రామాంజనేయులుకి 1,200 మెజారిటీ వచ్చింది. ఇలాంటిచోట్ల బాక్సులు మార్చాల్సిన అవసరం ఏమిటి?
- అటువంటి గ్రామంలో ఏదో విధంగా ఎన్నికలను అడ్డుకోవాలని కుట్రలో భాగంగా లేళ్ల అప్పిరెడ్డి తన అనుచరులతో పోలింగ్ బాక్సులను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు.
- వెంగళాయపాలెం బాక్స్ ను దౌర్జన్యంగా పోలింగ్ అధికారి దామోదరరెడ్డి నుండి లాక్కొని గూండాగిరి చేయడం నేరం.
- ఏదైనా జరిగితే ఎన్నికల కమిషన్‌కు గానీ, కలెక్టర్‌కు గానీ, ఎస్పీకి గానీ ఫిర్యాదు చేయకుండా బ్యాలెట్ బాక్స్‌ను దౌర్జన్యంగా అప్పిరెడ్డి గూండాలు స్వాధీనం చేసుకోవడం నేరం కాదా?
- రాజకీయ లబ్ధి కోసం ఎన్నికల సిబ్బంది ఎన్నికల విధులకు ఆటంకం కల్పించడం నేరం కాదా?
- బ్యాలెట్ బాక్స్ ను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడమేకాక వీధి నాటకం ఆడడం రాజకీయ లబ్ధి కోసం కాదా? ఎన్నికల సిబ్బంది ప్రతిష్ట దెబ్బతీయడం కాదా?
- ఎన్నికల విధుల్లో వున్న ప్రభుత్వ బస్సు నుండి సిబ్బంది ప్రయివేటు వాహనంలోకి మారలేదు.
- రద్దీగా వున్న ఒక ప్రభుత్వ బస్సు నుండి కొందరు సిబ్బంది రద్దీలేని మరో ప్రభుత్వ బస్సులోకి మారడాన్ని వక్రీకరించి వీధి నాటకం ఆడడం కుట్ర కాదా?

వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డిపై నమోదైన 19 కేసుల వివరాలు

భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, కిడ్నాప్ లు, ఛీటింగ్‌లు, మిర్చియార్డు తగులబెట్టడం వంటి ఎన్నో ఘటనల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు.

S.NO.	Cr.No.	Sec of LAW	Name of the police station
1	474/2018	143,188,341-IPC	Arundalpet
2	104/2019	188,34,341-IPC	Pattabhipuram
3	431/2018	143,188,34,341-IPC	Pattabhipuram
4	150/2019	171-ఎ,188-IPC	Pattabhipuram
5	487/2018	143,188,341-IPC	Arundalpet
6	5/2010	143,34,427,448-IPC	Arundalpet
7	227/2025	126(2),189(2),190, 223-BNS,32-PA-1861	Nagarampalem
8	34/2020	323,34,354,506,509-IPC	Amaravathi
9	103/2012	143,188,341-IPC	Arundalpet
10	184/2016	143,188,341-IPC	Nagarampalem
11	284/2014	188,34,353-IPC	Pattabhipuram
12	108/2018	151-CrPC	Kothapet
13	226/2018	151-CrPC	Old guntur
14	134/2018	151-CrPC	Nallapadu PS
15	440/2012	151-CrPC	Pattabhipuram
16	440/2012	151-CrPC	Pattabhipuram
17	148/2018	151-CrPC	Duggirala
18	130/2015	151-CrPC	Old guntur
19	561/2018	151-CrPC	Arundalpet

చైతన్యరథం

కూటమి సుపరిపాలనకు పట్టంకట్టిన ప్రజలు

- పట్టణం నుంచి పల్లె వరకు ఏకపక్ష తీర్పు
- అభివృద్ధికి, సంక్షేమానికి జనం ఆశీర్వాదం
- కూటమి ఘన విజయానికి సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు
- వైసీపీ ఎన్ని విధ్వంసాలు సృష్టించినా కూటమికి జై కొట్టిన ఓటర్లు
- ప్రజాతీర్పును అవమానిస్తున్న జగన్ రెడ్డి
- ఇది కేవలం ఎన్నికల విజయమే కాదు, కూటమి ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి నిదర్శనం, కార్యకర్తల కష్టానికి దక్కిన ప్రతిఫలం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



అమరావతి (చైతన్యరథం): పట్టణాల నుంచి పల్లెటూర్ల వరకు కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజలు పట్టాభిషేకం చేయడం ఎంతో ఆనందంగా ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు పేర్కొన్నారు. ఈ ఘన విజయం అందించిన ప్రజానీకానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఇది కేవలం ఒక సాధారణ ఎన్నికల విజయం కాదని ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకానికి, సంక్షేమానికి, అభివృద్ధికి, సామాజిక న్యాయానికి నిదర్శమని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులందరికీ ఆయన ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం మాట్లాడిన ఆయన.. ఎన్నికల్లో అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

సీఎం నారా చంద్రబాబు నాయుడు పాలనపై, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర బీజేపీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకం ఈ ఎన్నికల ఫలితాల ద్వారా మరోసారి స్పష్టంగా రుజువైంది. వైసీపీ నేతలుఎన్ని తప్పుడు ఆరోపణలు చేసినా, ఎన్ని విధ్వంసకర పరిస్థితులు సృష్టించినా ప్రజలు వాటన్నింటినీ తిప్పికొట్టారు. వైసీపీని పూర్తిగా పక్కనబెట్టి, ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసంతో ఓటు వేసి గెలిపించారు. ఈ అపూర్వ విజయం ఎంతో సంతోషాన్ని కలిగించింది. బాధ్యతను మరింత పెంచింది. ఈ విజయం సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఏకగ్రీవంగా జై కొట్టిన విజయమని పల్లా స్పష్టం చేశారు.

2కోట్ల 60లక్షల ఓటర్లను అవమానిస్తున్న జగన్

ఈ ఎన్నికల్లో సుమారు రెండు కోట్ల అరవై లక్షల మంది ఓటర్లు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యయుతంగా కూటమికి విజయాన్ని అందించారు. అయితే ఓటమిని తట్టుకోలేక వైసీపీ నాయకత్వం చేస్తున్న నిరాధారమైన ఆరోపణలు ఓటు వేసిన ప్రజలను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయి. ఈ ఎన్నికలను ఎలాగైనా అడ్డుకోవాలని వైసీపీ అనేక కుట్రలు పన్నింది. స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయించడానికి హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ఏకంగా 63 కేసులు దాఖలు చేశారు. వాటినంటిని ఎదుర్కొని ఇవాళ సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించామని పేర్కొన్నారు.

2029 ఎన్నికలల్లో ఇదే గెలుపు కొనసాగిస్తాం

ఐదేళ్ల పాటు జగన్మోహన్ రెడ్డి సాగిన విధ్వంసకర పాలన ప్రజల మనసుల్లో ఎంతటి చెరగని ముద్ర వేసిందో ఈ ఫలితాలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసి, ఆర్థిక వనరులను విచ్చలవిడిగా దోచుకుంటూ, జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రమైన చెడ్డపేరు తెచ్చేలా గత పాలన సాగింది. ఆ అనాలోచిత విధానాల వల్లే అనేక పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయి. నేడు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పాలనపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం కుదిరింది. ప్రస్తుతం దేశంలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో సుమారు 25 శాతం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయి. ఈ ఘన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని, 2029 వరకు ఇదే ఉత్సాహంతో, బాధ్యతతో ముందుకు సాగుతాం. 2029 ఎన్నికల్లో కూడా ఇదే విజయాన్ని కొనసాగిస్తామని పల్లా ఉద్ఘాటించారు.

2024లో ప్రజలు జగన్ మోహన్ రెడ్డికి 11 అసెంబ్లీ స్థానాలు ఇస్తే, ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని చెప్పి ప్రజల తీర్పును అపహాస్యం చేశారు. అసెంబ్లీకి వెళ్లి ప్రజల తరఫున నిలబడాల్సిన బాధ్యతను జగన్ విస్మరించారు. ఐదేళ్ల విధ్వంసకర పాలనను ప్రజలు ఇంకా మర్చిపోలేదు. బెదిరింపులు, "చొక్కా మడత పెడతాం, తాట తీస్తాం" వంటి అహంకార పూరిత మాటలకు ప్రజలు భయపడరని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. 2024లో ఓడిపోతే ఈవీఎంలతో గోల్‌మాల్ చేశారని అబద్ధాలు ప్రచారం చేశారు. మరి ఇప్పుడు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగినా ప్రజలు కూటమి వైపే నిలిచారు. బ్యాలెట్ అయినా, ఈవీఎం అయినా ప్రజలు కూటమి పక్షానే ఉన్నారని, వైసీపీని తిరస్కరించారని ఈ ఫలితం నిరూపించిందని పల్లా స్పష్టం చేశారు.

90శాతం నుంచి 95శాతం స్ట్రైక్ రేట్

కూటమి ప్రభుత్వం వచ్చాక వివిధ సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారులుకు రూ. 1.79 లక్షల కోట్లు అందించాం. పెన్షన్ల రూపంలోనే రూ. 79 వేల కోట్లు ఇచ్చాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. మహిళలకు 50శాతం రిజర్వేషన్లు, బీసీలకు 34శాతంపైగా రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ వంటి నిర్ణయాలతో మాటల్లో కాకుండా చేతల్లో సామాజిక న్యాయం చూపించాం. బీసీలకు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించేందుకు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుపడాలని చూసిన వారికి కూడా ప్రజలే తగిన సమాధానం చెప్పారు. ఈ భారీ విజయానికి మూలస్తంభాలు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలే. కూటమి ధర్మంలో భాగంగా కొన్ని స్థానాలను వదులుకోవాల్సి వచ్చినా, పార్టీ ఆదేశాలను శిరసావహించి క్రమశిక్షణతో పనిచేశారు. అందుకే 90శాతం నుంచి 95శాతం స్ట్రైక్ రేట్ సాధ్యమయిందని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధికే ప్రజల పట్టం

- అందుకే పల్లె నుంచి పట్నం వరకు ఏకపక్ష విజయం
- స్థానిక ఎన్నికల ఫలితాలు సుపరిపాలనకు రెఫరెండం
- ప్రజల తీర్పును గౌరవించకుండా జగన్ రెడ్డి బాధ్యతారహిత ప్రకటనలు
- ఓటర్ల విచక్షణను అవమానించేలా గొడ్డలిపార్టీ నేతల వ్యాఖ్యలు
- ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పల్లె నుంచి పట్నం వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఏకపక్షంగా, ఘన విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజానీకానికి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తయిన తరుణంలో నిర్వహించిన ఈ ఎన్నికలు ప్రభుత్వ పనితీరుకు ప్రజలు ఇచ్చిన రెఫరెండం వంటివని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను పల్లెల్లో, పట్టణాల్లో ఎంత చిత్తశుద్ధితో అమలు చేశామో ప్రజలు స్వయంగా చూశారని, తాము చేసిన అభివృద్ధిని గుర్తించి ఓటు రూపంలో మద్దతు పలికారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాలు, నగరాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. నగర పాలనను నరక పాలనగా మార్చి, కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేని దుస్థితిలోకి నెట్టారని మండిపడ్డారు. అంతేకాకుండా స్థానిక సంస్థల కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం దారిమళ్లించి పంచాయతీలను, మున్సిపాలిటీలను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలు, నగర పాలక సంస్థలకు పూర్వ వైభవం తెచ్చామని, నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ ప్రతి పల్లెను, ప్రతి వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. ప్రజలు వాస్తవాలను గుర్తించి, అభివృద్ధికి పట్టం కట్టారని ఆయన స్పష్టం చేశారు.

కూటమి పాలనకు ఆశీర్వాదం.. వైసీపీని తిరస్కరించిన ఓటర్లు

జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపాలిటీలు సహా అన్ని స్థాయిల్లో వెలువడిన ఈ ఫలితాలు ప్రభుత్వ పనితీరుకు, సంక్షేమానికి దక్కిన గౌరవమని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ స్పష్టం చేశారు. గతంలో జగన్ మోహన్ రెడ్డి సామాజిక పింఛనును రూ. 2000 నుంచి రూ. 3000 చేయడానికి దాదాపు ఐదేళ్ల సమయం తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే పింఛను మొత్తాన్ని రూ. 4000 చేయడమే కాకుండా, పెంచిన బకాయిలు రూ. 3000 సైతం లబ్ధిదారులకు ఒకేసారి ఖాతాల్లో వేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులు, మహిళలు, విద్యార్థులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ముందుకు సాగుతోంది. పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో 'తల్లికి వందనం' ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం వంటి పథకాలు పారదర్శకంగా అమలవుతున్నాయి. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రాజధాని లేని దుస్థితిలో వదిలేస్తే, చంద్రబాబు నాయుడు ఆలోచనా విధానంతో 'అమరావతి'ని ఏకైక రాజధానిగా నిలబెట్టి పనులు పరుగులు పెట్టిస్తున్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 36 ఇరిగేషన్ ప్రాజెక్టులను వేగవంతం చేసి పల్లెలను సస్యశ్యామలం చేసే చర్యలు చేపట్టారు. కీలకమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రజలు బ్యాలెట్ ద్వారా కూటమి ప్రభుత్వానికే పట్టం కట్టారు. ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పును తట్టుకోలేక జగన్ మోహన్ రెడ్డి బాధ్యతారహితమైన ప్రకటనలు చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియను, ఎన్నికల కమిషన్‌ను 'మాఫియా' అని నిందించడం రెండున్నర కోట్ల మంది ఓటర్ల విచక్షణను అవమానించడమే. ప్రజలు జగన్మోహన్ రెడ్డిని శాసనసభ్యుడిగా గెలిపించి 'టీమ్ 11'తో పంపితే, ఈ రెండున్నర ఏళ్లలో ఏనాడైనా అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడే దమ్ము చూపించారా అని ప్రశ్నించారు. కనీసం తమ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం కూడా చేసుకోలేని దీనస్థితిలో వైఎస్సార్సీపీ ఉంది. గ్రామాల్లోనూ, నగరాల్లోనూ వైఎస్సార్సీపీ నాయకత్వాన్ని ప్రజలు పూర్తిగా పక్కన పెట్టారు. నిజమైన సంక్షేమం, భవిష్యత్ అభివృద్ధి ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రజలు తమ ఓటుతో ఘనంగా చాటిచెప్పారన్నారు.

నామినేషన్లపై వైసీపీ అసత్య ప్రచారాలు..త

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతో జగన్ మోహన్ రెడ్డి పచ్చి అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ధ్వజమెత్తారు. నామినేషన్లు వేయనీయలేదని జగన్ చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్సీపీ తరఫున 17,759 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారా లేదా అని సూటిగా ప్రశ్నించారు. ప్యాలెస్ లో కూర్చొని ఇలాంటి కల్లబొల్లి మాటలు చెబితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. సమాచారం అంతా ప్రజల కళ్ల ముందే స్పష్టంగా ఉంది. రాజకీయం చేయాలనుకుంటే ప్యాలెస్ లో కూర్చొని మాట్లాడటం కాదు, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని గౌరవించి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్మితే ప్రజలు సహించబోరని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందని గణాంకాలతో వివరించారు. పట్టణాలు, నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏకంగా రూ.50,000 కోట్ల నిధులు కేటాయించి పనులు చేపట్టాం. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి 'పల్లె పండుగ' ద్వారా దాదాపు రూ.35,000 కోట్లతో అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నాం. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పూర్తిగా అటకెక్కిన జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుకు రూ.10,000 కోట్ల నిధులు సమీకరించి, ప్రతి పల్లెకు స్వచ్ఛమైన తాగునీటి సదుపాయం కల్పిస్తున్నాం. ఎన్నికలను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక, ప్రజల వద్దకు వెళ్లే ముఖం లేక జగన్ మోహన్ రెడ్డి ఇంట్లో దాక్కున్నారని విమర్శించారు. కనీసం పులివెందులలో తన సొంత ఓటును కూడా వేసుకోలేని నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోయారని, ఆయన రాజకీయాలను ప్రజలు ఎప్పుడో ఛీ కొట్టారని అన్నారు. ప్రతిపక్ష హోదా లేని జగన్, కనీసం పులివెందుల శాసనసభ్యుడిగా కొనసాగేందుకు కూడా అనర్హుడని స్పష్టం చేశారు. జగన్ మోహన్ రెడ్డి అబద్ధపు మాటలను, మోసపూరిత రాజకీయాలను రాష్ట్ర ప్రజలు బ్యాలెట్ ద్వారా గట్టిగా మడతపెట్టారు. చౌకబారు విమర్శలు మాని ఇప్పటికైనా ప్రజాతీర్పును గౌరవించాలి. రాష్ట్ర భవిష్యత్తు కోసం, అభివృద్ధి కోసం ప్రజలంతా ముక్తకంఠంతో కూటమి వెంటే నిలబడ్డారని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తేల్చిచెప్పారు.

చైతన్యరథం

స్థానిక ఎన్నికల్లో అల్లర్లు...

వైసీపీ మూకలపై చర్యలు తీసుకోవాలి

- **బ్యాలెట్ బాక్స్ లాక్కెళ్లిన లేళ్ల అప్పిరెడ్డి ముఠాపై ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు**
- **19 కేసులున్న లేళ్ల అప్పిరెడ్డి అమాయకుడా**
- **వైఎస్ జగన్‌ను నిలదీసిన ఎమ్మెల్సీ వర్ల రామయ్య**
- **ఓటమి భయంతోనే జగన్ కుట్రలు, అల్లర్లు**
- **శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న లేళ్ల అప్పిరెడ్డిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి**



అమరావతి (చైతన్యరథం): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వెంగళాయపాలెం పరిషత్ ఎన్నికల్లో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ వర్గీయులు తీవ్ర హింసాకాండకు పాల్పడి, బ్యాలెట్ బాక్సును బలవంతంగా లాక్కెళ్లిన ఘటనపై.. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైఎస్సార్సీపీ కుట్రలు, అక్రమాల ఘటనలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి డా. ఏ. మల్లికార్జున, ఐజీ రాజకుమారిలకు తెలుగుదేశం పార్టీ నేతల బృందం ఫిర్యాదు చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని నిస్సిగ్గుగా ఉల్లంఘిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన వైఎస్సార్సీపీ నాయకుడు లేళ్ల అప్పిరెడ్డి, వారి అనుచరులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ వర్ల రామయ్య, మాజీ మంత్రి, ఏపీ మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్ పర్సన్ పీతల సుజాత, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబులతో కూడిన బృందం ఎస్ఈసీకి శనివారం సమగ్ర లిఖితపూర్వక ఫిర్యాదును అందజేసింది. ఎన్నికలు అడ్డుకునే లక్ష్యంతో అల్లర్లు సృష్టిస్తున్న వైసీపీ రౌడీమూకలపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఎన్నికల కమిషన్ ను కలిసిన అనంతరం మీడియాతో ఎమ్మెల్సీ వర్ల రామయ్య మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో ప్రజల నుంచి మద్దతు పూర్తిగా కరువైందని తేలిపోవడంతో, ఎలాగైనా ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవాలనే దురుద్దేశంతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో కేవలం 11 సీట్లతో ప్రజలు వైఎస్సార్సీపీని పూర్తిగా తిరస్కరించారని, ప్రస్తుతం 2026లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓటర్లు అదే ఉత్సాహంతో కూటమికి అండగా నిలబడుతున్నారని పేర్కొన్నారు. ఫలితాలు వస్తే తమ బండారం బయటపడుతుందని, ప్రజా మద్దతు ఏమాత్రం లేదన్న వాస్తవం జగన్‌కు నిద్రలేకుండా చేస్తోందని విమర్శించారు. అందుకే మొదటి రోజు నుంచే ఎక్కడెక్కడ కార్లు తగలబెట్టాలి, ఎక్కడ అల్లర్లు సృష్టించాలనే కుట్రలకు ఆయనే స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డిని అమాయకుడంటూ జగన్ మోహన్ రెడ్డి వెనకేసుకురావడం విడ్డూరంగా ఉందని రామయ్య దుయ్యబట్టారు. గతంలో ఆయనపై రౌడీషీట్ ఉందని, గతంలో గుంటూరు జిల్లా ఎస్పీగా పనిచేసిన అధికారి "జిల్లాలో కనిపిస్తే కాల్చిపారేస్తా" అని హెచ్చరించినంతటి హిస్టరీ ఆయనకు ఉందని గుర్తుచేశారు. పోలీస్ రిమాండ్ రిపోర్టు ప్రకారం 2018 నుంచి ఇప్పటివరకు అప్పిరెడ్డిపై 19 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అటువంటి అలవాటుపడిన నేరస్థుడిని (హ్యాబిచువల్ అఫెండర్) ఏ రకంగా అమాయకుడని పిలుస్తారని నిలదీశారు. దీనిపై తనతో సాక్షి ఛానల్‌లోనైనా ముఖాముఖి చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సును రోడ్డుపైకి తెచ్చి, ఓట్లు నిండిన బాక్సు పక్కనే పోలింగ్ అధికారి చొక్కా పట్టుకుని నిర్బంధించిన ఫోటో ఆధారాలను ఎన్నికల సంఘానికి అందజేశామని తెలిపారు. ఒక ఎన్నికల అధికారి కాలర్ పట్టుకుని దౌర్జన్యం చేస్తూ, రోడ్డుపై కూర్చున్న వ్యక్తి అమాయకుడవుతాడా అని ప్రశ్నించారు. ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండాలంటే లేళ్ల అప్పిరెడ్డిని వెంటనే ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ యాక్ట్) కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

వైసీపీ చేస్తున్న అరాచకాలపై రాష్ట్రవ్యాప్తంగా 47 నియోజకవర్గాలు, 19 పార్లమెంట్ పరిధులకు సంబంధించి మొత్తం 82 ఫిర్యాదులను ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి సమర్పించామని తెలిపారు. కేవలం పులివెందుల నియోజకవర్గంలోనే 15 ఫిర్యాదులు ఇచ్చామని, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ హెలికాప్టర్ చక్కర్లు, 15 కార్ల కాన్వాయ్‌తో పురవీధుల్లో యాత్ర చేసి ఆర్వో ఆఫీస్ ఎదుట బైఠాయించినందుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏ1 ముద్దాయిగా ఎఫ్ఐఆర్ నమోదైందని వెల్లడించారు. పోలింగ్ బూతుల్లోకి తమ ఏజెంట్లను రానివ్వలేదని వైసీపీ చేస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధాలని స్పష్టం చేశారు. ఎక్కడ రానివ్వలేదో, ఏ అధికారికి ఫిర్యాదు చేశారో చెప్పే దమ్ము వారికి ఉందా అని ప్రశ్నించారు. గన్నవరం మొదలుకొని రాష్ట్రవ్యాప్తంగా వందలాది స్థానాల్లో ఫలితాలు వస్తుంటే, ఏజెంట్లు లేకుండానే కౌంటింగ్ జరిగిందా అని నిలదీశారు. ఐదేళ్లు సీఎంగా పనిచేసిన వ్యక్తి చట్టాలను, నైతిక విలువలను తుంగలో తొక్కి మాట్లాడటం సిగ్గుచేటని, ఈ హింసాత్మక ఘటనలు, ఆధారాలపై తక్షణమే విచారణ జరిపి చట్టబద్ధమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు వర్ల రామయ్య స్పష్టం చేశారు.



మంత్రి నారాయణకు కృతజ్ఞతల వెల్లువ

- 10, 17 డివిజన్లలో భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలు

- 2029లో సైనికుల్లా పనిచేసి మంత్రి రుణం తీర్చుకొంటామంటున్న డివిజన్ వాసులు

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో 10వ డివిజన్‌లో టీడీపీకి 2888 ఓట్ల భారీ మెజారిటీ సాధించిపెట్టిన ప్రజలకు, అందుకు కృషి చేసిన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణకు డివిజన్ టీడీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరు నగరంల చింతారెడ్డిపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ కుటుంబసభ్యులు కిన్నెర ప్రసాద్, కిన్నెర ప్రేమ్, టీడీపీ నాయకులు గజమాలతో నారాయణను ఘనంగా సత్కరించారు. అదే విధంగా 17 వ డివిజన్‌లో 2842 ఓట్ల మెజారిటీ సాధించిన కార్పొరేటర్ కాకర్ల తిరుమల నాయుడు డివిజన్ వాసులతో కలిసి వచ్చి మంత్రిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కిన్నెర ప్రసాద్ మాట్లాడుతూ 10వ డివిజన్‌లో ప్రజలు అత్యధిక మెజారిటీని అందించి తమపై నమ్మకాన్ని చాటుకున్నారన్నారన్నారు. మంత్రి నారాయణ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నగరవాసులు స్వాగతించారని, ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమన్నారు. మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి, కుమార్తెలు సింధూర, షరణి, అల్లుడు పునీత్ నిర్వహించిన ప్రచారం తమ విజయానికి మరింత బలాన్నిచ్చిందన్నారు. వారి ప్రచారంతో అన్ని డివిజన్లలోనూ కూటమి అభ్యర్థులకు భారీ మెజారిటీలు లభించాయని పేర్కొన్నారు. నెల్లూరు నగర ప్రజలంతా మంత్రి నారాయణ వెంటే ఉన్నారని పురపాలక ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి మంత్రి రుణం తీర్చుకుంటామమన్నారు. తమ విజయానికి సహకరించిన మంత్రి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

జగన్ రెడ్డి అరాచకాల వారసుడే లేళ్ల అప్పిరెడ్డి

- **ఎన్నికల అధికారులపై దాడి తీవ్ర నేరం**
- **వెంటనే ఎమ్మెల్సీ పదవికి అప్పిరెడ్డి రాజీనామా చేయాలి**
- **గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు**



అమరావతి (చైతన్యరథం): జగన్మోహన్ రెడ్డి అరాచకాల వారసుడే లేళ్ల అప్పిరెడ్డి అని, ఆయన కింద కామెడీ విలన్ అంబటి రాబాంబు అని గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. రాజ్యాంగ వ్యవస్థపై జగన్మోహన్ రెడ్డికే గౌరవం లేనప్పుడు ఆయన పార్టీ నాయకులకు ఉంటుందని అనుకోవడం భ్రమ అని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ విధ్వంసం పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డితో మొదలైతే.. లేళ్ల అప్పిరెడ్డి ముంగించినట్లు కనిపిస్తుందని దుయ్యబట్టారు.

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలి

గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకవర్గం, వెంగళాయపాలెంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓటింగ్ ముగిసిన తర్వాత... వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తన రౌడీ మూకలతో స్ట్రాంగ్ రూమ్‌లకు వెళ్లే బ్యాలెట్ బాక్సులపై అబద్ధపు ప్రచారం చేస్తూ దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఎమ్మెల్సీ హోదాలో ఉండి రౌడీలా వ్యవహరించిన అప్పిరెడ్డిని వెంటనే ఎమ్మెల్సీ పదవి నుండి భర్తరఫ్ చేయాలి. లేళ్ల అప్పిరెడ్డి వెంటనే ఎమ్మెల్సీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థను, చట్టాన్ని ధిక్కరిస్తే పోలీసులు సహజంగానే అరెస్ట్ చేసి జైల్లో పెడతారు. అదే అక్కడ జరిగిందని స్పష్టం చేశారు.

లేళ్ల అప్పిరెడ్డిని "గాంధీ వారసుడిలా" అభివర్ణించడం విచిత్రం

లేళ్ల అప్పిరెడ్డి అరెస్ట్‌ను ఖండిస్తూ ఆయనను ఏదో గాంధీ వారసుడిలా, రోడ్ల మీద ధర్నాలు చేసే వ్యక్తిగా జగన్ మోహన్ రెడ్డి అభివర్ణించడం విచిత్రంగా ఉంది. గతంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలీసుల సమక్షంలో, సీసీ కెమెరాల సాక్షిగా ఈవీఎంలను పగలగొడితే, జగన్ మోహన్ రెడ్డి ఓడిపోతున్నప్పుడు బాధ ఉండదా, తప్పు ఏముంది అని సమర్థించిన విషయాన్ని మాణిక్యరావు గుర్తు చేశారు. జగన్ మోహన్ రెడ్డికి ఎన్నికల మీద, ప్రజాస్వామ్య వ్యవస్థ మీద అసలు గౌరవమే లేదు. పులివెందులలో ఓటు వేయకుండా నాటకాలు ఆడి ఎన్నికలను బహిష్కరించానంటూ మాట్లాడిన తీరే ఇందుకు నిదర్శనమన్నారు.

కఠిన శిక్ష విధించాలి

దేవాలయంగా భావించే తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన కరుడుగట్టిన నేరస్తులలో లేళ్ళ అప్పిరెడ్డి కూడా ఒకరు. సత్యం, గోపిరెడ్డి, చైతన్య వంటి రౌడీ మూకలతో కలిసి పార్టీ కార్యాలయంపై దాడి చేయించారు. రాష్ట్రంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అవినాష్ రెడ్డి ఏవిధంగా అరాచకాలకు పాల్పడ్డారో, గుంటూరులో అప్పిరెడ్డి కూడా అదే బాటలో నడిచారు. బ్యాలెట్ బాక్సుల దౌర్జన్యం కేసులో అప్పిరెడ్డికి కేవలం రెండు సంవత్సరాలు కాకుండా, ఎన్నికల చట్టాల ప్రకారం ఏడేళ్ల వరకు శిక్ష పడేలా, బెయిల్ కూడా రాకుండా చేయాలి. పోలీసులను, ఎన్నికల అధికారులను భయపెట్టాలని చూస్తే చట్టం చూస్తు ఊరుకోదు. ఎస్సీ, ఎస్టీలను, బడుగు బలహీన వర్గాలను ఓట్లు వేయకుండా బెదిరించే వారిని ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ కూటమి ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలుగా ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రజారంజకమైన పరిపాలన అందిస్తోందని తెలిపారు. పత్తిపాడు లాంటి నియోజకవర్గాల్లో గతంతో పోలిస్తే వైసీపీ ఓట్లు భారీగా ఎందుకు తగ్గిపోయాయో ఆ పార్టీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే ఈ విజయాలకు, ప్రజల మద్దతుకు కారణమని పిల్లి మాణిక్యరావు స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యంపై గౌరవం లేని వైసీపీ

● చట్టవిరుద్ధంగా వ్యవహరించిన లేళ్ల అప్పిరెడ్డి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

అమరావతి (చైతన్యరథం): ప్రజాస్వామ్యంపై నమ్మకం, విశ్వాసం లేకపోవడమే కాకుండా రాజ్యాంగం, ఎన్నికల విధానంపై గౌరవం లేని పార్టీ వైసీపీ అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరిగాయో రాష్ట్ర ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదన్నారు. పరిషత్ ఎన్నికల సందర్భంగా గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకర్గం వెంగళాయపాలెంలో జరిగిన సంఘటనను రాజకీయ ప్రయోజనం కోసం వక్రీకరించి చూపించడానికి వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీగా ఉన్న ఒక నాయకుడు ఎన్నికల



సమయంలో ఎంత బాధ్యతగా వ్యవహరించాలో లేళ్ల అప్పిరెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో భారీ సంఖ్యలో వ్యక్తులతో వెళ్లడం, అధికారులు, పోలీసుల పనిలో జోక్యం చేసుకోవడం సరైన ప్రవర్తన కాదని విమర్శించారు. ఏదైనా తప్పు జరిగి ఉంటే దానికి సంబంధించిన ఆధారాలను సేకరించి, ఎన్నికల కమిషన్ ముందు సమర్పించాలి కానీ అధికారులపై దాడులు చేయటం సరికాదని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్స్‌లను తరలించడం, ఓటింగ్ ప్రక్రియపై అనుమానాలు కలిగించడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే వారికి అధికారులు, పోలీసుల నుంచి సమాచారం తెలుసుకోవడమే సరైన మార్గమని, దానికి బదులుగా రాజకీయ బల ప్రదర్శనకు దారితీసేలా వ్యవహరించటం తప్పని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను గౌరవిస్తోందని, అయితే వైసీపీ దానిపై అనవసరమైన దుష్ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ కాలంలో ఎన్నికల కమిషన్‌పై గౌరవం లేకపోయిందని, ప్రస్తుత ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను పాటిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా జరిగాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు తమ తీర్పు ఇచ్చారన్నారు. ఈ ఎన్నికలు కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు ఇచ్చిన రిఫరెండమని వ్యాఖ్యానించారు. వైసీపీ నాయకులు ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామనే భ్రమలో ఉన్నారని, కానీ సమాజానికి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. చట్టం తన పని చేస్తుందని, ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసే ప్రయత్నాలను అనుమతించబోదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రజాపాలనను గౌరవించాలని, ఎన్నికల విధానానికి అవమానం కలిగించే చర్యలను మానుకోవాలని వైసీపీకి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ హితవు పలికారు.

వెంగళాయపాలెంలో కుట్ర పూరితంగా వ్యవహరించిన లేళ్ల అప్పిరెడ్డి

● బ్యాలెట్ బ్యాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్‌కు తీసుకెళ్లే వరకు అధికారులదే పూర్తి బాధ్యత

● ఎన్నికల అధికారులకు అడ్డగించి, బ్యాలెట్ బాక్సులు లాక్కోవటం తీవ్రనేరం

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

అమరావతి (చైతన్యరథం)ం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..16వ ఫైనాన్స్ కమిషన్ నుండి రాష్ట్రానికి రావలసిన 12,500 కోట్ల నిధులను తెప్పించి, స్థానిక సంస్థల్లో మౌలిక వసతుల కల్పన, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. అయితే, వైసీపీ నాయకులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకునేందుకు డ్రామాలు ఆడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. వెంగళాయపాలెం / చల్లవారిపాలెంలో ఎన్నికల సిబ్బంది, ప్రిసైడింగ్ అధికారులు, పోలీసుల సమక్షంలో నిబంధనల ప్రకారం బ్యాలెట్ బాక్సులను ఒక వాహనం నుండి మరొక వాహనానికి మారుస్తుంటే, వైసీపీ నాయకుడు లేళ్ల అప్పిరెడ్డి, వారి అనుచరులు దౌర్జన్యానికి దిగి బాక్సులను లాక్కోవడానికి ప్రయత్నించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. వైసీపీకి ప్రజాస్వామ్యంపై, రాజ్యాంగంపై గౌరవం లేదు. గత ప్రభుత్వ హయాంలో బలవంతపు విత్ డ్రాలు, ఏకగ్రీవాల పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలను ఏ విధంగా జరిపారో ప్రజలందరికీ తెలుసని గుర్తు చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి, బ్యాలెట్ బాక్సులను అడ్డుకోవడం ఐపీసీ సెక్షన్ 171 ప్రకారం తీవ్రమైన నేరం. ఇందుకు రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలలో సూపర్ సిక్స్ హామీలు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ల పెంపు వంటి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశాం. ఈ పాలనపై ప్రజల తీర్పును రిఫరెండంగా కోరుతూ స్థానిక ఎన్నికలను ప్రజాస్వామ్యయుతంగా, ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, రౌడీయిజం, గుండాయిజం ద్వారా ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ చట్టబద్ధమైన పాలనను కొనసాగించేందుకు ప్రజలు ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తారని పేర్కొన్నారు.



పులివెందులలో జగన్‌కు షాక్

టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి విజయం



పులివెందుల (చైతన్యరథం): సొంత నియోజవర్గం పులివెందులలో జగన్‌కు షాక్ తగిలింది. కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ స్థానాన్ని తెదేపా కైవసం చేసుకుంది. ఇక్కడ టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి భారతి 1,463 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఓటమితో కౌంటింగ్ కేంద్రాల నుంచి వైసీపీ నేతలు వెనుదిరిగారు. ఇప్పటికే పులివెందుల మున్సిపాలిటీలో విజయకేతనం ఎగురవేసిన టీడీపీ.. ఎంపీపీ స్థానాన్ని కూడా కైవసం చేసుకుంది. నియోజకవర్గంలోని ఏడు మండలాలకు గాను కేవలం వేంపల్లె, వేముల మండలాల్లో మాత్రమే వైసీపీ మెజారిటీ ఎంపీటీసీ స్థానాల్లో గెలుపొందింది. ఏకగ్రీవాలతోనే కడప జెడ్పీ పీఠాన్ని టీడీపీ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. మొత్తం 39 జెడ్పీటీసీ స్థానాలకు గాను 23 కూటమికి ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికలు జరిగిన 16 స్థానాల్లోనూ వైసీపీకి కేవలం రెండు మాత్రమే వచ్చాయి.

బొండపల్లిలో మాజీమంత్రి బొత్స కుమార్తె ఓటమి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం జిల్లా బొండపల్లి జెడ్పీటీసీ ఎన్నికల్లో సామాన్య మహిళగా ఎన్నికల బరిలో నిలిచిన పాశల నీరజ ఘన విజయం సాధించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత , మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుమార్తె అనూషపై ఏకంగా 5,136 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ విజయంతో బొండపల్లిలో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ విజయం వెనుక మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యూహం కీలకంగా నిలిచింది. రాజకీయంగా బలమైన నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన అనూషపై సాధారణ మహిళగా బరిలోకి దిగిన నీరజ విజయం సాధించడం, ఏకంగా 5,136 ఓట్ల మెజారిటీ సాధించడం టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బొండపల్లి ప్రజలు రాజకీయ పలుకుబడి కంటే సామాన్య మహిళకు ప్రాధాన్యం ఇచ్చారని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొంటున్నారు.

స్థానిక ఎన్నికల్లో కూటమికి ఘన విజయం అందించిన ప్రజలకు కృతజ్ఞతలు

● ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

● రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి మరింతగా పాటుపడతాం

● మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

తూర్పు నాయుడుపాలెం/ప్రకాశం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కూటమికి సంపూర్ణ మద్దతు తెలిపి ఘన విజయాన్ని అందించారని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ...ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని ఆరు ఎంపీపీలు, జెడ్పీటీసీలు కూటమి కైవసం చేసుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేస్తూ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కూటమికి తిరుగులేని విజయాన్ని అందించి గొడ్డలి పార్టీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇది ప్రజా విజయమని, ప్రజలు సీఎం చంద్రబాబు సారధ్యంలోని కూటమి



ప్రభుత్వంపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి మరింత పాటుపడతామని మంత్రి డోలా అన్నారు.

టీటీడీ సాధికారిక మండలి సభ్యుడిగా కె.కన్నబాబు ప్రమాణం

● సీఎం చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

● శ్రీవారి ఆలయ విశిష్టతను ఖండాంతరాలకు విస్తరిస్తాం

తిరుమల (చైతన్యరథం): టీటీడీ సాధికారిక మండలి సభ్యుడిగా ఏపీ దేవాదాయశాఖ కార్యదర్శి (ఎఫ్ఏసీ) కె.కన్నబాబు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు నాయుడు విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. సాధికారిక మండలి చైర్మన్ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ ధార్మికత, విశిష్టతను ఖండాంతరాలకు

విస్తరించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, బోర్డు సెల్ డిప్యూటీ ఈవో ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

ఎన్నికల విధులకు ఆటంకం కలిగించిన...

లేళ్ల అప్పిరెడ్డిపై చర్యలు తీసుకుంటే తప్పేంటి?

- బ్యాలెట్ బాక్స్ ఎత్తుకెళ్లి, పోలింగ్ అధికారిని బంధించిన రౌడీషీటర్ అమాయకుడా?
- 19 కేసుల్లో నిందితుడు అప్పిరెడ్డి నేర చరిత్ర జగన్ రెడ్డికి తెలియదా?
- ఎన్నికల ప్రక్రియను అడ్డుకునేందుకు గొడ్డలిపార్టీ అరాచకాలు
- 47 నియోజకవర్గాల్లో వైసీపీ మూకల అల్లర్లు, గొడవలు
- ఓటమి భయంతోనే ఓటర్లకు ప్రలోభాలు
- రాయలసీమలో వైసీపీ గుండాయిజం.. జగన్ హెలికాప్టర్ డ్రామాలు
- ఎస్ఈసీకి మొత్తం 82 ఫిర్యాదులు ఇచ్చాం
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య



అమరావతి (చైతన్యరథం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యవహారశైలి చూస్తుంటే "దొంగతనం చేసి పారిపోతూ, ఎదుటివారి దృష్టి మరల్చడానికి దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పల్లెటూళ్లలో సామెత చెప్పినట్లు "మొగుడిని కొట్టి మొగసాలకెక్కిన చందంగా" వైఎస్సార్సీపీ నాయకుల తీరు ఉందని ఆయన విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చాలా అమాయకుడని, అన్యాయంగా అరెస్టు చేశారని జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతుండటం హాస్యాస్పదమని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డికి ఆయన పార్టీ ఎమ్మెల్సీ నేర చరిత్ర గురించి తెలియకపోవటం హాస్యాస్పదం. లేళ్ల అప్పిరెడ్డి ఒక హిస్టరీ షీటర్, రౌడీషీటర్. గతంలో వైసీపీ అధికారంలోకి రాగానే తనకున్న హిస్టరీ షీట్‌ను రద్దు చేయించుకున్నారు. అంతమాత్రాన ఆయన చేసిన రౌడీ పనులు, నేర చరిత్ర చెరిగిపోతాయా? లేళ్ల అప్పిరెడ్డిపై మొత్తం 19 కేసులు నమోదై ఉన్నాయి. ఈ వివరాలు, క్రైమ్ నెంబర్లతో సహా పూర్తి జాబితా ఉంది. 2018 నుంచి ఇప్పటివరకు కేవలం రెండు, మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలోనే పరిశీలిస్తే.. అక్రమ నిర్బంధం (రాంగ్‌ఫుల్ రిస్ట్రెంట్), చంపేస్తామని తీవ్రంగా బెదిరించడం (త్రెటెనింగ్ విత్ డైర్ కాన్సిక్వెన్సెస్) వంటి అత్యంత తీవ్రమైన నేరాల్లో ఆయన నిందితుడిగా ఉన్నారు. పోలీసులు లేళ్ల అప్పిరెడ్డిని ఎందుకు అరెస్టు చేశారో స్పష్టంగా వివరిస్తూ నల్లపాడు పోలీస్ స్టేషన్ అధికారులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో స్పష్టంగా ఉంది. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై క్రిమినల్ ఫోర్స్ ఉపయోగించి, వారి విధులను అడ్డుకున్నందుకు (డిటరింగ్ పబ్లిక్ సర్వెంట్ ఫ్రమ్ డిశ్చార్జింగ్ డ్యూటీస్) ఆయన్ను అరెస్టు చేశారు. బాధ్యతాయుతంగా పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులను కాళ్లు విరగ్గొడతాం, ప్రాణాలు తీస్తాం అని తీవ్రంగా బెదిరించిన ముద్దాయి లేళ్ల అప్పిరెడ్డి. ఇలాంటి నేర చరిత్ర కలిగిన వ్యక్తిని వెనుకేసుకు వస్తూ, అమాయకుడిని అన్యాయంగా అరెస్టు చేశారంటూ ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రయత్నించడం సిగ్గుచేటని వర్ల రామయ్య తీవ్రంగా ఆక్షేపించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, నేరాలకు పాల్పడిన వారు ఎవరైనా చట్టం ముందు సమాధానం చెప్పుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

బ్యాలెట్ బాక్స్ ఎత్తుకెళ్లి, పోలింగ్ అధికారిని బంధించిన రౌడీషీటర్ అమాయకుడా?

ప్రభుత్వ విధుల్లో ఉన్న పోలింగ్ అధికారిని కిడ్నాప్ తరహాలో లాక్కెళ్లి, చంపేస్తామని బెదిరించి, బ్యాలెట్ బాక్సును రోడ్డుపై పెట్టి అరాచకం సృష్టించిన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని అమాయకుడంటూ వెనుకేసుకు రావడం జగన్మోహన్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లేళ్ల అప్పిరెడ్డి, అతని ముఠా ప్రభుత్వ ఉద్యోగులను తీవ్రంగా భయభ్రాంతులకు గురిచేశారు. "కాళ్లు విరగ్గొడతాం, చంపేస్తాం, పీకలు కోసేస్తాం" అంటూ అత్యంత దారుణంగా బెదిరించారు. చెప్పినట్లు వినకపోతే ప్రాణాలు తీస్తామని భయపెట్టి ఎక్స్‌టార్షన్‌కు పాల్పడ్డారు. ప్రభుత్వ ఉద్యోగిని అక్రమంగా నిర్బంధించి, పబ్లిక్ న్యూసెన్స్ చేస్తూ, నిబంధనలను ఉల్లంఘించి అరాచకం సృష్టించారు. ఈ నేరాలకు గాను ఈ నెల ఐదో తారీకు రాత్రి 9:30 గంటలకు పోలీసులు అప్పిరెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. లేళ్ల అప్పిరెడ్డిపై పోలీసులు సుమారు 13 పేజీల సమగ్ర రిమాండ్ రిపోర్టును కోర్టుకు సమర్పించారు. అతను చేసిన నేరాలను, తీవ్రతను స్పష్టంగా చూసిన తర్వాతే మెజిస్ట్రేట్.. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. లేళ్ల అప్పిరెడ్డి అమాయకుడు కాదని, అత్యంత అసాధ్యుడని, బయట ఉంటే ఎన్నికల ప్రక్రియను నాశనం చేస్తాడని గుర్తించే జైలుకు పంపించారు.

ఘటన జరిగిన ప్రదేశంలో తీసిన ఫోటోలను మీడియా కెమెరాల ముందు ప్రదర్శిస్తూ వర్ల రామయ్య తీవ్ర ప్రశ్నలు సంధించారు. నేల మీద మాజీ రౌడీషీటర్ లేళ్ల అప్పిరెడ్డి, ఆయన పక్కన మెడలో ఎర్ర కండువా వేసుకుని కూర్చున్న పోలింగ్ ఆఫీసర్ మధుసూధన్ రెడ్డి, వారి ఎదురుగా బ్యాలెట్ బాక్స్ ఉన్నాయి. ఈ దృశ్యాలు మీ 'సాక్షి' టీవీలో కూడా వచ్చాయి. జగన్మోహన్ రెడ్డి దీనికి ఏం సమాధానం చెబుతారు? రిసెప్షన్ సెంటర్‌కు చేరుకోవాల్సిన బ్యాలెట్ బాక్స్ రోడ్డు మీదకు ఎలా వచ్చింది? బస్సులో భద్రంగా వెళ్లాల్సిన పోలింగ్ ఆఫీసర్ మీ రౌడీషీటర్ పక్కన నేల మీద ఎందుకు కూర్చున్నాడు? బ్యాలెట్ బాక్సులను మారుస్తున్నారంటూ వైఎస్సార్సీపీ వాళ్లు దొంగ మాటలు చెబుతున్నారు. అసలు నిజం ఏమిటంటే.. 25వ పోలింగ్ బూత్ బ్యాలెట్ బాక్సును ఎత్తుకెళ్లాలనే దురుద్దేశంతోనే ఏ1 లేళ్ల అప్పిరెడ్డి, అతని ముఠా ఈ దౌర్జన్యానికి దిగారు. బస్సు మార్చే క్రమంలో బాక్సును బలవంతంగా లాక్కెళ్తుంటే పోలీసులు అడ్డుకుని స్వల్పంగా లాఠీఛార్జ్ చేశారు. అయినా వినకుండా పోలీసులను నెట్టేసి, పోలింగ్ ఆఫీసర్ మధుసూధన్ రెడ్డి చొక్కా పట్టుకుని రోడ్డుపైకి లాక్కొచ్చి కూర్చోబెట్టారు. అటూఇటూ మనుషులను పెట్టి కదిలితే చంపేస్తాం అని బెదిరిస్తూ బంధించారు. ఈ దారుణాన్ని చూసే న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

ఎన్నికలను అడ్డుకోవడమే జగన్ కుట్ర

ఎన్నికల అక్రమాలపై శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే అరెస్టు చేశారంటూ జగన్మోహన్ రెడ్డి నంగనాచి కబుర్లు చెబుతున్నారు. బ్యాలెట్ బాక్సును ఎత్తుకెళ్లి, ప్రభుత్వ అధికారిని నిర్బంధించి బెదిరించడం శాంతియుత ఆందోళన అవుతుందా? ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతోనే ఎన్నికలను ఆపేందుకు జగన్ ఈ కుట్రలు పన్నారు. ప్రభుత్వ విధులను అడ్డుకుంటూ నేరాలకు పాల్పడిన ఎంతటి వారినైనా చట్టం వదిలిపెట్టదని, నేరస్తులను వెనుకేసుకు వచ్చే జగన్మోహన్ రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వర్ల రామయ్య హెచ్చరించారు.

ఓటమి భయంతోనే ఓటర్లకు వైకాపా ప్రలోభాలు..

ప్రజా మద్దతు కోల్పోయి, ఓటమి తప్పదని తేలిపోవడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలవడానికి అడ్డదారులు తొక్కిందని ధ్వజమెత్తారు. పలు ప్రాంతాల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు జగన్మోహన్ రెడ్డి ముఠా విచ్చలవిడిగా నగదు, చీరలు, కానుకలు పంపిణీ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రజల తీర్పు తమకు వ్యతిరేకంగా ఉందని గ్రహించిన వైకాపా నేతలు.. ఎన్నికల కోడ్‌ను బేఖాతరు చేస్తూ పలు నియోజకవర్గాల్లో విచ్చలవిడిగా డబ్బులు, చీరలు, వివిధ రకాల కానుకలు పంపిణీ చేశారు. ఈ అక్రమాలపై పక్కా ఆధారాలతో రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) మొత్తం 8 ప్రత్యేక ఫిర్యాదులు అందజేశామని వర్ల రామయ్య తెలిపారు. మేము చేసిన ఫిర్యాదుల్లో భాగంగా అధికారులు, పోలీసులు తనిఖీలు చేపట్టగా.. కర్నూలులో వైకాపా నేతల వద్ద నుంచి ఏకంగా రూ.76 లక్షల లెక్కల్లో లేని నగదు పట్టుబడిందని వర్ల రామయ్య స్పష్టం చేశారు. ఈ డబ్బంతా ఓటర్లకు పంచిపెట్టి, అక్రమంగా గెలవడానికి తెచ్చినదేనని ఆయన ధ్వజమెత్తారు. ఇంత పెద్దమొత్తంలో డబ్బు దొరికిన తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డి తన పార్టీ నేతలు అమాయకులని ఎలా సమర్థించుకుంటారని నిలదీశారు. డబ్బు సంచులతో ఓటర్లను కొనుగోలు చేయాలని చూస్తున్న వైకాపా నాయకులపై, వారిని ప్రోత్సహిస్తున్న ముఖ్య నేతలపై ఎన్నికల సంఘం తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం కోల్పోయామన్న అక్కసుతో సాగిస్తున్న ఈ దౌర్జన్యాలు, ప్రలోభాల రాజకీయాలకు ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ఆయన హెచ్చరించారు.

రాయలసీమలో వైకాపా గుండాయిజం.. జగన్ హెలికాప్టర్ డ్రామాలు

వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైకాపా గూండాలు రాష్ట్రవ్యాప్తంగా సాగించిన దౌర్జన్యాలు, హింసాకాండపై ఆధారాలతో సహా రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) మొత్తం 82 ఫిర్యాదులు ఇచ్చామని ఎమ్మెల్సీ వర్ల రామయ్య స్పష్టం చేశారు. తానే తప్పు చేసి, దౌర్జన్యాలు సృష్టించి, తిరిగి ఎదుటివారిపై నెపం మోపుతూ జగన్మోహన్ రెడ్డి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 19 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 47 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైకాపా నేతలు తీవ్రస్థాయిలో అల్లర్లు సృష్టించారు. మొత్తం 82 ఫిర్యాదుల్లో.. కేవలం ఒక్క రాయలసీమ ప్రాంతం నుంచే 73 ఫిర్యాదులు ఉన్నాయంటే అక్కడ జగన్ ముఠా ఏ స్థాయిలో విధ్వంసం సృష్టించిందో అర్థం చేసుకోవచ్చు. మిగతా రాష్ట్రం అంతా కలిపి 8 ఫిర్యాదులు వస్తే, ఒక్క రాయలసీమలోనే 73 అరాచకాలపై మేము ఆధారాలతో ఫిర్యాదు చేశాం. కేవలం జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందుల లోనే 15 ఫిర్యాదులు నమోదయ్యాయి. వైసీపీ నేతల గూండాయిజంపై అక్టోబర్ 24 నుంచి నవంబర్ 4 వరకు 31, నవంబర్ 5న 21, పోలింగ్ రోజుల్లో పదుల సంఖ్యలో ఫిర్యాదులు ఊరికే ఇచ్చాము. నవంబర్ 1వ తేదీన హెలికాప్టర్ చుట్టూ జగన్ ఆడిన నాటకాలు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. రెండు రౌండ్లు తిరగ్గానే హెలికాప్టర్‌లో ఫ్యూయల్ (ఇంధనం) అయిపోయిందని గగ్గోలు పెట్టడం పచ్చి మోసం. ఏవియేషన్ నిబంధనల ప్రకారం.. హెలికాప్టర్ బయలుదేరిన చోటు నుంచి గమ్యస్థానానికి వెళ్లి, మళ్లీ వెనక్కి రావడానికి సరిపడేంత డబుల్ ఫ్యూయల్ తప్పనిసరిగా ఉండాలి. జగన్మోహన్ రెడ్డికి ఈ ప్రాథమిక రూల్ కూడా తెలియదా? పులివెందులలో కాన్వాయ్ నిబంధనలు ఉల్లంఘించి, ఆర్వో వద్దకు వెళ్లి రోడ్డుపై కూర్చుని అరాచకం సృష్టించిన వ్యవహారంలో స్వయంగా జగన్మోహన్ రెడ్డిపైనే ఎఫ్ఐఆర్ నమోదైంది. చట్టాన్ని ఉల్లంఘించి నిందితుడిగా మారిన జగన్.. ఇతరుల గురించి మాట్లాడటం విడ్డూరం. ప్రజల్లో తమకు ఆదరణ లేదని, ఘోర పరాజయం ఖాయమని తేలిపోవడంతోనే ఎన్నికల ప్రక్రియను అడ్డుకునేందుకు జగన్ ఈ కుట్రలకు తెరలేపారు.

లేళ్ల అప్పిరెడ్డి అమాయకుడంటూ జగన్ మాట్లాడగానే, అంబటి రాంబాబు వంతపాడటం సిగ్గుచేటు. అప్పిరెడ్డిపై గతంలో రౌడీషీట్ లేదా? పోలీస్ స్టేషన్లలో అతని ఫోటోలు లేవా? గుంటూరు పోలీసులు ప్రతి వారం అతన్ని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వలేదా? కదిలితే మెదిలితే పోలీసులు నిలదీసే అలవాటుపడ్డ నేరస్థుడు (హ్యాబిచువల్ అఫెండర్) ఆయన. ఇవన్నీ అంబటి రాంబాబుకు తెలియవా? 2018 నుంచే 19 కేసులు నమోదైతే, అంతకుముందున్న నేర చరిత్ర ఇంకెంత? పోలీసులపై తిరగబడి, పోలింగ్ అధికారి చొక్కా పట్టుకుని రోడ్డుపైకి ఈడ్చుకొచ్చి, బ్యాలెట్ బాక్సును రోడ్డుపై పడేసి అరాచకం సృష్టించిన రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్టు చేస్తే.. దీనికి టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి ఏం సంబంధం? ఇంతటి నేర ఘనపాఠిని అమాయకుడు అనడం ఎంతవరకు సమంజసం? విధుల్లో ఉన్న అధికారులపై దాడి చేసి, ప్రజాస్వామ్య వ్యవస్థను కాలరాసేందుకు యత్నించిన లేళ్ల అప్పిరెడ్డిని చట్టబద్ధంగా అరెస్టు చేసి, జ్యుడీషియల్ కస్టడీకి పంపడం నూటికి నూరుపాళ్లు సరైన చర్య అని వర్ల రామయ్య స్పష్టం చేశారు. నేరాలను ప్రోత్సహించే వైకాపా వైఖరికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు.

పట్టణాల నుంచి పల్లెల వరకు...

కూటమి పాలనకు ప్రజల జేజేలు

- అప్పట్లో ఈవీఎంలపై జగన్ నిందలు
- మరి ఇప్పుడు బ్యాలెట్ పేపర్లతోనూ గొడ్డలిపార్టీ ఘోర పరాజయం.. దీనికి ఏమంటారు
- కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమానికి ప్రజల జేజేలు
- ఇకనైనా అబద్ధాలు మాని, జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు



అమరావతి (చైతన్యరథం): మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన విధంగానే, పరిషత్ ఎన్నికల్లో కూడా ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూటమి ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు పేర్కొన్నారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజానీకానికి ఆయన మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏకంగా 2.6 కోట్ల మంది ప్రజలు స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటే, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం.. ఇవి అసలు ఎన్నికలేనా అంటూ చులకనగా మాట్లాడటం అత్యంత బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు, అపోహలు సృష్టించేందుకు ఆయన చేయని ప్రయత్నం లేదని ధ్వజమెత్తారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పునిస్తే, ఓటమిని జీర్ణించుకోలేక జగన్ మోహన్ రెడ్డి ఈవీఎంలపై నిందలు వేశారని గుర్తుచేశారు. మరి ఇప్పుడు జరిగిన ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓటింగ్ జరిగితే, అంతకంటే స్పష్టమైన, ఇంకా ఉన్నతమైన ఫలితాలను ప్రజలు అందించారని తెలిపారు. మరి ఇప్పుడు జగన్ దేనిని తప్పుపడతారో సమాధానం చెప్పాలని, ఈ వాస్తవాన్ని ప్రతిపక్ష నాయకులు ఇప్పటికైనా గ్రహించాలని హితవు పలికారు. కేవలం ఎన్నికల ఫలితాలను వక్రీకరిస్తూ, ప్రజల్లో గందరగోళం సృష్టించే కుటిల యత్నాలు మానుకోవాలన్నారు. జగన్ మోహన్ రెడ్డికి నిజంగా తన పార్టీని కాపాడుకోవాలనే ఆలోచన ఉంటే.. అధికార పక్షంపై నిరాధారమైన ఆరోపణలు చేయడం ఆపి, తమ పార్టీ నేతలతో కూర్చొని ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.

నామినేషన్లు వేయనివ్వలేదనడం పచ్చి అబద్ధం..

సుమారు 9 వేల పైచిలుకు ఎంపీటీసీ స్థానాల కోసం జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి దాదాపు 19 వేల మంది, వైఎస్సార్సీపీ నుంచి 16 నుండి 17 వేల మంది నామినేషన్లు దాఖలు చేశారని గద్దె రామ్మోహన్ రావు స్పష్టం చేశారు. ఇంత భారీ సంఖ్యలో నామినేషన్లు పడితే.. నామినేషన్లు వేయడానికి కూడా అవకాశం లేని పరిస్థితులు సృష్టించారంటూ వైఎస్సార్సీపీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని, అసత్యాలు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్న ఆ పార్టీ నేతలు ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు ఎలాంటి స్పష్టమైన తీర్పునిచ్చారో, నేడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రజలు అదే తరహాలో కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టారని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. చివరకు కడప జిల్లాలో, జగన్ మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో సైతం జెడ్పీటీసీ స్థానాన్ని కూటమి భారీ మెజారిటీతో కైవసం చేసుకోవడం చారిత్రాత్మకమని గుర్తుచేశారు. పులివెందుల సహా కడప జిల్లా అంతటా ఇలాంటి ఫలితాలు ఎందుకు వచ్చాయో వైఎస్సార్సీపీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది పోయి.. ఇవి అసలు ఎన్నికలేనా? ఇలాంటివి ఎప్పుడైనా చూశామా? అంటూ మాట్లాడటం వారి అపరిపక్వతకు నిదర్శనమన్నారు. ఐదేళ్ల పాటు వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక ఎన్నికల్లో చేసిన అరాచకాలను, దౌర్జన్యాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని స్పష్టం చేశారు. ఐదేళ్ల వైఎస్సార్సీపీ విధ్వంస పాలనపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందని, ఆ చేదు జ్ఞాపకాలను ఇప్పటికీ ప్రజలు గుర్తుచేసుకుంటూనే ఉన్నారని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో నిధుల సమీకరణపై కనీస దృష్టి లేక, రాష్ట్ర వాటా ఇవ్వకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్నో కీలక ప్రాజెక్టులు, నిధులు వెనక్కి వెళ్లిపోయాయని ధ్వజమెత్తారు. ఆ తప్పుడు నిర్ణయాల వల్ల తీవ్రంగా నష్టపోయింది సామాన్య ప్రజలేనని, అభివృద్ధి కుంటుపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోకపోతే రానున్న రోజుల్లో వైఎస్సార్సీపీ మరింత ఘోరమైన పరాభవాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమానికి నిజమైన న్యాయం జరుగుతోందని ప్రజలే స్వయంగా చెబుతున్నారని గద్దె రామ్మోహన్ రావు పేర్కొన్నారు. ఉదయం అల్పాహారం నుంచి మధ్యాహ్నం, రాత్రి భోజనం వరకు ఎంతో తక్కువ ధరకే రూ.5 నాణ్యమైన, కమ్మటి భోజనాన్ని అందించే అన్న క్యాంటీన్లు మొదలుకొని.. 'తల్లికి వందనం', మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాల పట్ల ప్రజలంతా పూర్తి సంతృప్తితో ఉన్నారని ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో.. ప్రజల నాడిని తెలుసుకోవడానికి ఈ స్థానిక సంస్థల ఎన్నికలను కూటమి ఒక రెఫరెండంగా భావించిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, బీజేపీ నాయకత్వం.. అందరం కలిసి ప్రజాభిప్రాయాన్ని గౌరవించి, ఎక్కడైనా లోపాలు ఉంటే సరిదిద్దుకుని, రానున్న రెండున్నర సంవత్సరాలు మరింత నిబద్ధతతో ప్రజల కోసం పనిచేయాలనే సంకల్పంతో ముందుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. అధికార పక్షం ప్రజాసేవ కోసం పరితపిస్తుంటే, ప్రతిపక్షం మాత్రం ప్రజా తీర్పును అపహాస్యం చేస్తూ అవాస్తవాలతో ప్రజల్లో మరింత చులకనవుతోందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు స్పష్టం చేశారు.

అబద్ధాలతో కాలం గడపలేరు

వైఎస్సార్సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి ప్రజాస్వామ్యం అన్నా, ఎన్నికల ప్రక్రియ అన్నా ఏమాత్రం గౌరవం, నమ్మకం లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై చెడు భావన కలిగించాలనే కుట్రతో, వినేవాళ్ళు ముక్కున వేలేసుకునేలా రోజూ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డి వ్యవహారశైలి చూస్తుంటే ఆయనకు ఓటు వేయడానికి కూడా ఆసక్తి లేనట్లు కనిపిస్తోందని, అసలు అలాంటి వ్యక్తి ఏ ముఖం పెట్టుకుని.. ప్రజలను ఓట్లు అడుగుతారని, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తారని నిలదీశారు. ఎన్నికల్లో గెలుపోటములను సహజంగా స్వీకరించి, ఎక్కడ లోపాలు జరిగాయో సరిదిద్దుకోవాలన్న ఆలోచన లేకుండా... కేవలం అబద్ధాలు, అవాస్తవాలతోనే కాలం గడుపుతామంటే రాజకీయాల్లో ఎక్కువ రోజులు చెల్లవని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగాయని చెప్పడానికి నామినేషన్ల సంఖ్యే నిదర్శనమని గద్దె గుర్తుచేశారు. దాదాపు 9,800 పైచిలుకు స్థానాలు ఉంటే, ఒక్క వైఎస్సార్సీపీ నుంచే ఏకంగా 17,000 మంది నామినేషన్లు వేశారంటే ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఎంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా పనిచేశాయో స్పష్టమవుతోందన్నారు. విపక్షాలకు పూర్తి స్వేచ్ఛ కల్పించిన వాస్తవాలు కళ్లముందే కనిపిస్తున్నా.. 'పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ ఎవరూ చూడట్లేదనుకున్నట్లు' జగన్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎప్పుడూ ఏదో ఒక విషయాన్ని మడతపెట్టే జగన్... తాను 'మడమ తిప్పను' అని గొప్పలు చెప్పుకుంటారని, కానీ ఆయన మడమ ఎప్పుడూ తిరిగే ఉంటుందని ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి ప్రజలు ఇంతటి ఘన విజయాన్ని కట్టబెట్టినందుకు రాష్ట్ర ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు చూపించిన ఈ అభిమానం, ఓటు ద్వారా ఇచ్చిన తీర్పుతో తమపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రజలంతా కూటమి నాయకత్వంపై ప్రగాఢమైన నమ్మకంతో అండగా నిలిచారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత నిబద్ధతతో సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. విభజన తర్వాత కట్టుబట్టలతో మిగిలిన రాష్ట్రాన్ని పునర్నిర్మించుకుంటూ, భారతదేశంలోనే అత్యుత్తమ అగ్రరాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న ప్రయత్నానికి ప్రజలు అండగా నిలబడ్డారని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఈ సంపూర్ణ మద్దతుతో మరింత ఉత్సాహంతో పనిచేసి, పరిపూర్ణమైన నమ్మకాన్ని చూరగొని 2029 సార్వత్రిక ఎన్నికలను సమగ్రంగా ఎదుర్కొనేందుకు ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక విజయానికి కారణమైన కూటమి శ్రేణులకు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు, రాష్ట్ర ప్రజానీకానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు మరొక్కసారి ధన్యవాదాలు తెలియజేశారు.

గూండాయిజంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వైసీపీ

- ఎన్నికల అధికారిపై లేళ్ల అప్పిరెడ్డి దాడి దారుణం
- టీడీపీ నేత కోవెలమూడి రవీంద్ర ధ్వజం



అమరావతి (చైతన్యరథం): గూండాయిజంతో ప్రజాస్వామ్యాన్ని వైసీపీ అపహాస్యం చేస్తోందని టీడీపీ సీనియర్ నేత కోవెలమూడి రవీంద్ర (నాని) మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...వైసీపీ నేతల అరాచక వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి సుమారు 200 మంది గూండాలను వెంటేసుకుని వచ్చి ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిపై దాడికి తెగబడటాన్ని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై ఈ రకమైన భౌతిక దాడికి దిగడం వైసీపీ గూండా సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు.

వెంగళాయపాలెంలో తెలుగుదేశం పార్టీకి తిరుగులేని ప్రజాబలం ఉందని రవీంద్ర గుర్తుచేశారు. గత వైసీపీ పాలనలోనే అక్కడ జరిగిన ఎన్నికల్లో టీడీపీ 456 ఓట్ల ఆధిక్యతతో విజయదుందుభి మోగించిందని, 2024 సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అదే ప్రాంతంలో ఏకంగా 1200 ఓట్ల భారీ మెజారిటీని ప్రజలు టీడీపీకి కట్టబెట్టారని వివరించారు. ప్రజల సంపూర్ణ ఆశీస్సులతో తిరుగులేని విజయం సాధించే పట్టున్న ప్రాంతంలో బ్యాలెట్ బాక్సులను మార్చాల్సిన అవసరం తెలుగుదేశం పార్టీకి ఎంతమాత్రం లేదని కుండబద్దలు కొట్టారు.

టీడీపీకి కంచుకోటగా ఉన్న గ్రామంలో పరాభవం తప్పదనే అక్కసుతోనే, ఎలాగైనా ఎన్నికలను అడ్డుకోవాలనే దురుద్దేశంతో లేళ్ల అప్పిరెడ్డి నేతృత్వంలో ఈ కుట్రపూరిత దాడి చేయించారని ఆయన విమర్శించారు. విధి నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారి పొరపాటు చేశారని భావిస్తే, చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి తప్ప, వందలాది మందితో వచ్చి భయోత్పాతం సృష్టించడం చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడమేనని తేల్చిచెప్పారు. కేవలం రద్దీగా ఉన్న ఒక బస్సు నుంచి ఖాళీగా ఉన్న మరో బస్సులోకి అధికారి మారుతున్న సాధారణ విషయాన్ని సాకుగా చూపి అరాచకం సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఇలాంటి అరాచక శక్తులను వెనుక ఉండి ప్రోత్సహిస్తున్న జగన్మోహన్ రెడ్డి తీరును తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని రవీంద్ర హెచ్చరించారు.

మంత్రి కందుల దుర్గేష్ సౌజన్యంతో వరద బాధితులకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా



నిడదవోలు (చైతన్యరథం): మురసు తుఫాన్ ధాటికి తీవ్రంగా ప్రభావితమైన తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలోని వరద ముంపు ప్రాంతాల ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంత్రి దుర్గేష్ సౌజన్యంతో 'బాలవికాస' సంస్థ ఆధ్వర్యంలో, 'అమెజాన్' సంస్థ సహకారంతో అత్యాధునిక "మొబైల్ వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్" వాహనాన్ని రప్పించి తీరుగూడెం, ఇందిరానగర్ ప్రాంతాల్లోని బాధిత ప్రజలకు సురక్షితమైన తాగునీటిని పంపిణీ చేశారు. ఈ వాహనాల ద్వారా నేరుగా ప్రజలు ఉన్న ప్రాంతాలకే వెళ్లి ఆధునిక నీటి శుద్ధీకరణ పద్ధతులు వినియోగించి శుద్ధి చేసిన మంచి నీటిని పంపిణీ చేస్తున్నారు. రవాణా సౌకర్యం లేని, నీరు నిలిచిపోయిన ప్రాంతాలకు డ్రోన్ సాంకేతికత ద్వారా మంచినీటి క్యాన్లను నేరుగా డెలివరీ చేయాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... వరదలు, తుఫాన్ లాంటి విపత్కర సమయంలో ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే సురక్షితమైన తాగునీరు అత్యంత అవసరమని, ప్రభావిత ప్రాంతాల్లోని చివరి ఇల్లు వరకు స్వచ్ఛమైన నీరు చేరే వరకు ఈ పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. నిడదవోలు ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటామని మంత్రి దుర్గేష్ పునరుద్ఘాటించారు. ఆపద సమయంలో అండగా నిలిచిన ఆయా సంస్థలకు మంత్రి దుర్గేష్ అభినందనలు తెలిపారు.

రాయచోటిలో కూటమిది చారిత్రాత్మక విజయం

- **సంక్షేమం, అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారు**
- **44 మున్సిపల్ వార్డులు.. 67 ఎంపీటీసీ స్థానాలు కూటమి కైవసం**
- **ఆరు మండలాల్లోనూ ఎంపీపీ స్థానాలు కూటమికే**
- **వైసీపీకి అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి**
- **ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం.. అభివృద్ధిని కొనసాగిస్తాం**
- **రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



రాయచోటి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి అభ్యర్థులు అఖండ మెజార్టీతో విజయం సాధించారని, ముఖ్యంగా రాయలసీమలో కూటమికి అనూహ్య ప్రజాదరణ లభించిందని తెలిపారు. ఈ విజయం కేవలం కూటమి ప్రభుత్వానిది మాత్రమే కాదని, ప్రజల విజయమని అభివర్ణించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఎన్నికలకు, ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన ఎన్నికలకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికలు నిర్వహించామని పేర్కొన్నారు.

రాయచోటి రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయం

రాయచోటి నియోజకవర్గ రాజకీయ చరిత్రలో కూటమి సాధించిన విజయం చిరస్థాయిగా నిలిచిపోతుందని మంత్రి అన్నారు. రాయచోటి మున్సిపాలిటీలోని 44 స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. 2005లో మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి తొలిసారిగా రాయచోటిలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేశామని పేర్కొన్నారు.

అదేవిధంగా రాయచోటి నియోజకవర్గంలోని 67 ఎంపీటీసీ స్థానాలను కూటమి కైవసం చేసుకుందని చెప్పారు. వీటిలో 66 స్థానాలు ముందుగానే ఏకగ్రీవం కాగా, మిగిలిన ఒక స్థానంలోనూ కూటమి అభ్యర్థి ఘన విజయం సాధించారని వివరించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎంపీపీ స్థానాలను సైతం కైవసం చేసుకున్నామని తెలిపారు. అన్నమయ్య జిల్లావ్యాప్తంగా జెడ్పీటీసీ స్థానాల్లో కూటమి ప్రభంజనం సృష్టించిందని, రాయచోటి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీలతో విజయం సాధించామని పేర్కొన్నారు.

వైసీపీ ఆత్మపరిశీలన చేసుకోవాలి

ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయచోటి నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారో ఆ పార్టీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేసేందుకు వైసీపీకి అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వైసీపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో చేయలేని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం చేపడుతుంటే వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, అందుకే కూటమికి పెద్దఎత్తున మద్దతు ప్రకటిస్తున్నారని అన్నారు.

రాయచోటి అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని మంత్రి తెలిపారు. ప్రతి ప్రభుత్వ శాఖకు అవసరమైన నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని వివరించారు.

రాయచోటి పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వెలిగల్లు జలాశయం నుంచి రెండో దశ నీటి సరఫరా పథకానికి రూ. 119 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా 850 గ్రామాలకు తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రైతుల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఇప్పటివరకు 1,200 ట్రాన్స్‌ఫార్మర్లు అందించినట్లు వివరించారు.

రాయచోటి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 36 కోట్ల నిధులు తీసుకొచ్చామని, పట్టణంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్లు నిర్మించి రాయచోటిని సుందర నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

వైద్య, విద్యా రంగాలకు పెద్దపీట

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న 10 డయాలసిస్ యూనిట్ల సంఖ్యను 25కు పెంచుతున్నట్లు చెప్పారు. తద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి రూ. 35 కోట్లతో పాఠశాల, హాస్టల్ భవనాల నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.

పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు

రాయచోటి పట్టణంలో రెండు అన్న క్యాంటీన్లను ప్రారంభించామని, దాతల సహకారంతో రెండు క్యాంటీన్లలోనూ పేదలకు ఉచితంగా భోజనం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మానవతా దృక్పథంతో నిరుపేదలు, కార్మికులు, ఇతర అవసరార్థులకు ఆహార సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి సుమారు రూ. 48 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ముఖ్యంగా రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు.

కార్యకర్తల కష్టాన్ని మరువం

కూటమి విజయానికి అహర్నిశలు కృషి చేసిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు కులమతాలకు అతీతంగా సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాయచోటి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి ఘనవిజయంతో ముందే వచ్చిన దీపావళి

- **జగన్ అహంకారాన్ని బూడిద చేసిన ఓటర్లు**
- **గొడ్డలిపార్టీ కుట్ర రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడిన జనం**
- **రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



అమరావతి (చైతన్యరథం): వెలుగుల పండుగ దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని పేర్కొన్నారు. నరకాసుర సంహారంతో ముడిపడిన ఈ పర్వదినం అన్యాయం ఎంత బలమైనదైనా అంతిమ విజయం ధర్మానిదేనని సందేశాన్ని ఇస్తుందన్నారు. ప్రతి ఇంటా ఆనందదీపాలు వెలగాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం, సుభిక్షతతో ముందుకు సాగాలని, రైతులు, కార్మికులు, మహిళలు, యువత సహా అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో దీపావళి కొత్త వెలుగులు నింపాలని కోరుకున్నారు.

రాష్ట్ర ప్రజలకు ఈసారి దీపావళి ముందుగానే వచ్చిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన ఘనవిజయమే అందుకు నిదర్శనమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పురాణాల్లో నరకాసురుడి అహంకారానికి అంతం పలికినట్లే, రాష్ట్ర ప్రజలు ఓట్లనే ఆయుధాలుగా మలిచి జగన్ రాజకీయ అహంకారాన్ని దహనం చేశారని వ్యాఖ్యానించారు. దీపావళి మంటల్లో వైసీపీ అరాచక రాజకీయాలను కాల్చి బూడిద చేసినంత స్పష్టంగా ప్రజలు తీర్పునిచ్చారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయంతోనైనా జగన్‌కు కనువిప్పు కలుగుతుందని భావించామని, కానీ ఆయన వైఖరిలో మార్పు రాకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని విమర్శించారు. చివరకు సొంత రాజకీయ కంచుకోటగా చెప్పుకొనే పులివెందులలోనూ వైసీపీకి ఎదురైన పరాభవం జగన్‌పై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. అవినీతి, అక్రమాస్తుల కేసులు ఎదుర్కొంటూ ప్రజలకు నీతులు చెప్పే నైతిక అర్హత జగన్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. అధికారం కోల్పోయినా అహంకారం వీడని జగన్‌కు ప్రజాస్వామ్యంలో స్థానం నిర్ణయించేది ప్రజలేనన్న వాస్తవం ఇంకా అర్థం కాలేదని మండిపడ్డారు.

ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారీ ప్రజాతీర్పును ప్రశ్నించడం జగన్ రాజకీయ దివాళాకోరుతనానికి పరాకాష్ఠ అని ధ్వజమెత్తారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే కలలు కనడం మానుకోవాలని, ఆయన విధ్వంసకర రాజకీయాలకు మరోసారి అధికారం అప్పగించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఏమాత్రం సిద్ధంగా లేరని తాజా ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

ఏపీకి మరోసారి జాతీయస్థాయిలో గుర్తింపు

- రాష్ట్రానికి 6 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

- మంత్రి పొంగూరు నారాయణ హర్షం



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరోసారి జాతీయస్థాయిలో గుర్తింపు లభించడం గర్వించదగ్గ విషయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రాష్ట్రంలోని ఆరు పట్టణ స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమహేంద్రవరం, తిరుపతి నగరపాలక సంస్థలతో పాటు కుప్పం మున్సిపాలిటీకి ఈ అవార్డులు ప్రకటించడం రాష్ట్ర పురపాలక శాఖకు జాతీయస్థాయిలో మరోసారి గుర్తింపు లభించినట్లయిందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని పట్టణాలను పరిశుభ్రంగా, స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ద్వారా పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, చెత్త రహిత పట్టణాలుగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. పట్టణాల్లో పారిశుధ్య ప్రమాణాలను మెరుగుపరచడం, చెత్త నిర్వహణను పటిష్టం చేయడం, ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం వంటి చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని మంత్రి తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులు సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఆయా నగరపాలక సంస్థల అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బందికి మంత్రి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వారి కృషి, అంకితభావం వల్లే రాష్ట్రానికి ఈ గుర్తింపు సాధ్యమైందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలను డంపింగ్ యార్డులు లేని పట్టణాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్వచ్ఛతను ప్రజా ఉద్యమంగా మార్చి, రాష్ట్రంలోని ప్రతి పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ నెల 11వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను ప్రదానం చేయనుందని మంత్రి నారాయణ వెల్లడించారు.

రూ.15 వేల కోట్ల పెట్టుబడికి సిద్ధమైన దక్షిణ కొరియా దిగ్గజం 'కియా'

- మంత్రి లోకేష్ చొరవతో ఆటోమొబైల్ రంగంలో మరో ముందడుగు
- కియాతో పాటు అనుబంధ పరిశ్రమలకు రూ.1,614 కోట్ల పెట్టుబడులు
- రాయలసీమ యువతకు భారీగా ఉద్యోగావకాశాలు
- అనంతపురం అభివృద్ధికి మహర్దశ



ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యం దిశగా మరో కీలక ముందడుగు పడుతోంది. రాష్ట్రంలో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం కియా ఇండియా తన అనంతపురం ప్లాంట్‌ను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది. సుమారు 1.5 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.15 వేల కోట్లు పెట్టుబడితో తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏటా 3 లక్షల నుంచి 5 లక్షల వాహనాలకు పెంచే ప్రణాళికలో ఉంది. ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న 31వ భాగస్వామ్య సదస్సులో ఈ విస్తరణకు సంబంధించిన ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది.

లోకేష్ మార్క్...

నూతన పరిశ్రమలు గ్రౌండింగ్ అయి, నిర్మాణం పూర్తి చేసుకొని, కార్యకలాపాలు మొదలై యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఎంతో సమయం పడుతుంది. కానీ ఉన్న పరిశ్రమలు విస్తరణ జరిగితే ఉద్యోగాలు త్వరగా వస్తాయి. ఆ ఉద్దేశంతోనే మంత్రి నారా లోకేష్ దక్షిణ కొరియా పర్యటనలో కియా ఉన్నతాధికారులతో జరిపిన చర్చలు ఈ విస్తరణ ప్రతిపాదనకు కీలక ప్రాతిపదికగా నిలిచాయి. కేవలం ఒక పరిశ్రమ విస్తరణకే పరిమితం కాకుండా, దానికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, సరఫరా వ్యవస్థ, ఇతర పారిశ్రామిక కార్యకలాపాలను కూడా రాష్ట్రంలోనే అభివృద్ధి చేయాలన్న వ్యూహంతో మంత్రి లోకేష్ చొరవ తీసుకున్నారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో కియా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీతో పాటు సంస్థ గ్లోబల్ ప్రతినిధులతో లోకేష్ సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడుల విస్తరణకు ఉన్న అవకాశాలను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, హైబ్రిడ్ వాహనాలు, ప్లాట్‌ఫామ్ బియాండ్ వెహికల్స్ (పీబీవీ) తయారీ వంటి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కార్యకలాపాలు విస్తరించాలని ప్రతిపాదించారు. పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు, విధానపరమైన స్థిరత్వం, నిరంతర ప్రభుత్వ సహకారం అందిస్తామని 3 ఎస్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానాన్ని వివరించి పెట్టుబడిదారులకు భరోసా కల్పించారు. అనంతరం ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) ద్వారా సంస్థ ప్రతినిధులతో నిరంతర సంప్రదింపులు, ప్రతిపాదనలపై ఫాలోఅప్ కొనసాగింది. ఈ కృషి కియా విస్తరణతో పాటు దాని అనుబంధ పరిశ్రమలను కూడా ఆకర్షించే దిశగా సాగుతోంది.

అనుబంధ పరిశ్రమలకు రూ.1,614 కోట్ల పెట్టుబడులు

కియా విస్తరణతో పాటు అనంతపురం ప్రాంతంలో ఆటోమొబైల్ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కూడా మార్గం సుగమమవుతోంది. దక్షిణ కొరియాకు చెందిన మూడు సంస్థలు అనంతపురం కియా సమీపంలో మొత్తం రూ.1,614 కోట్ల పెట్టుబడులతో విడిభాగాల తయారీ ప్లాంట్‌లను నెలకొల్పుతున్నాయి. వాహన విడిభాగాల తయారీలో కీలకమైన ఈ సంస్థల రాకతో అనంతపురంలో పూర్తిస్థాయి ఆటోమొబైల్ పారిశ్రామిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. వాశిన్ (Hwashin) సంస్థ రూ.850 కోట్లతో వాహన ఛాసిస్, ఇతర విడిభాగాల తయారీకి, సెయోన్ (Seoyon) సంస్థ రూ.514 కోట్లతో ఇంటీరియర్, డోర్ ట్రిమ్స్, ప్లాస్టిక్ విడిభాగాల తయారీకి, ఇవామెట్ (Iwamet) సంస్థ రూ.250 కోట్లతో ప్రెసిషన్ మెటల్ కాంపోనెంట్స్, ఆటో బాడీ విడిభాగాల తయారీకి పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ పరిశ్రమలు కియా ఉత్పత్తి వ్యవస్థకు అవసరమైన విడిభాగాలను అందించడంతో పాటు స్థానికంగా మరిన్ని అనుబంధ వ్యాపారాలకు అవకాశాలు కల్పించనున్నాయి.

చంద్రబాబు వేసిన పునాదికి లోకేష్ విస్తరణ

2017లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కియా పరిశ్రమను అనంతపురానికి తీసుకురావడం ద్వారా రాయలసీమ పారిశ్రామిక ప్రస్థానంలో కీలక మలుపునకు శ్రీకారం చుట్టారు. రూ.13 వేల కోట్ల పెట్టుబడితో ఈ సంస్థ గ్రౌండ్ అవ్వగా ఇప్పటివరకు మొత్తం 24,237 ఉద్యోగాలు కల్పించింది. ఏటా కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలకు పన్ను రూపేణా రూ.10 వేల కోట్ల ఆదాయం ఇస్తోంది. అంతర్జాతీయ ఆటోమొబైల్ సంస్థ కియాను రాష్ట్రానికి తీసుకొచ్చి అనంతపురాన్ని ప్రపంచ పారిశ్రామిక పటంలో చంద్రబాబు నిలిపారు. ఇప్పుడు అదే పరిశ్రమను మరింత విస్తరించే దిశగా మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారు. ఒకప్పుడు కియా పరిశ్రమను తీసుకురావడం ద్వారా పారిశ్రామిక పునాది వేసిన చంద్రబాబు.. ఇప్పుడు దాని విస్తరణ, అనుబంధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా మరింత బలమైన పారిశ్రామిక వ్యవస్థకు మార్గం సుగమం చేస్తున్నారు. కియా ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం ఐదు లక్షల వాహనాలకు చేరితే దాని ప్రభావం ఒక్క అనంతపురానికే పరిమితం కాదు. రాయలసీమలోని యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విడిభాగాల తయారీ, రవాణా, గిడ్డంగులు, నిర్వహణ, ఇతర సేవారంగాల్లోనూ కొత్త అవకాశాలు ఏర్పడతాయి. స్థానిక పారిశ్రామికవేత్తలకు కూడా కియా సరఫరా వ్యవస్థలో భాగస్వాములయ్యే అవకాశం ఉంటుంది.

సమర్థతకి, సంక్షేమానికే ప్రజలు పట్టం!

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కేవలం అధికార మార్పిడికి వేదికలు మాత్రమే కాదు.. ప్రజాపాలనకు ప్రజలు ఇచ్చే గీటురాళ్లు కూడా. పాలకుల పనితీరుకు, ప్రజల పట్ల వారి నిబద్ధతకు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఇచ్చే ప్రత్యక్ష తీర్పులు. ఆంధ్రప్రదేశ్ లో జరిగిన పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు ఈ వాస్తవాన్ని మరోసారి రుజువు చేశాయి. పట్టణాల నుంచి పల్లెల వరకు ప్రజల తీర్పులో కనిపించిన ఏకపక్ష తీర్పు వెనుక పాలనాపరమైన పనితీరు, అభివృద్ధిపై ఆశలు, సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు వంటి అంశాలు కీలకంగా నిలుస్తాయి. ఎన్నికల సమయంలో చేసిన హామీల కంటే.. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అందించిన సేవలే ఓటరు మనసులో నిలిచిపోతాయని ఈ ఫలితాలు నిరూపించాయి. ప్రజల అవసరాలను గుర్తించి, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే పాలనకు ప్రజలు ఏ స్థాయిలో ప్రాధాన్యత ఇస్తారో ఈ తీర్పు స్పష్టమవుతుంది. పాలకులకు ప్రజాసంక్షేమంపై ఎటువంటి బాధ్యత ఉందో ఆలోచించి.. సమర్థుల్ని, నిజాయితీపరుల్ని, ప్రజలపట్ల అంకితభావంతో వ్యవహరించే వారిని గుర్తించి అధికారం అప్పగిస్తారు. అనుక్షణం బాధ్యతాయుత విపక్షంగా ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యతను విస్మరించి స్వార్థ రాజకీయాలకు పాల్పడే వారికి పుట్టగతులు ఉండవని ప్రజలు తీర్పు ఇచ్చారు. ప్రజల్ని నేను విశ్వసించాను, వారు నన్ను విశ్వసిస్తారు అంటుంటారు సీఎం చంద్రబాబు. నేడు అదే నిజమైంది. అభివృద్ధి–సంక్షేమం పట్ల ప్రజలు కనబరిచిన అచంచల విశ్వాసమే పురపాలక, కార్పొరేషన్, జెడ్‌పీటీసీ–ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు. అవినీతికి, అక్రమాలకు, అరాచకులకు, అసమర్థులకు అండగా నిలవబోమని ఏపీ ప్రజలు మరోసారి తేల్చిచెప్పారు.

పల్లెల నుండి, పట్టణాల వరకు వీచిన కూటమి ప్రభంజనం!

ఆంధ్రప్రదేశ్‌లో ముగిసిన స్థానిక సంస్థల– పురపాలక, కార్పొరేషన్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయ చరిత్రలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టాయి. రాజకీయం అంటే కేవలం హామీలు కాదని, ప్రజలు కోరుకునేది పారదర్శకమైన సుపరిపాలన, మౌలిక అభివృద్ధి, నిజమైన సంక్షేమం అని ఈ తీర్పు స్పష్టం చేసింది. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు వీచిన కూటమి ప్రభంజనం చారిత్రాత్మక విజయాలను అందించగా, ప్రతిపక్ష వైసీపీ అడ్రస్ గల్లంతు కావడం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద మలుపు. ఇది కేవలం కూటమి సాధించిన విజయం మాత్రమే కాదు. పాలనా సమర్థతపై ప్రజలు ఇచ్చిన తిరుగులేని మ్యాండేట్. గత ఎన్నికల్లో తిరుగు లేని అధికారాన్ని చేపట్టిన పలు కీలక స్థానాల్లో కూడా వైసీపీ ఉనికి కోల్పోయింది. ప్రాంతాలతో నిమిత్తం లేకుండా ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ మొత్తం అన్ని ప్రాంతాలలో పురపాలక, కార్పొరేషన్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలలో ఒకే విధమైన ఫలితాలతో కూటమికి జనం జేజేలు పలికారు. ఈ ఫలితాలను రెండున్నరేళ్ల కూటమి పాలనపై ప్రజలు వ్యక్తం చేస్తున్న అభిప్రాయానికి రాజకీయ కొలమానంగా చూడాలి. 87 పురపాలికల్లో కూటమిలోని మూడు పార్టీలు దక్కించుకున్నవి 95 శాతం. వైసీపీ గెలుచుకున్న మున్సిపాలిటీలు మూడే. వైసీపీ గెలుపు శాతం కేవలం 3.5. శాతం. ఇండిపెండెంట్లు రెండు చోట్ల గెలిచి 2.3 శాతం ఫలితాలను దక్కించుకున్నారు. రాష్ట్రంలో 13 నగరపాలక సంస్థలకు ఎన్నికలు జరిగగా అందులో కూటమి 12 కార్పొరేషన్లను దక్కించుకుంది. ఇందులోనూ కూటమి 95 శాతంపైనే గెలుపు నమోదైంది. వైసీపీ ఒక్క చోటే అనంతపురం కార్పొరేషన్‌లో విజయం సాధించింది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర్‌పంచాయతీలలో మొత్తం 3,942 వార్డు/డివిజన్లకు గాను తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఘనవిజయం సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జెడ్పీటీసీ లలో 77 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 9,821 ఎంపీటీసీ స్థానాలలో 2,051 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎన్నికలలో జెడ్పీటీసీలు కూటమి టీడీపీ, జనసేన, బిజెపి 90 % పైగా స్థానాల్లో ఘన విజయం విజయం సాధించనున్నాయి. ఎంపీటీసీలు కూటమి అభ్యర్థులు మెజారిటీ మండలాల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటున్నారు.

జగన్ కోల్పోయిన ప్రజా విశ్వాసానికి తిరుగులేని సంకేతం!

చివరకు జగన్ సొంత జిల్లా కడపలో పులివెందుల జెడ్పీటీసీ స్థానాన్ని సైతం టీడీపీ అభ్యర్థి (భారతి) 1,463 ఓట్ల మెజారిటీతో గెలుపొందడం ఈ ప్రభంజనానికి నిదర్శనం. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఫ్యాన్ రెక్కలు తెగిపడ్డాయి. వాపు చూసుకొని బలుపు అనుకోని విర్రవీగిన ఆ పార్టీ అనాయకత్వానికి ఓటర్లు దిమ్మతిరిగే తీర్పు ఇచ్చారు. దగాకోరు రాజకీయంపై ప్రజానీకమే అభిశంసన కొరడా ఝళిపించడంతో ఆ పార్టీ నాయకులకు దిక్కుతోచడం లేదు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను విస్మరించి ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, అసలు అసెంబ్లీ ముఖమే చూడకుండా కాడి పడేసిన పార్టీని ఎలా నమ్మాలని ఫలితాల ద్వారా జనం రుజువు చేశారు. అర్హత లేకపోయినా సరే ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానంటూ భీష్మించుకొని రాష్ట్రంలోనే ఉండకుండా బెంగళూరు మకాం మార్చిన జగన్ ను ప్రజలు బండకేసి బాదారు. మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల కోసం ఏం చేస్తారో చెప్పకుండా రప్పారప్పా నరుకుతాం, పొట్టేళ్లను బలిచ్చినట్లు రాజకీయ ప్రత్యర్థులను బలిఇస్తామంటున్న వైసీపీని మట్టుపెట్టారు. అధికారం పోయాక కూడా అమరావతి వద్దు 'మావిగన్' ముద్దు అంటూ కొత్త పల్లవి ఎత్తుకొన్న జగన్‌కి జనం బుద్ధి చెప్పారు. అందుకే 2024 ఎన్నికల్లోనే కాకుండా ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలలో కూడా అదే ఫలితాలు పునరావృతమవడం జగన్ కోల్పోయిన ప్రజా విశ్వాసానికి తిరుగులేని సంకేతం.

బ్యాలెట్ ఫలితాల పై ఏమి సమాదానం చెబుతారు?

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చిన తీర్పు కేవలం తాత్కాలికం కాదని, అది ఒక సుదీర్ఘ రాజకీయ పరిణామం తాలూకు పునాది అని 'పుర పోరు' జడ్‌పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు మరోసారి రుజువు చేశాయి. జగన్ ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాల్సివుంది. 2024 లో ఓటమికి ఈవీఎంలను తప్పు పట్టిన జగన్ ఇప్పుడు బ్యాలెట్ ఫలితాల పై ఏమి సమాదానం చెబుతారు? ఈవీఎంలను, ఎన్నికల వ్యవస్థను, అదికార పార్టీని నిందించడం కంటే ప్రజలు తనకు ఎందుకు దూరమయ్యారో విశ్లేషించుకోవాలి. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను తక్కువగా అంచనా వేసిన జగన్ రెడ్డికి ఈ ఎన్నికల ఫలితాల తర్వాత అయినా కనువిప్పు కావాలి. ప్రజల అభిమానాన్ని పొందకుండా, వారి సమస్యలను పరిష్కరించకుండా, కేవలం వ్యక్తిగత విమర్శలు, అబద్ధాలు, రాజకీయ కక్షలు, ఆరోపణలతో కాలం గడిపితే ప్రజలు ఎంతటి గుణపాఠమైనా నేర్పగలరని ఈ మున్సిపల్, జడ్‌పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిరూపించాయి. ఇది కేవలం కూటమి పార్టీల విజయం మాత్రమే కాదు.. బాధ్యతాయుతమైన పాలన కావాలని, అభివృద్ధి పరుగులు తీయాలని, తమ పిల్లలకు ఉద్యోగాలు రావాలని, తమ ప్రాంతాలు బాగుపడాలని ఆకాంక్షిస్తున్న ప్రజల ఆకాంక్షలకు లభించిన విజయం ఇది. ప్రజల తీర్పును గౌరవించి, మరింత బాధ్యతతో పనిచేయాల్సిన బాధ్యత ఇప్పుడు కూటమిపై ఉంది. అట్లాగే ఓడిన వారు అహంకారాన్ని వీడి ప్రజల మధ్యకు వెళ్లాలి. అందుకే రాజకీయ నాయకులు గుర్తుంచుకోవాల్సిన ఒకే ఒక్క సత్యం. అధికారం శాశ్వతం కాదు. పదవులు శాశ్వతం కాదు. ప్రజలే శాశ్వతం అని గుర్తు పెట్టుకోవాలి.

- నీరుకొండ ప్రసాద్

జోన్ - 1 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం

జగన్ మేనత్త ఊరిలో టీడీపీ గెలుపు... తోడికోడళ్ల పోరులో జనసేన పైచేయి !

● తమ్మినపట్నంలో ఒక్క ఓటు తేడాతో అరుణ విజయం... చంద్రవరంలో మూడు ఓట్ల ఆధిక్యంతో టీడీపీ గెలుపు

పాచిపెంటలో తండ్రి, కుమార్తెకు విజయం... పెదమల్లంలో తోడికోడళ్ల పోరులో జనసేన అభ్యర్థి గెలుపు

అమరావతి (చైతన్యరథం): ఏపీ పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పలు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల స్వల్ప ఓట్ల తేడాతో అభ్యర్థులు గెలుపొందగా.. మరికొన్ని చోట్ల కుటుంబ సభ్యుల మధ్యే రాజకీయ పోరు సాగింది. ఒకచోట తండ్రి, కుమార్తె విజయం సాధించగా.. మరోచోట తోడికోడళ్ల మధ్య జరిగిన పోటీలో కూటమి అభ్యర్థి గెలిచారు. ఎన్టీఆర్ జిల్లా గణపవరంలో 20 ఏళ్ల తర్వాత టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి విజయం సాధించారు. ఈ గ్రామం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరి, జగన్ మేనత్త విమలమ్మ స్వగ్రామం కావడం గమనార్హం. నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో టీడీపీ అభ్యర్థి అరుణ రీకౌంటింగ్ తర్వాత ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. తొలుత ఆరు ఓట్ల తేడా రావడంతో అధికారులు మళ్లీ లెక్కింపు చేపట్టారు. ఫలితం వెలువడిన తర్వాత వైకాపా అభ్యర్థి కౌంటింగ్ కేంద్రం వద్ద బైఠాయించి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం చంద్రవరం ఎంపీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి కాట్రూ శ్రీనివాసరావు కేవలం మూడు ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం మాతుమూరు, పాంచాలి ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసిన తండ్రి జి.యుగంధర్, కుమార్తె కావ్య గెలుపొందారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పెదమల్లంలో తోడికోడళ్ల మధ్య జరిగిన పోరులో జనసేన అభ్యర్థి బోడపాటి మంగదేవి 18 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి 1, 2 ఎంపీటీసీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు తుమ్మ కల్పన, గొడుగుల బంగార్రాజు గెలుపొందారు. నక్కపల్లి-2 పరిధిలోనే హోంమంత్రి అనిత నివాసం ఉండటం గమనార్హం. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు సందర్భంగా బ్యాలెట్ బాక్సులో ఓట్లతోపాటు కరపత్రాలు బయటపడ్డాయి. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల బ్యాలెట్ బాక్సుల్లో ఈ కరపత్రాలను గుర్తించారు. గ్రామానికి వెళ్లే రహదారిలో రైల్వే గేటు వద్ద యూ ఆకారంలో అండర్‌పాస్ నిర్మించవద్దని, ప్రధాన రహదారికి అనుసంధానంగా బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు వాటిలో విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ స్పందించాలని కోరారు. తిరుపతి రూరల్ జడ్పీటీసీ స్థానంలో వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, టీడీపీ అభ్యర్థి ధనలక్ష్మి తరఫున వారి కుటుంబ సభ్యులు కౌంటింగ్ కేంద్రానికి వచ్చి లెక్కింపును పరిశీలించారు. మరోవైపు పోస్టల్ బ్యాలెట్లలో చెల్లని ఓట్లు భారీగా నమోదయ్యాయి. అల్లూరి జిల్లా అనంతగిరిలో 137 పోస్టల్ ఓట్లకు 91 చెల్లనివిగా తేలాయి.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ప్రజాసేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగుతాం

: ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని, కుటుంబసభ్యులు, ఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ శ్రీలంక శ్యామలరావు, కూటమి పార్టీల ముఖ్య నాయకులతో కలిసి శనివారం రణస్థలం మండల కేంద్రంలోని ఎస్‌కేసీఎం గోసేవా ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో కూటమి అభ్యర్థులందరూ ఘనవిజయం సాధించి 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయధ్వంకా మోగించాలని స్వామివారిని ప్రార్థించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దార్శనిక నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో మరింత పురోగమిస్తూ, లక్ష్యంగా నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర సాకారం కావాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులు, భగవంతుని అనుగ్రహంతో ప్రజాసేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగాలని ఈ జన్మదిన సందర్భంగా సంకల్పించారు.

ఓట్ల లెక్కింపులో ఊహించిన ట్విస్ట్... బ్యాలెట్ బాక్సుల్లో గ్రామస్థుల నిరసన పత్రాలు

నరసరావుపేట (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ (పరిషత్) ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ అత్యంత ఉత్కంఠభరితంగా సాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత నడుమ అధికారులు లెక్కింపు చేపడుతున్నారు. ఈ క్రమంలో నరసరావుపేట కౌంటింగ్ సెంటర్‌లో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది.. నరసరావుపేటలోని ఎఎమ్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లో బ్యాలెట్ బాక్సులు తెరిచిన అధికారులకు ఊహించని వింత అనుభవం ఎదురైంది. ఓట్ల లెక్కింపు కోసం బ్యాలెట్ బాక్సులు ఓపెన్ చేయగా, అందులో ఓటు కాగితాలతో పాటు గ్రామానికి చెందిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముద్రించిన వినతిపత్రాలు (పాంప్లెట్స్) లభ్యమయ్యాయి. సత్తెనపల్లి మండలం కంకాలపల్లి గ్రామానికి చెందిన ఓటర్లు ఈ వినూత్న నిరసనకు దిగినట్లు అధికారులు గుర్తించారు. తమ గ్రామానికి సమీపంలో నిర్మిస్తున్న U ఆకారపు ఆర్వోబీ (ROB) నిర్మాణం వల్ల స్థానికంగా ఎదురవుతున్న తీవ్ర ఇబ్బందులను ఆ పాంప్లెట్లలో ఏకరువు పెట్టారు. U ఆకారపు అండర్‌పాస్ వద్దని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నారా లోకేష్ తక్షణమే జోక్యం చేసుకుని ప్రధాన రహదారికి బ్రిడ్జిని నేరుగా లింక్ చేయాలని కోరుతూ తమ నిరసనను బ్యాలెట్ బాక్సుల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా.. ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇదిలాఉంటే.. ఏపీలో మొత్తం 7,767 MPTC, 582 ZPTC స్థానాలకు కౌంటింగ్ జరుగుతోంది. కాగా, ఇప్పటికే 77 ZPTC స్థానాలు, 2,051 MPTC స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్రంలోని 365 కేంద్రాల్లో మొత్తం 9,062 టేబుళ్లను



ఏర్పాటు చేశారు. ప్రతి రౌండ్‌లో 1,000 ఓట్ల చొప్పున లెక్కింపు ప్రక్రియ సాగుతోంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 40,679 మంది పోలీసులతో మూడంచెల భద్రతను నిర్మించారు. సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశారు.

సింహాచలం అప్పన్న సన్నిధిలో డ్రెస్ కోడ్



సింహాచలం (చైతన్యరథం): సింహాచలం దేవస్థానంలో సుదీర్ఘ కాలంగా చర్చ సాగుతున్న డ్రెస్ కోడ్ నిబంధనను అమలు చేయడానికి అధికారులు ఎట్టకేలకు సన్నాహాలు చేశారు. ఇటీవల జరిగిన దేవస్థానం ధర్మకర్తల మండలిలో ఆమోదం పొందడంతో త్వరలోనే అమలు చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఇకపై అప్పన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాల్సి ఉంటుందని దేవస్థానం ఈవో జల్లేపల్లి వెంకటరావు తెలిపారు. దర్శనానికి వచ్చే పురుషులు ధోతి, పంచె, కుర్తా పైజామా, సాధారణ ప్యాంట్, షర్ట్, మహిళలు చీర, లంగా ఓణీ, దుపట్టాతో కూడిన చుడీదార్ ధరించాలన్నారు. బాలలు అసభ్యతకు తావులేని సంప్రదాయ దుస్తులు ధరించాలన్నారు. ఆర్జిత సేవలు, ప్రత్యేక పూజల్లో పాల్గొనే పురుషులు తప్పనిసరిగా ధోతీ, పంచె, కుర్తా, పైజామా ధరించాలన్నారు. మహిళలు చీర, లంగా ఓణీ, దుపట్టా ధరించిన చుడీదార్లు మాత్రమే ధరించాలని సూచించారు. నిక్కర్లు, షార్టులు, టీషర్టులు, స్లీవ్స్ టాప్లు, మోడ్రన్, వెస్ట్రన్ దుస్తులు ధరించి వచ్చే భక్తులకు ఆలయ ప్రవేశానికి అనుమతి లేదని తెలిపారు. ఆలయ పవిత్రతను కాపాడడంతో పాటు ఆధ్యాత్మిక, సనాతన సంస్కృతి పరిరక్షణలో భాగంగా నియమావళి అమల్లోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. దుస్తుల నింబధనలపై భక్తులందరికీ అవగాన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నట్లు ఈవో తెలిపారు.

ఏపీ పరిషత్ ఎన్నికల్లో సన్సేషన్ క్రియేట్ చేసిన అభ్యర్థులు...

రాష్ట్రంలోని అత్యధికంగా 30వేలకు పైగా మోజార్టీతో రికార్డ్





అమరావతి (చైతన్యరథం): ఏపీ పరిషత్ ఎన్నికల్లో కొంతమంది అభ్యర్థులు సెన్సేషన్ క్రియేట్ చేశారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో రికార్డ్ సృష్టించారు. ప్రత్యర్థులపై వేరే లెవల్లో పై చేయి సాధించారు. పల్నాడు జిల్లా క్రోసూరులో జనసేన అభ్యర్థి పమిడిపాటి శ్రీనివాసరావు ఏకంగా 30 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం జరిగింది. ఇక్కడ మొత్తం 50 వేల 661 ఓట్లకు.. 38 వేల 7 వందల 02 ఓట్లు పోలయ్యాయి. ఇక నకరికల్లు టీడీపీ జడ్పీటీసీగా డాక్టర్ నాగోతు వెంకటలక్ష్మీ సరోజ 32 వేల 9 వందల 19 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో టీడీపీ శ్రేణులు విజయ సంబరాలు చేసుకుంటున్నాయి.

మాచవరం మండలంలో కూటమి అభ్యర్థి భారీ విజయం..

అంతేకాదు పల్నాడు జిల్లాలోని మాచవరం మండలంలోనూ కూటమి అభ్యర్థి కూడా భారీ విజయం పొందారు. తెలుగు దేశం తరఫున పోటీ చేసిన కత్తి సరోజిని 22 వేల 8 వందల 82 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తన సమీప వైసీపీ అభ్యర్థి దొండేటి వెంకాయమ్మపై ఆమె గెలవడం జరిగింది. మరోవైపు ప్రకాశం జిల్లా ముండ్లమూరు జడ్పీటీసీగా టీడీపీ తరుఫున పోటీ చేసిన అభ్యర్థి మందలపు సౌమ్య 18 వేల 728 ఓట్ల ఆధిక్యంతో విన్ అయ్యారు.

ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో...

వీరితో పాటు ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో టీడీపీ అభ్యర్థి పుత్త బ్రహ్మం 21 వేల 4 వందల ఏడు ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించగా.. మరోవైపు కడప జిల్లా వేంపల్లిలో వైసీపీ అభ్యర్థి బత్తల వెంకట శివమ్మ 19 వేల 2 వందల 03 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అదేవిధంగా ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలంలో టీడీపీ అభ్యర్థి చేరెడ్డి శ్రీలక్ష్మి 12 వేల 6 వందల 16 ఓట్ల మెజార్టీతో విజయ దుందుబీ మోగించారు. అలాగే కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలో తండ్రి, కుమార్తెలు ఎంపీటీసీలు గెలిచారు. కొత్తపేట 2 టీడీపీ అభ్యర్థి కుమార్తె చాందిని పలివెల గెలుపొందగా.. వైసీపీ అభ్యర్థిగా సత్యనారాయణ విజయం పొందారు.

పరిషత్ పోరులో బొత్స కుమార్తె అనూష ఓటమి

● 5136 ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి నీరజ గెలుపు

బొండపల్లి (చైతన్యరథం): పరిషత్ పోరులో కూటమి విజయపరంపర కొనసాగుతోంది. విజయనగరం జిల్లాలోని బొండపల్లి జడ్పీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. ఇక్కడి నుంచి పోటీ చేసిన వైసీపీ నేత, శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కుమార్తె అనూష ఓటమి పాలయ్యారు. బొత్స అనూషపై టీడీపీ అభ్యర్థి పాశల నీరజ 5,136 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నీరజ విజయంతో బొండపల్లిలో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. జిల్లా పరిషత్ చైర్పర్సన్ రేసులో ఉన్న అనూష ఓటమి పాలవడంతో వైసీపీ శ్రేణులు డీలాపడ్డాయి. వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కుటుంబం నుంచి నలుగురు జడ్పీటీసీ అభ్యర్థులుగా బరిలోకి దిగాలని ప్రయత్నించారు. పూసపాటిరేగ జడ్పీటీసీ స్థానానికి బొత్స తమ్ముడి కుమారుడు చైతన్య నామినేషన్ తిరస్కరణకు గురైంది. బొండపల్లి నుంచి



కుమార్తె అనుష, గరివిడి నుంచి కోడలు బొత్స పూజిత, గుర్ల మండలం నుంచి బొత్స సోదరి సంగంరెడ్డి వెంకటలక్ష్మి పోటీ చేశారు. స్థానిక ఎన్నికలకు ముందు తెదేపాలో చేరిన బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) కుమార్తె సిరి సహస్ర తెర్లాం జడ్పీటీసీ స్థానం నుంచి విజయం సాధించారు.

కార్తీక మాసం నేపథ్యంలో స్నానపు ఘాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో రాజమహేంద్రవరం నగరంలోని గోదావరి నదీ తీరాన ఉన్న స్నానపు ఘాట్లను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్తీక మాసంలో గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గోదావరి తీరంలోని పలు స్నానపు ఘాట్లను సందర్శించి అక్కడ ప్రస్తుతం ఉన్న పరిస్థితులను, భక్తుల రాకపోకలకు అనుకూలంగా ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఘాట్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త తొలగింపు, తాగునీటి సదుపాయం, విద్యుత్ లైటింగ్, మరుగుదొడ్ల నిర్వహణ, భక్తులు సురక్షితంగా నదిలోకి దిగేందుకు అవసరమైన ఏర్పాట్లను చూసారు. కార్తీక మాసంలో ముఖ్యంగా సోమవారాలు, పౌర్ణమి వంటి విశేష పర్వదినాల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఘాట్ల వద్ద ఎక్కడా అపరిశుభ్రత కనిపించకుండా నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, భక్తులకు అవసరమైన చోట్ల తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉంచాలని తెలిపారు. రాత్రి వేళల్లో సైతం భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నదిలో నీటి ప్రవాహం, లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది, పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు పుణ్యస్నానాలు ఆచరించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాజమహేంద్రవరం గోదావరి పుణ్యక్షేత్రంగా ఎంతో ప్రత్యేకత కలిగి ఉందని, కార్తీక మాసంలో ఇక్కడికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు సురక్షితమైన, ఆహ్లాదకరమైన సౌకర్యాలు కల్పించడం అందరి బాధ్యత అని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు.

ప్రజలకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ దీపావళి శుభాకాంక్షలు



ఏలూరు (చైతన్యరథం): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగ ప్రతి ఒక్కరిలో సరికొత్త ఆశలు, సానుకూల ఆలోచనలు, నూతన ఉత్సాహాన్ని నింపాలని పేర్కొన్నారు. ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని, సమాజంలో శాంతి, సామరస్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి దీపావళి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, పండుగ సంబరాల సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ, పర్యావరణానికి మరియు ఇతరులకు ఇబ్బంది కలగకుండా సురక్షితంగా దీపావళిని జరుపుకోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ సూచించారు.

మానవసేవే మాధవ సేవగా భావించి ప్రజలకు సేవ చేయండి

● కౌన్సిలర్లకు సూచించిన టీడీపీ మాజీ ఎమ్మెల్సీ వై.వీ.బీ రాజేంద్రప్రసాద్



ఉయ్యూరు (చైతన్యరథం): మున్సిపల్ ఎన్నికలలో గెలిచిన 21,17,31,30 వార్డుల కౌన్సిలర్లు రాజేంద్రప్రసాద్‌ని మర్యాదపూర్వకంగా వారి స్వగృహంలో కలిసి తమ విజయంలో కీలక పాత్ర పోషించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వై.వీ.బీ రాజేంద్రప్రసాద్‌ని సత్కరించారు. కౌన్సిలర్లు, బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని ఈ సందర్భంగా కౌన్సిలర్లకు వై.వీ.బీ సూచించారు. అనంతరం వై.వీ.బీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ప్రజలు మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని మానవసేవే మాధవసేవగా భావించి ఉయ్యూరు పట్టణ ప్రజలకు సేవ చెయ్యాలని, పట్టణ అభివృద్ధి కోసం మీరు చేసే కృషిలో నేను ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటానని రాజేంద్రప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 21 వార్డ్ కౌన్సిలర్ పలియాల రూపా దేవి,17 వార్డ్ కౌన్సిలర్ రామనోళ్ళ శ్రీకాంత్, 30వ వార్డు కౌన్సిలర్ రాజుల పాటి ఫణి, 31వ వార్డు కౌన్సిలర్ నేరుసు బాలకృష్ణ, పల్యాల రమేష్, మధు రాజులపాటి, హరికృష్ణ, సూర్య తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత రైతు నాయకుడు ఆచార్య ఎన్.జి రంగా

● బాపట్ల అగ్రికల్చర్ కాలేజీలో ఎన్.జి రంగా విగ్రహ ఆవిష్కరణ... పాల్గొన్న టీడీపీ నేతలు, కార్యకర్తలు



బాపట్ల (చైతన్యరథం): బాపట్ల పట్టణంలోని అగ్రికల్చర్ కాలేజీ ప్రాంగణంలో భారత రైతాంగ ముద్దుబిడ్డ, మహోన్నత రైతు నాయకుడు 'రైతు బాంధవుడు' ఆచార్య ఎన్.జి. రంగా 126వ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నాయకులు శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆచార్య రంగా నూతన విగ్రహాన్ని ఆవిష్కరించి, ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ... ఉమ్మడి గుంటూరు గడ్డపై, నిడుబ్రోలులో జన్మించిన ఆచార్య ఎన్.జి. రంగా... యావత్ భారత రైతాంగానికి ఒక ధైర్యాన్ని, గొంతుకను అందించిన మహనీయుడని కొనియాడారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టా పుచ్చుకుని, విదేశాలలో ఎన్నో ఉన్నత పదవులు అధిష్టించే అర్హత ఉన్నప్పటికీ... తన చదువు, ప్రతిభ పరాయి దేశాల కోసం కాకుండా కష్టపడే మన రైతుల కోసం, కన్నీళ్లు పెట్టుకునే వ్యవసాయ కూలీల కోసమేనని మాతృభూమికి తిరిగి వచ్చిన గొప్ప దార్శనికుడు అని తెలిపారు. 1933లోనే నిడుబ్రోలులో రైతుల కోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసి, రైతు బిడ్డలకు రాజకీయ, ఆర్థిక శాస్త్రాలను నేర్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. దాదాపు ఆరు దశాబ్దాల పాటు పార్లమెంటులో సభ్యుడిగా సేవలందించి, గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించిన ఏకైక ప్రజాప్రతినిధి రంగానని గుర్తుచేశారు. ఢిల్లీ పార్లమెంటులో ఏ ప్రధానమంత్రి ఉన్నా, ఏ చట్టం చర్చకు వచ్చినా... "దీనివల్ల నా దేశ రైతుకు, నా పల్లెటూరి రైతుకూలీకి ఏం న్యాయం జరుగుతుంది?" అని నిలదీసిన ఆ ధైర్యశాలి ఆశయాలను మనం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ప్రజల్లో ఉండే అర్హత జగన్‌కు లేదు : గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): రాష్ట్ర ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు మరోసారి తమ ఓటు ద్వారా తీర్పునిచ్చారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఈ మేరకు మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల ఫలితాలు మరోసారి కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచాయని చెప్పారు. గత వైఎస్ఆర్ సీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని నరకప్రాయంగా మార్చారని తెలిపారు. రెండున్నరేళ్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రెండు నెలల కూటమి పాలన రిఫరెండంగా చెప్పవచ్చని, తాజాగా ఓటర్లు అందించిన తీర్పే దీనికి నిదర్శనమని తెలిపారు

నాలుగు రోజులైన తగ్గుముఖం పట్టని వరదనీరు... నీళ్లలోనే పంటలు



తాళ్లపూడి (చైతన్యరథం): మురసు తుపాను ప్రభావంతో తాళ్లపూడి మండలంలో భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు పంటచేలు నీటమునిగాయి. ఒక వైపు కుండపోత వర్షం.. మరో వైపు కొవ్వాడ కాలువ వరద ఉద్ధృతికి పంట పొలాలు గోదారిని తలపిస్తున్నాయి. నాలుగు రోజులైన వరదనీరు తగ్గుముఖం పట్టలేదు. బయ్యవరం సమీపంలోని పోచవరం, తాడిపూడికి చెందిన పంటభూములు పూర్తిగా నీటమునిగాయి. గజ్జరం సంగం చెరువు, అన్నదేవరపేటలోని రెండు కల్వర్టుల సమీపంలో తిరుగుడుమెట్ట, పెద్దేవం, మలకపల్లి, కుకునూరు పంటచేలు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. ప్రక్కిలంక ఏటిగట్టు నుంచి అన్నదేవరపేటమీదుగా గోపాలపురం వెళ్లే రహదారిలో ఇంకా వరదనీరు ప్రవహిస్తోంది. తాడిపూడి నుంచి పోచవరం, అన్నదేవరపేట నుంచి తిరుగుడుమెట్ట, వెంకటాయపాలెం రహదారులు ఇంకా వరదనీటిలోనే ఉన్నాయి. పెద్దేవం, మలకపల్లి నుంచి తిరుగుడుమెట్ట వెళ్లే రహదారుల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ద్విచక్ర వాహనచోదకులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ రహదారుల్లో కొన్నింటిలోనూ మాత్రమే లారీలు, ట్రాక్టర్లపై రాకపోకలు సాగిస్తున్నారు.

మచిలీపట్నం అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి : మంత్రి కొల్లు రవీంద్ర

●ఓట్లేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

●మచిలీపట్నం మున్సిపల్ ఎన్నికల అభ్యర్థుల అభినందన సభ



మచిలీపట్నం (చైతన్యరథం): ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం వేడుక కన్వెన్షన్ హాల్‌లో మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేసిన అభ్యర్థులు, విజయం సాధించిన కార్పొరేటర్లతో అభినందన సభ నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. మచిలీపట్నం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఒక కూలీలా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, విజయం సాధించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. మచిలీపట్నంలో మునుపెన్నడూ లేని విధంగా కూటమి అభ్యర్థులకు ప్రజలు భారీ మెజారిటీ అందించడం, వైసీపీ వైపు ప్రజలు మొగ్గు చూపడం లేదనే విషయాన్ని మరోసారి స్పష్టం చేసిందన్నారు. ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడం సంతోషకరమన్నారు. గెలుపుతో బాధ్యత మరింత పెరిగిందని, 60 డివిజన్లలో ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా పనిచేయాలని సూచించారు. పదవులు వచ్చాయనే అహంకారం లేకుండా అందరినీ కలుపుకొని మచిలీపట్నం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మహిళలకు కూటమి ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా పెద్దపీట వేసిందని, అభ్యర్థులు పడిన కష్టానికి ప్రజలు ఇచ్చిన తీర్పు ఈ విజయమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో విజయం సాధించిన ప్రతి ఒక్కరూ ఎలాంటి తప్పులకు తావివ్వకుండా, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు వాటిని ప్రతి గడపకు చేరేలా కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మచిలీపట్నం మేయర్‌గా ఎన్నికైన అబ్దుల్ అబిదా, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, జనసేన నాయకులు బండి రామకృష్ణతో పాటు కూటమి విజయం సాధించిన కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

నూజెండ్ల జడ్పీటీసీగా గెలిచిన బాల ప్రసాద్‌ను అభినందించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

వినుకొండ (చైతన్యరథం): స్థానిక ఎన్నికల్లో కూటమి బలపరిచిన జనసేన జడ్పీటీసీ అభ్యర్థి వెంకట బాలప్రసాద్ 28,863 ఓట్ల ఘనవిజయం సాధించారు. విజయానంతరం ఆయన వినుకొండ పట్టణంలోని చీఫ్ విప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు... విజేత వెంకట బాలప్రసాద్‌ను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. తన విజయం కోసం అహర్నిశలు శ్రమించిన కూటమి నాయకులకు, పొత్తు ధర్మాన్ని పాటించి ముందుకు నడిపిన కార్యకర్తలకు మరియు తనపై నమ్మకంతో గెలిపించిన ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు అని అభ్యర్థి బాల ప్రసాద్ తెలియజేశారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకానికి ఈ భారీ విజయం నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు



నిశంకర శ్రీనివాసరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంగవీటి రాధాకృష్ణకి ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందనలు

విజయవాడ (చైతన్యరథం): నగర పాలక సంస్థ (ఎవీజ) నూతన మేయర్‌గా ఎన్నికైన వంగవీటి రాధాకృష్ణని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి, గళ్ళా రామచంద్రరావు మర్యాదపూర్వకంగా కలిశారు.



ఈ సందర్భంగా ఆయనకు మొక్కను అందించి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తే నాయకుడు వంగవీటి రాధాకృష్ణ మేయర్‌గా ఎన్నికవ్వటం హర్షణీయమని, ఆయన సమర్థవంతమైన నాయకత్వంలో విజయవాడ నగరంలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి కీలక రంగాల్లో విశేష పురోగతి సాధించాలని, విజయవాడను ఒక ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సముద్రాన్ని తలపించిన చిలకలూరిపేటను పూర్తిగా చక్కదిద్దాం

●చిలకలూరిపేట చరిత్రలో గత 50ఏళ్లలో ఎన్నడూ లేనంత కుంభవృష్టి

●1000 విద్యుత్ స్తంభాలు, 1500కు పైగా నేలకూలిన చెట్లు

●తుపాను ప్రభావంతో మరణించిన వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ఆదుకుంటామని భరోసా కల్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): మురసు తుఫాన్ నియోజకవర్గాన్ని అతలాకుతలం చేసిందని, ప్రజలకు, ప్రభుత్వానికి భారీ నష్టాన్ని మిగిల్చిందని, చిలకలూరిపేట చరిత్రలో గత 50 ఏళ్లలో ఎన్నడూ లేనంత భారీ కుంభవృష్టి ఏకధారగా 4 గంటలపాటు నియోజకవర్గంపైనే కురిసిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. 3 రోజులు ఏకబిగిన రేయింబవళ్లు అన్నివిభాగాల అధికారులు, సిబ్బంది, నాయకులు కష్టపడి చిలకలూరిపేటను పూర్తిగా మెరుగుపరిచారని ఆయన తెలిపారు. శనివారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి తుపాను ప్రభావ నష్టాన్ని ప్రజలకు వివరించారు.

ఆ రోజు చిలకలూరిపేట సముద్రాన్ని తలపించింది..

3వ తేదీన నియోజకవర్గంపై మురసు తీవ్ర ప్రభావం చూపిందని, రాడార్ దృశ్యాల్లో, 4 గంటలపాటు రెడ్ మార్క్ నియోజకవర్గంపైనే కనిపించిందని, ఆదేరోజు సాయంత్రం నియోజకవర్గం మొత్తం సముద్రాన్ని తలపించిందని ప్రత్తిపాటి చెప్పారు. మురసు ధాటికి జనజీవనం స్తంభించిపోయిందని, ప్రజలు మూడ్రోజుల పాటు అష్టకష్టాలు పడ్డారని, చిమ్మచీకట్లో మగ్గిపోయి, నరకయాతన పడటం తనకెంతో బాధ కలిగిచిందని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. తుపాను ధాటికి 1000కి పైగా విద్యుత్ స్తంభాలు, 1500కు పైగా చెట్లు నేలకూలాయని, భీకర గాలుల ధాటికి భారీ చెట్లు కూడా పేకమేడల్లా నేలకొరిగాయన్నారు. దాంతో విద్యుత్ సరఫరా పూర్తిగా స్తంభించిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ విద్యుత్ సిబ్బంది ఏమాత్రం వెనకడుగు వేయకుండా, 3 రోజుల రేయింబవళ్లు శ్రమించి సరఫరాను పునరుద్ధరించారని ప్రత్తిపాటి చెప్పారు.

గత పాలకుల నిర్లక్ష్యమే.. పట్టణ ముంపునకు కారణం..

నియోజకవర్గంలోని 5 చెరువులకు పెద్దపెద్ద గండ్లు పడటం.. కుప్పగంజి, ఓగేరు, నక్కవాగుల ఉధృతికి కంపచెట్లు, పూడిక అడ్డుపడి నీటి ప్రవాహం అదుపుతప్పడం, దానికి తోడు జాతీయ రహదారులు 167ఏ, 16 నిర్మాణంలోని డిజైన్ల లోపాలతో ఒక్కసారిగా వరదంతా పట్టణాన్ని ముంచెత్తడంతో పరిస్థితి మరింత దిగజారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లోనూ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ చెరువులు, వాగులకు పడిన గండ్లు పూడ్చేందుకు యంత్రాంగం తీవ్రంగా శ్రమించిందన్నారు.

జగన్ అయితే.. ఇంటినుంచి బయటకే వచ్చేవాడు కాదు

ముఖ్యమంత్రి ముందుచూపు, సమర్థత వల్లే అర్నబ్, మురసు ప్రభావం నుంచి రాష్ట్రం త్వరగా కోలుకుందని, ఫ్లడ్ మేనేజ్ మెంట్‌లో తనకు ఎవరూ సాటి రారని చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారని ప్రత్తిపాటి కొనియాడారు. ఈ పరిస్థితుల్లో జగన్ సీఎంగా ఉంటే. ఇంట్లోనుంచి బయటకే వచ్చేవాడు కాదని, ఉత్తుత్తి ఆదేశాలతో కాలక్షేపం చేసేవాడని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు.

నీటమునిగిన ప్రతి ఎకరాకు నష్టపరిహారం అందిస్తాం..

తుపాను ప్రభావంతో మూడు మండలాల్లో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, దాదాపు 10వేల ఎకరాలకు పైగా కంది, పత్తి, మినుము, సజ్జ, మొక్కజొన్న పైర్లు, నీట మునిగాయని ప్రత్తిపాటి చెప్పారు. 1500 ఎకరాల్లో మిర్చి బాగా దెబ్బతిన్నదని, ఎన్నడూ లేనంతగా ఉద్యానపంటలు పూర్తిగా నీటమునిగాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు. రైతాంగానికి జరిగిన నష్టం ఎవరూ పూడ్చలేనిదని, పంట కోల్పోయిన ప్రతి రైతుకి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

ఎన్నికలు ఏకపక్షంగా జరిగితే, వైసీపీ ఓటు బ్యాంకు ఆ పార్టీకి ఎలా నమోదైంది..

ప్రజాస్వామ్యాన్ని, ప్రజల్ని తామే కాపాడినట్టు వైసీపీ నేతలు, ఆ పార్టీ అధినేత జగన్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, 2021 స్థానిక ఎన్నికల్ని అత్యంత అప్రజాస్వామికంగా, దుర్మార్గంగా నిర్వహించిన వారు, నేడు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగిన ఎన్నికల్ని తప్పుపట్టడం హాస్యాస్పదంగా ఉందన ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి 6 జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

●స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, పురపాలక శాఖ, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణల సలహా, సూచనలతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ నాయకత్వంలో ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున సాగుతున్న 'స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర' ఉద్యమ ఫలితంగా రాష్ట్రానికి ఆరు ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డ్స్ లో మన రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, రాజమండ్రి మున్సిపల్ కార్పోరేషన్లకు, కుప్పం మున్సిపాల్టీకి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులు ప్రకటించింది. రాష్ట్రానికి ఆరు ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డ్స్ దక్కడం ఎంతో గర్వకారణం అని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' ఉద్యమం ద్వారా రాష్ట్రంలో పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణలో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు.



ప్రజల భాగస్వామ్యం, మున్సిపల్ యంత్రాంగాల నిరంతర కృషితో జాతీయ స్థాయిలో ఈ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు లభించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెల 11న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డులు ప్రధానం చేస్తారని తెలిపారు. ఈ అవార్డ్స్ సాధించడంలో ఎనలేని కృషి చేసిన శానిటరీ వర్కర్స్‌కి ముందుగా తన హృదయపూర్వక ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు. సహకరించిన వివిధ స్థాయిలలోని అధికారులకు, ఉద్యమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు, శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమాన్ని మరింత ఉధృతంగా కొనసాగిద్దామని పట్టాభిరామ్ పిలుపు ఇచ్చారు.

గుంటూరు మేయర్ లక్ష్మీఅపర్ణకు టీడీపీ నేత మాదాల చైతన్య ఆత్మీయ విందు

గుంటూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ నాయకులు, జనచైతన్య గ్రూప్ అధినేత మాదాల చైతన్య స్వగృహంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ అల్పాహార విందుకు గుంటూరు నగర మేయర్ లక్ష్మీ అపర్ణ కోవెలమూడి, మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు. ఆప్యాయమైన పలకరింపులు, స్నేహపూర్వక సంభాషణల మధ్య ఎంతో ఆహ్లాదకరంగా సాగిన ఈ సమావేశంలో, గుంటూరు నగర మేయర్‌గా ఘన విజయం సాధించిన లక్ష్మీ అపర్ణకి మాదాల చైతన్య, మాదాల మీనా రత్న



హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అపర్ణకి జ్ఞాపికను అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమ పట్ల చూపిన ఆత్మీయతకు, అందించిన గౌరవానికి కోవెలమూడి దంపతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మస్తుతి... పరనింద వదిలి ఆత్మ విమర్శ చేసుకో జగన్

● ఫేక్ ప్రచారాలు, కుట్రలు విడనాడి ప్రజాస్వామ్యదారిలోకి రాకపోతే వైసీపీకి భవిష్యత్తు లేదు : ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ



గుంటూరు (చైతన్యరథం): 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చిన తీర్పు కేవలం తాత్కాలికం కాదని, అది ఒక సుదీర్ఘ రాజకీయ పరిణామం తాలూకు పునాది అని 'పుర పోరు' జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు మరోసారి రుజువు చేశాయని... జగన్ ఇప్పటికైనా ఆత్మస్తుతి... పరనింద వదిలి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. 2024 సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఓటమికి ఈవీఎంలను తప్పు పట్టిన జగన్... ఇప్పుడు బ్యాలెట్ ఫలితాలపై ఏమి సమాధానం చెబుతారు? అని ప్రశ్నించారు. ఈవీఎంలను, ఎన్నికల వ్యవస్థను, అధికార పార్టీని నిందించడం కంటే ప్రజలు తనకు ఎందుకు దూరమయ్యారో విశ్లేషించుకోవాలని మోహనకృష్ణ హితవు పలికారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను తక్కువగా అంచనా వేసిన జగన్‌రెడ్డికి ఈ ఎన్నికల ఫలితాలతో అయినా కనువిప్పు కలగాలన్నారు. ప్రజల అభిమానాన్ని పొందకుండా, వారి సమస్యలను పరిష్కరించకుండా, కేవలం వ్యక్తిగత విమర్శలు, అబద్దాలు, రాజకీయ కక్షలు, ఆరోపణలతో కాలం గడిపితే ప్రజలు ఎంతటి గుణపాఠమైనా నేర్పగలరని మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు మరోసారి నిరూపించాయన్నారు. ఇది కేవలం కూటమి పార్టీల విజయం మాత్రమే కాదని... బాధ్యతాయుతమైన పాలనకు నిదర్శమన్నారు. ప్రజల తీర్పును గౌరవించి, మరింత బాధ్యతతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఓడిన వారు అహంకారాన్ని వీడి ప్రజల మధ్యకు వెళ్లాలని, ఇకనైనా ఫేక్ ప్రచారాలు, కుట్రలు విడనాడి ప్రజాస్వామ్యదారిలోకి వైసీపీ రాకపోతే వారికి భవిష్యత్తు లేదన్నారు.

బిక్కవోలు మండలంలో 20 ఎంపీటీసీ స్థానాలు కూటమివే

అనపర్తి (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలోని బిక్కవోలు మండలంలో 20 ఎంపీటీసీ స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. అనపర్తి మండలంలోని ఎంపీటీసీ స్థానాలు, రామవరం ఎంపీటీసీ (బీజేపీ) ఏకగ్రీవమయ్యాయి. పెడవర్తి గ్రామం టీడీపీ ఏకగ్రీవమైంది. రామవరం ఎంపీటీసీ 2, స్వతంత్ర అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని 17 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగగా.. 16 స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించగా.. కుతుకులూరు 2 ఎంపీటీసీ స్థానాన్ని వైసీపీ దక్కించుకుంది.

తితిదే సాధికారిక మండలి సభ్యుడిగా దేవాదాయశాఖ కార్యదర్శి కన్నబాబు ప్రమాణస్వీకారం

ప్రమాణం చేయించిన తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి



తిరుమల (చైతన్యరథం): తితిదే సాధికారిక మండలి సభ్యుడిగా ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ సెక్రటరీ కే కన్నబాబు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద జరిగిన కార్యక్రమంలో తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కె.కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి సాధికారిక మండలి సభ్యుడిగా నియమించిన సీఎం చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, తన శక్తిమేరకు పూర్తిస్థాయిలో సేవలందిస్తానని తెలిపారు. శ్రీవారి ఆలయ ధార్మికత, విశిష్టతవిస్తరించేలా భక్తిశ్రద్ధలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, బోర్డ్ సెల్ డిప్యూటీ ఈవో ప్రశాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



గాలివీడు జడ్పీటీసీ ఎన్నికల్లో సుగవాసి చరిత్రాత్మక విజయం

29,821 వేల మెజారిటీతో గెలుపు

రాయచోటి (చైతన్యరథం): అన్నమయ్య జిల్లా గాలివీడు మండల జడ్పీటీసీ ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు ఘనవిజయం సాధించారు. రాష్ట్ర జడ్పీటీసీ ఎన్నికల చరిత్రలో అఖండ మెజారిటీతో సరికొత్త రికార్డును నెలకొల్పారు. 29,821 వేల మెజారిటీతో చరిత్ర తిరగరాసిన ఈ విజయం గాలివీడు ప్రజల అభిమానానికి, నమ్మకానికి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల అహర్నిశల కృషికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా విజేత సుగవాసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చేస్తున్న కృషి ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయన్నారు. గ్రామాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, యువతకు అవకాశాలు కల్పించాలనే కూటమి ప్రభుత్వ సంకల్పానికి గాలివీడు ప్రజలు తమ ఓటు ద్వారా బలమైన మద్దతు అందించారన్నారు. చంద్రబాబు సంక్షేమాభివృద్ధి పాలన... పవన్ కళ్యాణ్ ప్రజాసేవా దృక్పథం, లోకేష్ అభివృద్ధి కార్యాచరణ... ఈ విజయానికి ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచాయన్నారు. సైకిల్ గుర్తుపై ప్రజలు చూపించిన ఆదరణ, కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకానికి ప్రతిబింబంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గాలివీడు జడ్పీటీసీగా ఘన విజయం సాధించిన సుగవాసి ప్రసాద్ బాబు, ఎన్నికల అధికారుల నుంచి గెలుపు ధృవీకరణ పత్రం స్వీకరించారు. ఇది కేవలం విజయం ప్రజలు అందించిన అపారమైన ఆదరణకు, నమ్మకానికి నిదర్శనమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిపించి చరిత్ర సృష్టించిన గాలివీడు మండల ప్రజలకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకాళహస్తిలో కూటమి హవా



శ్రీకాళహస్తి (చైతన్యరథం): నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ హవా కొనసాగుతోంది. ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని రేణిగుంట, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో ఎంపీటీసీ ఎన్నికల ఫలితాల్లో టీడీపీ ఆధిపత్యం చాటుకుంది. రేణిగుంట మండలంలో మొత్తం 21 స్థానాలకు గాను 17 స్థానాలు ఏకగ్రీవం కాగా, ఎన్నికలు జరిగిన నాలుగు స్థానాల్లో టీడీపీ 3, బీజేపీ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. అలాగే ఏర్పేడు మండలంలో మొత్తం 16 స్థానాలకు గాను 15 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన ఒక్క స్థానంలో ఎన్నిక జరుగగా.. టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు. ఇక తొట్టంబేడు మండలంలో మొత్తం 12 స్థానాలు ఉన్నాయి. వాటిలో 6 స్థానాలు ఏకగ్రీవం కాగా, ఎన్నికలు జరిగిన మరో ఆరు స్థానాల్లో టీడీపీ 4, బీజేపీ ఒకటి, వైసీపీ ఒక స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. మూడు మండలాల్లోనూ అత్యధిక ఎంపీటీసీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకోవడంతో కూటమి శ్రేణుల్లో విజయోత్సాహం నెలకొంది.

ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే మేకపాటి వీరంగం



నెల్లూరు (చైతన్యరథం): జిల్లాలోని ఆత్మకూరులో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఎలాంటి అనుమతులు లేకుండా మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి కౌంటింగ్ హాల్‌లోకి చొరపడేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో ఆయనను అడ్డుకున్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలతో రెచ్చిపోయారు. పోలీసులు, పోలీసు అధికారులపై దౌర్జన్యం, తీవ్ర బెదిరింపులకు దిగారు. కౌంటింగ్ హాలు వద్ద వైసీపీ రౌడీ మూకలతో మేకపాటి హల్ ఛల్ సృష్టించారు. ఎన్నికల అధికారులు రమ్మన్నారంటూ పోలీసులతో బుకాయించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద నుంచి తిరిగి వెళ్లి, మరోసారి కౌంటింగ్ హాల్ వద్దకు మేకపాటి బయలుదేరారు. ఈ నేపథ్యంలో ఆయనను మధ్యలోనే పోలీసులు అడ్డుకున్నారు. మేకపాటిని అదుపులోకి తీసుకుని, ఆయన ఇంటికి తరలించారు. అయితే, ఆత్మకూరు నియోజకవర్గంలో 6 జడ్పీ స్థానాలను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది.



ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మాజీమంత్రి రోజా వీరంగం

నగరి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పరిషత్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా చిత్తూరు జిల్లా నగరి డిగ్రీ కళాశాల వద్ద మాజీ మంత్రి రోజా నిరసనకు దిగారు. ఇల్లత్తూరు ఎంపీటీసీ స్థానంలో తెదేపా అభ్యర్థి మూడు ఓట్ల ఆధిక్యంతో గెలుపొందినట్లు ఆర్వో ప్రకటించారు. దీంతో రీకౌంటింగ్ నిర్వహించాలని వైకాపా అభ్యర్థితో కలసి రోజా నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ఓ మహిళా కానిస్టేబుల్‌ను రోజా పక్కకు నెట్టేశారు. ఆ తర్వాత పోలీసులు కలగజేసుకొని ఆందోళనకారులను కౌంటింగ్ కేంద్రం దగ్గర నుంచి పంపించేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.



మూసాపేటలోనూ సుగవాసి విజయ పతాక

గాలివీడు (చైతన్యరథం): మూసాపేటలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ సీతారామాలయంలో అభిమానుల కోరిక మేరకు గాలివీడు జడ్పీటీసీగా ఘన విజయం సాధించిన సుగవాసి ప్రసాద్ బాబు విజయాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి 101 టెంకాయలు కొట్టి, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిపించి, స్వామివారి తీర్థప్రసాదాలను సుగవాసి ప్రసాద్ బాబు గారికి అందజేశారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గాలివీడు మండల అభివృద్ధికి కృషి చేయాలని అభిమానులు ఆకాంక్షించారు.

సొంత ఇలాకాలో జగన్‌కు ఝలక్

రాయల సీమలోనే కూటమి అభ్యర్థుల ప్రభంజనం



కడప (చైతన్యరథం): జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఏకంగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత ఇలాకాలో కూటమి అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. పులివెందుల, మైదుకూరు జడ్పీటీసీలను టీడీపీ కైవసం చేసుకుంది. పులివెందులలో 1,463 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి భారతి విజయం సాధించగా.. మైదుకూరులో 18,903 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి కృష్ణకిషోర్ గెలుపొందారు. పులివెందుల నియోజకవర్గంలో మొత్తం 65 ఎంపీటీసీ స్థానాల్లో 64 స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. వేంపల్లి మండలం రెడ్డిపల్లి ఎంపీటీసీకి మాత్రమే ఎన్నిక జరిగింది. అలిరెడ్డిపల్లిలో కూడా 29 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. అటు.. బద్వేల్ నియోజకవర్గం కాశినాయన మండలం జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి ఓబులమ్మ ఘన విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి బుర్ర నాగలక్ష్మి పై 8391 ఓట్ల భారీ మెజారిటీతో టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో వైసీపీ ఖాతా తెరవలేకపోయింది. ఎంపీటీసీ ఫలితాల్లో టీడీపీ అభ్యర్థులు దూసుకుపోతున్నారు. రామకుప్పం మండలం మనేంద్రం ఎంపీటీసీ టీడీపీ అభ్యర్థి 712 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కుప్పం మండలం నడుమూరు టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి 1166 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. శాంతిపురం మండలం సి.బండపల్లి టీడీపీ అభ్యర్థి 718 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా.. మొరసనపల్లి టీడీపీ అభ్యర్థి 494 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

కడప జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాల్లో కూటమి అభ్యర్థుల ప్రభంజనం కొనసాగుతోంది. జడ్పీటీసీ ఎన్నికల్లో వైకాపా కంచుకోటలను తెదేపా బద్దలుకొట్టింది. పులివెందుల జడ్పీటీసీ అభ్యర్థిగా భారతి 1,463 ఓట్ల తేడాతో నెగ్గారు. లింగాలలో తెదేపా అభ్యర్థి యమ్మనూరు సరళ దేవి.. 1,550 ఓట్ల తేడాతో గెలిచారు. బ్రహ్మంగారిమఠంలో తెదేపా జడ్పీటీసీ అభ్యర్థి నాగిపోవు పుల్లయ్య 17,295 ఓట్ల మెజారిటీతో, ఒంటిమిట్ట జడ్పీటీసీగా తెదేపా అభ్యర్థి కదిరి విజయమ్మ, పెద్ద ముడియం జడ్పీటీసీగా తెదేపా అభ్యర్థి ఆవుల ఓబులేసు 10,462 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కలపసాడులో జనసేన అభ్యర్థి భవనాసి పద్మావతి 1,567 ఓట్ల తేడాతో, గోపవరంలో తెదేపా అభ్యర్థి దాసరి చిన్నమ్మ 565 ఓట్ల తేడాతో జడ్పీటీసీగా గెలుపొందారు. మైలవరం జడ్పీటీసీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి పుత్తా బ్రహ్మం 21,407 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు.



మార్చి నాటికి రైలు సర్వీసులు ప్రారంభం

మడకశిరవాసుల చిరకాల కోరికపై కేంద్ర మంత్రి వి సోమన్న స్పందన

మడకశిర (చైతన్యరథం): శ్రీ సత్య సాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మడకశిరలో రైల్వే స్టేషన్ నిర్మాణ పనులను కేంద్ర రైల్వే శాఖ రాష్ట్ర మంత్రి వి. సోమన్నతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సోమన్న మాట్లాడుతూ.. మడకశిర ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించేలా పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాది మార్చి నాటికి మడకశిరలో రైల్వే సేవలు అధికారికంగా అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మున్సిపల్ చైర్మన్ గుండుమల శారద రాధాకృష్ణ, అలాగే స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో కూటమి కుటుంబ సభ్యులు హాజరై ఈ పర్యటనను విజయవంతం చేశారు.



సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

వెల్దుర్తి (చైతన్యరథం): మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. జాయింట్ డైరెక్టర్ జె.నరసింహనాయక్ నేతృత్వంలోని ఈ బృందంలో పీవీ కిరణ్, ఎన్. రమేశ్, వి. సురేశ్ ఉన్నారు. వీరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మౌలిక సదుపాయాలు, వైద్యసేవల నాణ్యతను పరిశీలించారు. అత్యవసర విభాగం, ఆపరేషన్ థియేటర్, రోగుల వార్డు, ఫార్మసీ, ల్యాబ్ తదితర అన్ని విభాగాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, వైద్యసిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లకు తగిన సలహాలు, సూచనలు అందజేస్తూ.. వృత్తిపరమైన నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఫార్మసీ, ల్యాబ్‌లలో కూడా పలు సూచనలు చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి, వైద్యసేవలు ఏవిధంగా అందుతున్నాయని వాకబు చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా, మెడికల్ ఆఫీసర్ బాలచంద్రారెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.





కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత

కడప (చైతన్యరథం): అనంతపురం, కర్నూల్ జిల్లాలోని ఆలూరు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతపురం జిల్లాలోని అనంతపురం కౌంటింగ్ హాల్ దగ్గర పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. అక్కడ కౌంటింగ్ ఏజెంట్లుగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరులు ఉండడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. అలాగే ఆత్మకూరులో జెడ్పీటీసీ అభ్యర్థికి సంబంధించిన ఓట్ల లెక్కింపులో.. తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నయనతరెడ్డి కౌంటింగ్ ఏజెంట్లుగా ఉండడం ఏంటని పలువురు రాజకీయ పెద్దలు ప్రశ్నిస్తున్నారు. వీరు కౌంటింగ్ హాల్‌లో ఉంటే, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయంటూ.. ఎమ్మెల్యే పరిటాల సునీత.. ఎస్పీ జగదీష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించగా.. ఇరువర్గాల వారు పరస్పరం దాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.



సమష్టి కృషితో సంపూర్ణ విజయం

సీఎం చంద్రబాబుపై నమ్మకానికి నిదర్శనమన్న మంత్రి సవిత

పెనుకొండ (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలో ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులందరూ ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నుంచి విజయ ధ్రువీకరణ పత్రాలు అందుకున్న అనంతరం పెనుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో పార్టీ కార్యాలయానికి చేరుకుని తమ ఆనందాన్ని పంచుకున్నారు. విజయం సాధించిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మంత్రి సవితమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు మరోసారి మద్దతు తెలిపారని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులే ఈ విజయాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు.ప్రజలు తెలుగుదేశం పార్టీపై, కూటమి ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కష్టపడి పనిచేయడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అభిప్రాయపడ్డారు.ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీటీసీ అభ్యర్థులందరూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు.రానున్న రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజల మధ్య ఉంటూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సవిత ఆకాంక్షించారు.



ఖండాంతరాల్లో దీపావళి సంబరాలు



న్యూయార్క్ : అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌లో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్నారు. ఆయనతో పాటు తన ప్రభుత్వంలోని ప్రముఖ భారతీయ, అమెరికన్ సభ్యులు, పారిశ్రామికవేత్తలు మైక్రాన్ టెక్నాలజీకి చెందిన సంజయ్ మెహ్రోత్రాతో సహా అగ్రశ్రేణి సీఈఓల సమక్షంలో ఓవల్ ఆఫీస్‌లో దీపావళిని జరుపుకున్నారు. అమెరికాలో భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, ప్రముఖ చెఫ్ వికాస్ ఖన్నా, పారిశ్రామికవేత్త విశాల్ గోండల్, ఐబిఎం సీఈఓ అరవింద్ కృష్ణ, ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్, యూఎస్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ డైరెక్టర్ జయ్ భట్టాచార్య తదితరులు హాజరయ్యారు.విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, సామాజిక భద్రతా పరిపాలన డిప్యూటీ కమిషనర్ అర్జున్ మోదీ కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ జ్యోతి ప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. హాజరైన వారిలో ధల్లా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రెసిడెంట్, సీఈఓ రూబీ ధల్లా, నాక్ సిస్టమ్స్ వ్యవస్థాపకుడు సీఈఓ రాజీవ్ శర్మ, కేశవం డీసీ ప్రెసిడెంట్ విశ్వజిత్ మల్లంపటి, ప్రెసిడెంట్ ఆహ్వానించిన అతిథి హేతల్‌కుమార్ పటేల్ ఉన్నారు. మరోవైపు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో ఈ వేడుకకు సంబంధించిన వివరాలను పంచుకుంటూ, గోక్వీ వ్యవస్థాపకుడు గోండల్, వేడుకల సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్‌కు 'హనుమాన్ చాలీసా' ప్రతిని బహూకరించినట్లు వెల్లడించారు. "ఓవల్ ఆఫీసులో వెలిగిన దీపాల వెలుగులో ఒక ప్రత్యేక క్షణం. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో కలిసి దీపావళిని జరుపుకోవడం గౌరవంగా భావిస్తున్నాను. ధైర్యం, భక్తి , శక్తి కోసం మనలో లక్షలాది మంది పఠించే, తులసీదాసు రచించిన 'హనుమాన్ చాలీసా'ను ఆయనకు బహూకరించడం నాకు గర్వకారణం" అని గోండల్ పేర్కొన్నారు.

2003లో శుభారంభం

వైట్ హౌస్‌లో దీపావళి జరుపుకునే సంప్రదాయం 2003లో అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ. బుష్‌తో ప్రారంభమైంది.గతంలో, ఈ వేడుకలు ప్రధానంగా ఐసెన్‌హోవర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీస్ భవనంలో జరిగేవి, వీటికి భారతీయ అమెరికన్ సమాజ సభ్యులు మరియు భారతీయ దౌత్యవేత్తలు హాజరయ్యేవారు. 2009లో, అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈస్ట్ రూమ్‌లో జరిగిన ఒక వేడుకలో వైట్ హౌస్‌లో దీపం వెలిగించిన మొదటి అధ్యక్షుడిగా నిలిచారు. అప్పటి నుండి, వైట్ హౌస్‌లోని ఓవల్ ఆఫీస్, రూజ్‌వెల్ట్ రూమ్‌తో సహా వివిధ ప్రదేశాలలో దీపారాధన కార్యక్రమాలు జరిగాయి.

శాన్ ఫ్రాన్సిస్కోలో విరజిమ్మిన వెలుగు రవ్వలు

శాన్ ఫ్రాన్సిస్కో : భారతీయ అమెరికన్ సమాజం ఐక్యతతో శాన్ ఫ్రాన్సిస్కోలో అత్యంత వైభవంగా దీపావళి వేడుకలు జరుపుకున్నారు. దీపావళి వైభవం, దీపావళి ప్రాముఖ్యత యావత్ ప్రపంచానికి తెలిసొచ్చేలా, అత్యంత ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకున్నారు. ఈ వేడుకలో భారతీయ, అమెరికన్ ప్రముఖులు, నగర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇండియాస్పోరా నిర్వహించగా, శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సుల్ జనరల్ సతీష్ శివన్ శాన్ ఫ్రాన్సిస్కో మేయర్ డేనియల్ లూరీ హాజరయ్యారు. ఇండియాస్పోరా వ్యవస్థాపకుడు ఎమ్మార్ రంగస్వామి కూడా వేడుకకు హాజరయ్యారు. శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ ఈ కార్యక్రమ వివరాలను ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో పంచుకుంటూ, ఇది దీపావళి సంప్రదాయాలను నగర నడిబొడ్డుకు తీసుకువచ్చిన ఒక చారిత్రాత్మక సందర్భమని అభివర్ణించింది.'శాన్ ఫ్రాన్సిస్కో సిటీ హాల్‌లో ఒక చారిత్రాత్మక దీపావళి వేడుక!' అని ఆ పోస్ట్‌లో పేర్కొంది. ఈ కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. కార్యక్రమంలో భారతీయ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమం భారతదేశం యునైటెడ్ స్టేట్స్ మధ్య ఉన్న శాశ్వత సాంస్కృతిక సంబంధాలను, శాన్ ఫ్రాన్సిస్కోకు భారతీయ, అమెరికన్ సమాజం అందించిన ఉజ్వలమైన సేవలను ప్రముఖంగా చాటింది.



అమెరికాలో ఎస్‌బీఐ విస్తరణ : చైర్మన్ చల్లా వెల్లడి



ఫ్రిస్కో : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన అంతర్జాతీయ విస్తరణలో భాగంగా అమెరికాలో మరో మైలురాయిని అధిగమించింది. ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి నేతృత్వంలో టెక్సాస్‌లోని డల్లాస్ ప్రాంతమైన ఫ్రిస్కోలో ఎస్‌బీఐ పూర్తి స్థాయి అనుబంధ సంస్థ అయిన 'ఎస్‌బీఐసీ బ్యాంక్' కొత్త శాఖను ప్రారంభించారు. కాలిఫోర్నియా వెలుపల ఎస్‌బీఐసీ బ్యాంక్‌కు ఇదే మొదటి శాఖ కావడం విశేషం. దీనితో అమెరికాలో ఎస్‌బీఐసీ బ్రాంచ్‌ల సంఖ్య ఎనిమిదికి చేరగా, ఇప్పటికే న్యూయార్క్, చికాగో, లాస్ ఏంజెల్స్‌లో మూడు ప్రత్యక్ష శాఖలు, వాషింగ్టన్ డీసీలో ప్రతినిధి కార్యాలయం కొనసాగుతున్నాయి. ఫ్రిస్కో నగరంలో ప్రారంభమైన ఈ కొత్త శాఖ ద్వారా రిటైల్ డిపాజిట్లు, కమర్షియల్ లెండింగ్, గ్లోబల్ రెమిటెన్సెస్ , ప్రత్యేక ఎన్ఆర్ఐ సేవలను అందించనున్నారు. భారత్–అమెరికా మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ విస్తరణ దోహదపడుతుందని చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 29 దేశాలలో 245 విదేశీ కేంద్రాలను కలిగి ఉన్న ఎస్‌బీఐ, 2026 సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికంలో తన విదేశీ అడ్వాన్సులు 22.86 శాతం వృద్ధితో రూ. 8,31,332 కోట్లకు, విదేశీ కార్యాలయాల డిపాజిట్లు 22.61 శాతం వృద్ధితో రూ. 2,83,319 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది.

అగ్రరాజ్యాధిపతి రేసులో ప్రతిభా భారతీయుడు



కాలిఫోర్నియా కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నా

అమెరికా అధ్యక్షుడి పదవి అంటే మామూలు విషయం కాదు. ప్రపంచం మొత్తం దాన్నే గమనిస్తూ ఉంటుంది. ఆ కుర్చీపై కూర్చోవాలంటే రాజకీయ అనుభవం ఒక్కటే సరిపోదు. దేశ ఆర్థిక వ్యవస్థపై అవగాహన ఉండాలి.. టెక్నాలజీ భవిష్యత్తును అంచనా వేయగలగాలి.. అంతర్జాతీయ వ్యవహారాలపై స్పష్టమైన దృష్టి ఉండాలి. అమెరికా సామాన్యుల సమస్యల నుంచి సిలికాన్ వ్యాలీ వంటి టెక్నాలజీ కేంద్రాల అవసరాల వరకు అర్థం చేసుకోగలగాలి. ఇలాంటి లక్షణాలున్న ఓ భారతీయ అమెరికన్ పేరు ఇప్పుడు 2028 అధ్యక్ష ఎన్నికల చర్చలో వినిపిస్తోంది. ఆయనే కాలిఫోర్నియా కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నా. అమెరికా రాజకీయాల్లో ఇప్పటికే తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న ఆయనను అధ్యక్ష ఎన్నికల బరిలోకి తీసుకురావాలంటూ మద్దతుదారులు ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించారు. రో ఖన్నా ఇంకా పోటీపై నిర్ణయం తీసుకోకపోయినా.. ఆయన రాజకీయ నేపథ్యం, విధానాలు, టెక్నాలజీ రంగంపై అవగాహన ఇప్పుడు ఈ చర్చకు కేంద్రంగా మారాయి. 2028 అధ్యక్ష ఎన్నికల్లో రో ఖన్నా పోటీ చేయాలనే డిమాండ్‌తో 'రన్ రో' పేరుతో ఓ ప్రచారం మొదలైంది. న్యూయార్క్‌కు చెందిన మాజీ డెమొక్రటిక్ కాంగ్రెస్ సభ్యుడు జమాల్ బౌమన్, ప్రోగ్రెసివ్ రాజకీయ వ్యూహకర్త నోమికి కాన్ట్ దీనికి నాయకత్వం వహిస్తున్నారు. రో ఖన్నాకు మద్దతుగా నిధులు సమీకరించడం, దేశవ్యాప్తంగా రాజకీయ మద్దతును కూడగట్టడం ఈ ప్రచారం లక్ష్యం. అమెరికా మధ్యంతర ఎన్నికలు ముగిసిన రెండు రోజులకే ఈ కార్యక్రమం ప్రారంభం కావడం విశేషం. అయితే ఈ ప్రచారం రో ఖన్నా స్వయంగా ప్రారంభించింది కాదు. ఆయనను అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేలా ప్రోత్సహించేందుకు మద్దతుదారులే ముందుకొచ్చారు. ఇప్పటికే అధ్యక్ష ఎన్నికలకు సంబంధించిన తొలి నామినేషన్ పోటీలు జరిగే రాష్ట్రాల్లో రో ఖన్నా పర్యటించినట్లు పొలిటికో వెల్లడించింది. దీంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి పెరుగుతోంది. తన అధ్యక్ష అభ్యర్థిత్వంపై రో ఖన్నా తొందరపడి ప్రకటన చేయలేదు. సెలవుల తర్వాత కుటుంబ సభ్యులతో చర్చించి.. తాను పోటీ చేయాలా? లేక మరో అభ్యర్థికి మద్దతు ఇవ్వాలా? అనేది నిర్ణయించుకుంటానని చెప్పారు. తనను ప్రోత్సహిస్తున్నవారి ప్రయత్నాన్ని స్వాగతించిన ఆయన, అమెరికా భవిష్యత్తుకు సంబంధించి తన ప్రాధాన్యాలను కూడా వెల్లడించారు. ప్రతి అమెరికన్‌కు ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా మెడికేర్ ఫర్ ఆల్ విధానాన్ని అమలు చేయడం, విదేశీ యుద్ధాలకు ముగింపు పలకడం, అత్యంత సంపన్నులపై పన్నులు పెంచడం వంటి అంశాలకు ఆయన ప్రాధాన్యం ఇస్తున్నారు. అంటే ఆర్థికంగా బలమైన అమెరికాతో పాటు సామాన్య పౌరులకు కూడా మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలన్నది ఆయన రాజకీయ ఆలోచనల్లో కనిపిస్తోంది.రో ఖన్నా గురించి ఇప్పుడు అమెరికా రాజకీయాల్లో చర్చ జరగడానికి ఆయన భారతీయ మూలాలు మాత్రమే కారణం కాదు. ఆర్థిక వ్యవస్థ, టెక్నాలజీ, తయారీ రంగం, ప్రభుత్వ విధానాలపై ఆయనకు ఉన్న అవగాహన కూడా ముఖ్యమైన అంశం. ప్రపంచ టెక్నాలజీ రంగానికి కేంద్రంగా ఉన్న సిలికాన్ వ్యాలీ ప్రాంతానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో టెక్నాలజీ ఆవిష్కరణలు, వాటి వల్ల ఉద్యోగాలు, ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం వంటి అంశాలపై ఆయనకు ప్రత్యేకమైన ఆసక్తి ఉంది.

2028లో వైట్‌హౌస్ దిశగా అడుగులు వేస్తారా?

రో ఖన్నా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అన్నది ఇప్పుడే చెప్పలేం. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం.. అమెరికా రాజకీయాల్లో భారతీయ మూలాలున్న నాయకులు కేవలం ప్రాతినిధ్యానికే పరిమితం కాకుండా, దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే విధానాల రూపకల్పనలోనూ కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకుంటున్నారు. టెక్నాలజీ, ఆర్థిక వ్యవస్థ, ప్రజా సంక్షేమం వంటి విభిన్న రంగాలపై అవగాహన ఉన్న రో ఖన్నా పేరు అధ్యక్ష రేసులో వినిపించడం ఈ మార్పుకు మరో ఉదాహరణ. ఆయన నిజంగా 2028 బరిలోకి దిగితే, అమెరికా రాజకీయాల్లో భారతీయ అమెరికన్ల ప్రస్థానంలో అది మరో ముఖ్యమైన అధ్యాయం కానుంది.

చైతన్యరథం



ఆకాశమే హద్దు కాదు..

- 13,629 అడుగుల ఎత్తులో భారత వాయుసేన అద్భుతం

న్యూఢిల్లీ: భారత వైమానిక దళం మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో భారీ విమానాలను నడిపే సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతూ సరికొత్త రికార్డు సృష్టించింది. రష్యా తయారీ భారీ రవాణా విమానం ఐఎల్-76ఎండీ.. లద్దాఖ్‌లోని న్యోమా వైమానిక స్థావరంలో విజయవంతంగా ల్యాండ్ అయింది. సముద్ర మట్టానికి 13,629 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ఎయిర్‌ఫీల్డ్‌లో విమానం దిగడం ప్రపంచ విమానయాన చరిత్రలోనే ప్రత్యేక ఘట్టంగా నిలిచింది. ఈ విషయాన్ని భారత వాయుసేన 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఇంతటి ఎత్తులో భారీ రవాణా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయడం దాని అసాధారణ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొంది. విమాన సిబ్బంది ప్రదర్శించిన అత్యుత్తమ నైపుణ్యం, సమన్వయం, కచ్చితత్వం ఈ విజయానికి కీలకమని తెలిపింది. దేశ వ్యూహాత్మక వైమానిక రవాణా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే చారిత్రక విజయంగా అభివర్ణించింది. చైనాతో వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఏసీ)కి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో న్యోమా వైమానిక స్థావరం ఉంది. గత ఏడాది నవంబర్‌లో అందుబాటులోకి వచ్చిన ఈ స్థావరంలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను కూడా ల్యాండ్ చేసే సదుపాయాలున్నాయి. లద్దాఖ్ ప్రాంతంలో లేహ్, కార్గిల్, థోయిస్ తర్వాత ఇది నాలుగో వైమానిక స్థావరం. మరోవైపు సరిహద్దు ప్రాంతాల్లో సైనిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని రక్షణ శాఖ విమానాశ్రయాలు, అడ్వాన్స్‌డ్ ల్యాండింగ్ గ్రౌండ్స్‌లో మౌలిక సదుపాయాలను విస్తరిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎయిర్‌ఫీల్డ్‌గా గుర్తింపు పొందిన దౌలత్ బేగ్ ఓల్డీ (డీబీఓ)లోనూ సదుపాయాలను మెరుగుపరుస్తోంది. సముద్ర మట్టానికి 16,700 అడుగుల ఎత్తులో ఉన్న ఈ స్థావరం వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైనది. న్యోమాలో ఐఎల్-76ఎండీ ల్యాండింగ్‌తో భారత వాయుసేన తన సాంకేతిక సామర్థ్యాన్ని, సిబ్బంది నైపుణ్యాన్ని మరోసారి నిరూపించుకుంది.

క్రమశిక్షణే.. సైనికుడిని



యోధుడిని చేస్తుంది: రాజ్‌నాథ్ సింగ్

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాయు సేన సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బాగోగ్రా ఎయిర్‌ఫీల్డ్‌లో నిర్వహించిన వేడుకల్లో సైనికులకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. భారత వైమానిక దళ సిబ్బంది ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రశంసించారు. మన సాయుధ దళాలు సరిహద్దుల్లో రేయింబవళ్లు కాపలాగా ఉండటంవల్లే, దేశ ప్రజలు ప్రతి పండగను ఆనందంగా, స్వేచ్ఛగా జరుపుకొంటున్నారని తెలిపారు. వారు చూపే ధైర్యం, నిస్వార్థ సేవకు యావత్ దేశం ఎంతో గర్వపడుతోందన్నారు. 'ఆపరేషన్ సిందూర్'తో మన వాయుసేన శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు. 'సైనికులలో ధైర్యం, క్రమశిక్షణ లేకపోతే అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా అది నిష్ప్రయోజనమే. మన సాయుధ దళాలు క్రమశిక్షణకు మారుపేరు. అదే ఒక సాధారణ సైనికుడిని అసాధారణ యోధుడిగా మారుస్తుంది. అదే సమయంలో డ్రోన్లు, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలతో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలతో సాయుధ దళాలను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది. భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి మన సైనికులు డ్రోన్లను ప్రయోగించడం, సైబర్ సెక్యూరిటీ వంటి కొత్త యుద్ధ పద్ధతులను నేర్చుకుంటున్నారు. రాబోయే రోజుల్లో సాంకేతికనే ఆయుధంగా చేసుకునేలా మన దళాలు మరింత మెరుగవ్వాలి. మీ అందరి సహకారంతో భారత్ మరింత ముందుకు వెళ్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

దేశంలో పెరుగుతోన్న రక్షణ ఉత్పాదక సామర్థ్యాలను రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి వల్లే దేశీయ స్టార్టప్స్, పరిశ్రమలు.. డ్రోన్లు, డ్రోన్ నిరోధక వ్యవస్థలు, సైనికుల కోసం అధునాతన పరికరాలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో అన్ని రకాల ఆయుధాలు, క్షిపణులను సొంతంగా తయారు చేసుకునే స్థాయికి భారత్ ఎదగాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదే సమయంలో దేశ సరిహద్దుల్లో సైనికులు అక్కడి ప్రజలతో బలమైన సంబంధాలు కొనసాగించాలని రక్షణ మంత్రి సూచించారు. అలా అయితేనే దేశంలో కల్లోలం సృష్టించేందుకు శత్రువులు చేసే ప్రయత్నాలను తిప్పికొట్టగలమన్నారు.

అయోధ్య రామాలయ సందర్శనకు అఖిలేశ్ ప్రణాళిక

-వాగ్బాణాలు ఎక్కుపెట్టిన బీజేపీ



ఉత్తర్ ప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ డిసెంబరు 12న అయోధ్య రామాలయాన్ని సందర్శించనున్నారు. 2024 జనవరిలో ఆలయాన్ని ప్రారంభించినప్పటినుంచి ఆయన ఇక్కడికి రానుండటం ఇదే తొలిసారి. ఎస్పీ నేత, అయోధ్య మాజీ ఎమ్మెల్యే పవన్ పాండే ఈ విషయాన్ని వెల్లడించారు. "అఖిలేశ్ యాదవ్, డింపుల్ యాదవ్ దంపతులు వచ్చే నెల 12న అయోధ్య రామ మందిరంతోపాటు హనుమాన్ గఢీని సందర్శించనున్నారు. అదేవిధంగా సాధువులను కలిసి వారి ఆశీర్వాదం తీసుకోనున్నారు" అని తెలిపారు.

అఖిలేశ్ యాదవ్ అయోధ్య పర్యటన ప్రణాళికపై భాజపా విమర్శలు ఎక్కుపెట్టింది. గతంలో రామ భక్తులపై కాల్పులు జరిపిన వారు, సాధువులపై లాఠీఛార్జీ చేయించిన వారు, అయోధ్యను విస్మరించిన వారు.. భక్తులకు, సాధువులకు క్షమాపణలు చెప్పిన తర్వాతే రామమందిరాన్ని సందర్శించాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ డిమాండ్ చేశారు. శ్రీరాముడు దేశ సంస్కృతికి, విలువలకు ప్రతీక అని, అందరు అంగీకరిస్తారని, కానీ.. ఎవరైనా మారీచుడి వేషంలో వస్తే మాత్రం ఆయన బాణాల నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు.

ఎమర్జెన్సీ నిర్ణయం పొరబాటే: సోనియా



దేశంలో అత్యయిక స్థితి విధించిన ఘటనకు సంబంధించి కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమర్జెన్సీ విధించాలనే నిర్ణయం ఓ పొరపాటని అన్నారు. తన అత్తగారు, నాటి ప్రధాని ఇందిరా గాంధీ కూడా ఇదే భావించి ఉండొచ్చని అనుకుంటున్నట్టు చెప్పారు. తన ఆత్మకథ పుస్తక రూపంలో త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో ఓ బ్రిటిష్ దినపత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆమె ఆసక్తికర విషయాలు వెల్లడించారు. సంజయ్ గాంధీని అదుపులో ఉంచి ఉంటే, ఎమర్జెన్సీ విధించిన తర్వాత జరిగిన నష్టంలో చాలావరకు నివారించి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. "ఎమర్జెన్సీ విధించడం పొరపాటే. ఇందిర కూడా అదేవిధంగా భావించారు. ఎమర్జెన్సీ నిర్ణయంపై కుటుంబంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీనిని రాజీవ్ గాంధీ కూడా వ్యతిరేకించారు. వచ్చే ఎన్నికల వరకు వేచి ఉండాలని తన తల్లికి చెప్పినప్పటికీ.. ఆమె చిన్న కుమారుడు సంజయ్ మాత్రం పట్టుబట్టారు. ప్రతిపక్షం తన తల్లిని నాశనం చేస్తుందని, వారిని కట్టడి చేయాలని ఓ రోజు ఫ్యామిలీ డిన్నర్‌లో వాదించారు. రాజీవ్ తన తల్లిని నిలదీయడానికి ప్రయత్నించగా.. ఆమె వినడానికి నిరాకరించారు. ఈ విషయం కుటుంబంలో కూడా ఉద్రిక్తతలను పెంచింది. సంజయ్‌ను అదుపులో పెట్టివుంటే.. ఆ తర్వాత జరిగిన నష్టంలో చాలావరకు నివారించి ఉండేవారు. వాస్తవానికి ఇందిరా ఓ ప్రజాస్వామ్యవాది అని భావిస్తా. ఇలా చెప్తే చాలామంది నవ్వుతారని తెలుసు. కానీ, నాటి ఎమర్జెన్సీ సమయంలో ఆమె ఏమాత్రం సౌకర్యంగా లేరని చెప్పగలను. ఆ భారం ఆమెపై చాలా ఎక్కువగా ఉండేదని అనుకుంటున్నా" అని సోనియా గాంధీ పేర్కొన్నారు.

ది హిందూకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ సోనియా గాంధీ ఈ తరహా వ్యాఖ్యలే చేశారు. కేవలం సంజయ్ నుంచే కాకుండా సీనియర్ల నుంచి ఇందిరా గాంధీపై ఒత్తిడి ఉండేదన్నారు. ఆమె చుట్టూ ఉండే వాళ్లలో రాజీవ్ మాదిరిగా భిన్నంగా ఆలోచించేవారు తక్కువగా ఉండేవారని చెప్పారు. క్రమంగా ఆమె స్వయంగా పరిస్థితిని అర్థం చేసుకొని వాటిని చక్కదిద్దినట్లు వివరించారు. ఎమర్జెన్సీ విధించిన తర్వాతే అసలేం జరుగుతుందో తనకు అర్థమైందని.. ప్రజాస్వామ్య హక్కులు కట్టడి చేయడం, హెబియస్ కార్పస్ నిలిపివేయడం వంటివి జరిగాయన్నారు. కానీ, అది రాజ్యాంగబద్ధంగానే జరిగిందని సోనియా గాంధీ స్పష్టం చేశారు.

ధైర్యముంటే నాపై బుల్డోజర్లు నడపండి: మమత



తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఇంటిపై భాజపా కార్యకర్తలు దాడి చేయడాన్ని బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. తమకు ఎదురు తిరిగిన వారిపైకి బుల్డోజర్లు పంపడం భాజపాకు అలవాటని దుయ్యబట్టారు. వారి దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉంటే అన్నీ తనపైకి పంపాలని సవాల్ చేశారు. 'మీ దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉన్నాయి? రండి, నేను మీ ముందే నిల్చొని ఉన్నాను. నాపై బుల్డోజర్లను నడపండి. మీరెంత ధైర్యవంతులో చూడాలనుకుంటున్నాను' అని భాజపాపై విమర్శలు గుప్పించారు. అభిషేకను ఆయన నివాసంలో పరామర్శించిన అనంతరం మమత ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపా.. తృణమూల్ నేతలపై దాడులు చేయడమే కాకుండా కాళీఘాట్ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా జరుగుతోన్న కాళీ పూజలకు అంతరాయం కలిగిస్తోందని మమత ఆరోపించారు. పలు ప్రాంతాల్లో పూజలు నిర్వహించడానికి అనుమతులు రద్దు చేశారని.. కొన్ని చోట్ల ప్రధాన రహదారులపై పూజ చేసుకునేందుకు అనుమతిచ్చారని అన్నారు. ఈ మార్పులు ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం తెల్లవారుజామున కాళీఘాట్‌లో ఉన్న తన నివాసంపై భాజపా కార్యకర్తలు రాళ్లు, ఇటుకలతో దాడి చేసినట్లు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మమత ఆయన్ని పరామర్శించారు.

ప్రతి విషయాన్నీ విచారించే అధికారం ఈడీకి లేదు

కర్నాటక హైకోర్టు వ్యాఖ్యలు



కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారాలపై కర్ణాటక హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తన దృష్టికి వచ్చిన ప్రతీ విషయాన్ని విచారించే అధికారం ఆ సంస్థకు లేదని పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో దర్యాప్తు చేపట్టడానికి చట్టబద్ధమైన నిబంధనలను దాటవేసే అధికారం దానికి లేదని స్పష్టం చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద.. ఈడీకి ఉన్న అధికారాల పరిధిలో లేని నేరాలపై ఆ చట్టం కింద విచారణ చేపట్టవద్దని ఆదేశించింది. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేవై నంజగౌడ, ఆయనతో సంబంధం ఉన్న ఇతరులతో సహా పలువురు పిటిషనర్లపై దర్యాప్తు సంస్థ చేపట్టిన విచారణలను జస్టిస్ ఎంఐ అరుణ్ కొట్టేశారు. ఆస్తుల జప్తును ధ్రువీకరిస్తూ పీఎంఎల్ఏ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వును హైకోర్టు కొట్టివేసింది. అలాగే, పిటిషనర్లలో ఒకరినుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను తిరిగి ఇవ్వాలని ఆదేశించింది. కోలారు, చిక్కబళ్లాపుర జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల యూనియన్ లిమిటెడ్ (కోముల్) లోని ఉద్యోగుల నియామకాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఇటీవల ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే దర్యాప్తును సవాల్ చేస్తూ..నమోదైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ అవకతవకలపై ఎఫ్ఐఆర్ లేదా, అధికారిక క్రిమినల్ కేసు నమోదైతేనే ఈడీకి దర్యాప్తు చేసే అవకాశం ఉంటుందని తెలిపింది. అంతే కానీ మనీలాండరింగ్ ఆరోపణలను సుమోటోగా తీసుకొని దర్యాప్తు చేపట్టడం సరైన చర్య కాదని పేర్కొంది.

ఇరాన్ క్షిపణుల పరిధిపై ఆంక్షలు ఎత్తివేత

- **2,000 కి.మీ. హద్దు దాటేందుకు సిద్ధం**
- **అమెరికా, ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక ప్రకటన..**
- **యెమెన్‌లో 22 మంది మృతి**

టెహ్రాన్/సనా: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చుతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్‌తో సైనిక ఘర్షణల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ బాలిస్టిక్ క్షిపణుల పరిధిపై గతంలో విధించుకున్న 2,000 కిలోమీటర్ల స్వీయ పరిమితిని ఎత్తివేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. దీంతో భవిష్యత్తులో మరింత సుదూర లక్ష్యాలను ఛేదించగల క్షిపణుల అభివృద్ధికి ఇరాన్ ప్రయత్నించే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి జనరల్ హొస్సేన్ మొహెబ్బి ఈ విషయాన్ని వెల్లడించారు. క్షిపణుల పరిధిపై ఉన్న ఆంక్షలు తొలగిపోయాయని, తమ సామర్థ్యాన్ని మాటల్లో కాకుండా క్షేత్రస్థాయిలో నిరూపిస్తామని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ఎదురయ్యే ఎలాంటి ముప్పునైనా భౌగోళిక పరిమితులు లేకుండా ఎదుర్కోవాలని సైన్యానికి పిలుపునిచ్చిన కొద్ది రోజులకే ఈ ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ప్రస్తుతం ఇరాన్ వద్ద 2,000 కిలోమీటర్లకు మించిన పరిధితో పనిచేసే బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు ధ్రువీకరించే సమాచారం లేదు. ఈ పరిధిలో అరేబియా ద్వీపకల్పం మొత్తం, లెవాంట్ ప్రాంతం, ఈజిప్టులోని అధిక భాగం, గ్రీస్, బాల్కన్ ప్రాంతాల్లోని కొన్ని దేశాలు వస్తాయి. మరోవైపు ఇరాన్ అంతరిక్ష కార్యక్రమానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని భవిష్యత్తులో ఖండాంతర బాలిస్టిక్ క్షిపణుల అభివృద్ధికి ఉపయోగించే అవకాశం ఉందని అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తోంది.



యెమెన్‌లో వైమానిక దాడులు.. 22 మంది మృతి

మరోవైపు యెమెన్‌లో యుద్ధ వాతావరణం మరింత ఆందోళనకరంగా మారింది. రాజధాని సనా సమీపంలోని అల్-షరియా గ్రామంపై శనివారం జరిగిన వైమానిక దాడుల్లో కనీసం 22 మంది మరణించగా, మరో 30 మంది గాయపడ్డారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు అధికంగా ఉన్నారని హూతీ తిరుగుబాటుదారుల ఆధ్వర్యంలోని ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఈ దాడులకు సౌదీ అరేబియానే కారణమని హూతీ ప్రతినిధులు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను స్వతంత్రంగా ధ్రువీకరించలేదని అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. సౌదీ అధికారుల నుంచి కూడా తక్షణ స్పందన రాలేదు. దీనికి ఒక్కరోజు ముందే దక్షిణ యెమెన్‌లోని ఓ మార్కెట్‌పై జరిగిన దాడిలో 30 మంది మరణించినట్లు హూతీలు ప్రకటించారు. ఆ దాడికి ఇరుపక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. 2022లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం వేసవిలో విచ్ఛిన్నం కావడంతో యెమెన్‌లో మళ్లీ ఘర్షణలు తీవ్రమయ్యాయి. తాజా పరిణామాలు పౌరుల భద్రతపై ఆందోళనలను పెంచుతున్నాయి. మొత్తంగా ఇరాన్ క్షిపణి సామర్థ్యాలపై చేసిన తాజా ప్రకటన, యెమెన్‌లో కొనసాగుతున్న దాడులు పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారుతున్నాయనే సంకేతాలిస్తున్నాయి. ఈ పరిణామాలు ప్రాంతీయ భద్రతతో పాటు అంతర్జాతీయ ఇంధన, వాణిజ్య మార్గాలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఎన్విడియా సీఈఓపై చైనా గూఢచర్యం?



ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌ను లక్ష్యంగా చేసుకుని చైనా ఓ మహిళ ద్వారా గూఢచర్యానికి పాల్పడుతోందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. చైనా జాతీయురాలైన అలైస్ హువాంగ్ అలియాస్ హువాంగ్ లీ అనే మహిళను అమెరికా నిఘా సంస్థలు చైనా గూఢచారిగా గుర్తించినట్లు సమాచారం. సింగపూర్‌కు చెందిన డేటా సెంటర్ కంపెనీ మెగాస్పీడ్‌లో కీలక హోదాలో ఉన్న ఆమె.. హువాంగ్‌తో పరిచయం పెంచుకుని ఎన్విడియా ఏఐ చిప్‌లు, సంస్థకు సంబంధించిన కీలక సమాచారాన్ని సేకరించి చైనాకు చేరవేస్తున్నట్లు అమెరికా అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలోనే అమెరికా నిఘా వర్గాలు ఈ వ్యవహారంపై ఓ మెమో సిద్ధం చేసినట్లు కథనాలు పేర్కొన్నాయి. అందులో హువాంగ్‌తో అలైస్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని అధికారులు ఆరోపించినట్లు వెల్లడించాయి. చైనా మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీ ఆమెను గూఢచారిగా నియమించుకున్నట్లు అమెరికా వర్గాలు భావిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా పర్యటనకు ముందు కొద్దిమంది ప్రభుత్వ అధికారులకే ఈ మెమో చేరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జెన్సన్ హువాంగ్‌ను కాంగ్రెస్ కమిటీల ముందు ప్రైవేట్‌గా ప్రశ్నించేందుకు రిపబ్లికన్ సభ్యులు సిద్ధమవుతున్నారు. అయితే, ఈ ఆరోపణలపై ఎన్విడియా ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయకపోవడం గమనార్హం.

అయోడిన్ టాబ్లెట్లు పంచుతున్న ఇరాన్



ఇరాన్ తన ప్రజలకు అయోడిన్ టాబ్లెట్లను పంచుతోంది..! యుద్ధరంగంలో ఉన్న తమకు ఎప్పుడు ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందో తెలియని అనిశ్చితిలో ముందుజాగ్రత్తగా వాటిని పంపిణీ చేస్తోంది. యుద్ధానికి, అయోడిన్ టాబ్లెట్లకు సంబంధం ఏంటనే అనుమానం రావొచ్చు. విషయం ఏంటంటే.? "అణు కేంద్రాలకు సమీపంలో ఉన్న ప్రజలకు ముందుజాగ్రత్తగా మేం అయోడిన్ టాబ్లెట్లను పంపిణీ చేస్తున్నాం. ట్రంప్‌ను నమ్మలేం. ఆయన ఈ నేరానికి పాల్పడే అవకాశం ఉంది అని ఇరాన్ అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. ఇటీవల అమెరికాతో ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉన్న సమయంలో కూడా అణు స్థావరాల చుట్టూ 2 నుంచి 3 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రజలకు టెహ్రాన్ ఈ ఔషధాలను పంచింది. ప్రజలపై రేడియోధార్మికత ప్రభావాన్ని తగ్గించేందుకే ఈ చర్యలు తీసుకుంటోంది. రేడియేషన్ వల్ల థైరాయిడ్ కణాలు దెబ్బతింటాయి. దాంతో ఆ గ్రంథి పనితీరు మందగించి హార్మోన్లను సరిగా ఉత్పత్తి చేయలేదు. అణు ప్రమాదాల వల్ల రేడియేషన్‌కు గురైనవారు భవిష్యత్తో థైరాయిడ్ క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రెండురోజుల క్రితం జాతీయ భద్రతా బృందంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భేటీ అయ్యారు. ఇరాన్‌పై సైనికచర్య కొనసాగించాలా వద్దా..? అనే దానిపై చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఇరాన్‌లోని పికాక్స్ పర్వత ప్రాంతంలో ఉన్న అణుకేంద్రంపై దాడి జరగొచ్చన్న భయాలు నెలకొన్నాయి. అమావాస్య కావడంతో రాబోయే రెండు రోజుల్లో చంద్రుడికాంతి తక్కువగా ఉంటుందని, అది దాడులు చేయడానికి అనుకూలమైన సమయమనే ఆందోళన వ్యక్తమవుతోంది. యుద్ధం పునఃప్రారంభించే విషయంలో తమ ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటుందని ఇటీవల ట్రంప్ చెప్పారు. ఇవన్నీ కలిసి దాడుల భయాలను పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలోనే టెహ్రాన్ ముందుజాగ్రత్త చర్యలకు సిద్ధమైంది.

అణు సమాచారం ఇస్తే.. రూ.180 కోట్లు..

ఇదిలా ఉండగా.. ఇరాన్ అణు కార్యక్రమం గురించి సమాచారం ఇచ్చిన వారికి అమెరికా సైన్యం భారీ రివార్డు ప్రకటించింది. 20 మిలియన్ డాలర్లు (రూ.188 కోట్లకుపైగా) ఇస్తామని వెల్లడించింది. అలాగే వారికి పునరావాసం కల్పిస్తామని చెప్తోంది. ఇరాన్‌లోని అణుకేంద్రాలు, పరికరాలు, సిబ్బంది, శాస్త్రవేత్తల గురించి సమాచారం ఇచ్చిన వారికి 'రివార్డ్ ఫర్ జస్టిస్' ప్రోగ్రామ్ కింద ఈ ఆఫర్ ఇచ్చింది.

ట్రంప్ హత్యకు కుట్ర?

వైట్‌హౌస్ సమీపంలో ఆయుధాలతో వెనెజువెలా వ్యక్తి అరెస్ట్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేయాలనే ఉద్దేశంతో ఆయుధాలతో వైట్‌హౌస్ సమీపంలో సంచరిస్తున్న ఓ వ్యక్తిని సీక్రెట్ సర్వీస్ అధికారులు అరెస్ట్ చేశారు. దొంగిలించిన వాహనంలో అనుమానాస్పదంగా కనిపించిన వెనెజువెలా జాతీయుడిని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి మూడు తుపాకులు, పెద్ద సంఖ్యలో తూటాలను స్వాధీనం చేసుకున్నారు. అమెరికా కాలమానం ప్రకారం నవంబర్ 5, గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా.. శుక్రవారం అధికారులు వివరాలు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. వైట్‌హౌస్ కాంప్లెక్స్‌కు సమీపంలోని కాన్స్టిట్యూషన్ అవెన్యూలో నీలిరంగు ఫోర్డ్ ఎఫ్-150 పికప్ ట్రక్కు అనుమానాస్పదంగా నిలిపి ఉండటాన్ని పెట్రోలింగ్ చేస్తున్న సీక్రెట్ సర్వీస్ అధికారి గుర్తించారు. వాహనంలో ఉన్న వ్యక్తిని ప్రశ్నించగా, తన వద్ద ఆయుధాలు ఉన్నాయని అతడు సంకేతాలిచ్చాడు. అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా.. అది దొంగిలించినదిగా తేలింది. అధికారులు స్వాధీనం చేసుకున్న ఆయుధాల్లో ఏఆర్-15 రైఫిల్, మ్యాక్-10 పిస్టల్, గ్లోక్ 43ఎక్స్ హ్యాండ్‌గన్ ఉన్నాయి. వీటితో పాటు డజన్ల కొద్దీ తూటాలు కూడా లభించాయి. నిందితుడిని రోనీ యోర్డిక్స్ గువానిపా క్రినోస్‌గా గుర్తించారు. అతడు తనను ట్రంప్‌ను చంపేందుకు వాషింగ్టన్‌కు రావాలని కొన్ని స్వరాలు ఆదేశించినట్లు అధికారులతో చెప్పాడని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం వెల్లడించింది. అయితే, కోర్టులో దాఖలైన పోలీసు అఫిడవిట్‌లో ఈ వ్యాఖ్య ప్రస్తావన లేదు.

నిందితుడిపై అక్రమంగా ఆయుధాలు కలిగి ఉండటం, వాటిని తరలించడం, లైసెన్స్ లేకుండా తుపాకులు కలిగి ఉండటం, వాహన దొంగతనం తదితర అభియోగాలు మోపారు. నవంబర్ 6న వాషింగ్టన్‌లోని స్థానిక కోర్టులో హాజరుపరచగా, బెయిల్ లేకుండా కస్టడీలో ఉంచాలని ఆదేశించారు. ప్రస్తుతం అతడు యూఎస్ మార్షల్స్ సర్వీస్ అదుపులో ఉన్నాడు. 2024 మార్చిలో టెక్సాస్ మీదుగా అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించినట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారులు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో వైట్‌హౌస్ పరిసరాల్లో భద్రతను మరింత అప్రమత్తం చేసినట్లు సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ సీన్ కరన్ పేర్కొన్నారు. అధ్యక్షుడికి ముప్పు కలిగించే వ్యక్తులను ముందుగానే గుర్తించి అడ్డుకోవడంపై తమ సంస్థ దృష్టి సారిస్తోందని వెల్లడించారు.

బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడు హ్యారీ బాక్సర్ అరెస్ట్



బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్న హరిచంద్ జాట్ అలియాస్ హ్యారీ బాక్సర్‌ను అమెరికాలోని కాలిఫోర్నియాలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దిల్లీ పోలీసులు, హరియాణా ఎస్టీఎఫ్ సమాచారంతో ఈ చర్య చేపట్టారు. రాజస్థాన్‌కు చెందిన హ్యారీ గతంలో బాక్సింగ్ కోచ్‌గా పనిచేసి, అనంతరం గ్యాంగ్‌లో చేరి విదేశాల నుంచి వసూళ్ల నెట్‌వర్క్‌ను నడిపిస్తున్నాడు. దర్శకుడు రోహిత్ శెట్టి ఇంటి వద్ద కాల్పుల ఘటనకు బాధ్యత వహిస్తూ సోషల్ మీడియాలో ప్రకటించుకున్న అతడిపై హత్య, హత్యాయత్నం, కాల్పులు, వసూళ్లు సహా పలు కేసులున్నాయి. నటుడు రణ్‌వీర్ సింగ్‌ను రూ.20 కోట్లు డిమాండ్ చేస్తూ బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటనకు ఆయుధాలు సరఫరా చేసిన నెట్‌వర్క్‌తోనూ సంబంధాలున్నట్లు అధికారులు తెలిపారు. రణదీప్ మాలిక్ గ్యాంగ్‌లో భాగంగా పనిచేసిన హ్యారీ బాక్సర్, అనిల్ పండిట్‌లు ఎన్‌క్రిప్టెడ్ ఛానళ్ల ద్వారా ఆదేశాలు అందుకుని నేరాలకు పాల్పడేవారని డీసీపీ ప్రవీణ్ త్రిపాఠి వెల్లడించారు. హ్యారీని భారత్‌కు తీసుకొచ్చేందుకు సీబీఐ చట్టపరమైన ప్రక్రియ ప్రారంభించింది.

హార్దిక్‌కు ముంబయి గుడ్‌బై.. అర్షదీప్‌కు వెల్‌కమ్

- ఐపీఎల్‌లో భారీ ట్రేడ్‌కు రంగం సిద్ధం



ఐపీఎల్‌లో మరో సంచలన ఆటగాళ్ల మార్పిడికి రంగం సిద్ధమైంది. అందరూ ఊహించినట్లుగానే టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ముంబయి ఇండియన్స్‌ను వీడనున్నాడు. అతడిని పంజాబ్ కింగ్స్‌కు పంపించేందుకు ముంబయి ఫ్రాంచైజీ అంగీకరించగా.. అందుకు బదులుగా పంజాబ్ పేసర్ అర్షదీప్ సింగ్‌ను తీసుకోనుంది. ఈ రెండు ఫ్రాంచైజీల మధ్య ట్రేడ్ ఒప్పందం కుదిరినట్లు నవంబర్ 7న పలు జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి. అయితే ఆటగాళ్ల అంగీకారం, బీసీసీఐ అధికారిక ఆమోదం తర్వాతే ఈ ఒప్పందం పూర్తిగా ఖరారు కానుంది. ఈ ట్రేడ్‌లో మూడో ఆటగాడు ఎవరూ ఉండరని సమాచారం.

ముంబయిని వీడనున్న హార్దిక్

హార్దిక్ పాండ్య 2015లో ముంబయి ఇండియన్స్ తరఫున ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. ఆ జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగి నాలుగు టైటిళ్ల విజయాల్లో భాగమయ్యాడు. 2022 సీజన్‌కు ముందు గుజరాత్ టైటాన్స్‌కు వెళ్లి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. తొలి సీజన్‌లోనే జట్టుకు టైటిల్ అందించడంతోపాటు, 2023లోనూ ఫైనల్‌కు చేర్చాడు. దీంతో 2024 సీజన్‌కు ముందు ముంబయి అతడిని తిరిగి జట్టులోకి తీసుకుని కెప్టెన్సీ అప్పగించింది. అయితే రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పించి హార్దిక్‌కు బాధ్యతలు ఇవ్వడం అప్పట్లో తీవ్ర చర్చకు దారితీసింది. హార్దిక్ నాయకత్వంలో ముంబయి ఆశించిన స్థాయిలో రాణించలేదు. గత మూడు సీజన్లలో రెండుసార్లు ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోయింది. 2026 సీజన్‌లోనూ 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు విజయాలతో తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. వ్యక్తిగతంగానూ గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలు అతడి ఆటపై ప్రభావం చూపాయి. దీంతో ఫ్రాంచైజీతో అతడి ప్రయాణానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

ముంబయికి అర్షదీప్ బలం

2019లో పంజాబ్ కింగ్స్ తరఫున ఐపీఎల్‌లోకి అడుగుపెట్టిన అర్షదీప్ ఇప్పటివరకు అదే జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 96 మ్యాచ్‌ల్లో 111 వికెట్లు పడగొట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. పవర్‌ప్లే, డెత్ ఓవర్లలో బౌలింగ్ చేయగల సామర్థ్యం అతడి ప్రధాన బలం. ఎడమచేతి వాటం పేసర్ కావడంతో ముంబయి బౌలింగ్ విభాగానికి అదనపు బలం చేకూరనుంది. జస్‌ప్రీత్ బుమ్రాతో కలిసి బౌలింగ్ చేస్తే ప్రత్యర్థి జట్లకు సవాలు విసరగలడని ముంబయి భావిస్తోంది.

పంజాబ్‌లో హార్దిక్ పాత్ర ఏమిటి?

మరోవైపు హార్దిక్ రాకతో పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలకు ఆల్‌రౌండర్ బలం పెరగనుంది. అయితే అతడు కెప్టెన్‌గా కాకుండా ఆటగాడిగానే జట్టులో కొనసాగనున్నాడు. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోనే పంజాబ్ వచ్చే సీజన్‌లో బరిలోకి దిగనుంది. 2025లో ఫైనల్‌కు చేరిన పంజాబ్.. 2026లో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో హార్దిక్ అనుభవం జట్టుకు ఉపయోగపడుతుందని యాజమాన్యం భావిస్తోంది. ఇక ముంబయి ఇండియన్స్‌కు రోహిత్ శర్మ తిరిగి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. నవంబర్ 17లోపు ఆటగాళ్ల రిటెన్షన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండటంతో ఈ ట్రేడ్‌పై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. డిసెంబర్ 16న గోవాలో జరగనున్న మినీ వేలానికి ముందే ఈ మార్పులు రెండు జట్ల భవిష్యత్తు కూర్పుపై ప్రభావం చూపనున్నాయి.

టెస్టులకు మహమ్మద్ షమీ గుడ్‌బై..

- వైట్‌బాల్ క్రికెట్‌లో కొనసాగింపు



టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వీడియో ద్వారా వెల్లడించాడు. తెల్ల జెర్సీకి వీడ్కోలు పలుకుతున్నానని, అయితే టెస్టు క్రికెట్‌తో ముడిపడిన జ్ఞాపకాలను ఎప్పటికీ మరచిపోలేనని భావోద్వేగానికి గురయ్యాడు. భారత జట్టు తరఫున తొలిసారి బరిలోకి దిగినప్పటి నుంచి ప్రతి వికెట్, గాయం, పోరాటం తనకెంతో నేర్పించాయని పేర్కొన్నాడు. తన ప్రయాణంలో అండగా నిలిచిన సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు. 36 ఏళ్ల షమీ తన టెస్టు కెరీర్‌లో 64 మ్యాచ్‌లు ఆడి 229 వికెట్లు పడగొట్టాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన పదునైన బౌలింగ్‌తో ఎన్నో విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా విదేశీ పర్యటనల్లోనూ భారత బౌలింగ్‌కు వెన్నెముకగా నిలిచాడు. గత కొంతకాలంగా గాయాల సమస్యలతో ఇబ్బందిపడుతున్న షమీ.. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత జాతీయ జట్టుకు దూరమయ్యాడు. దేశవాళీ క్రికెట్‌లో బెంగాల్ తరఫున రాణించినప్పటికీ తిరిగి జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. ఈ నేపథ్యంలో టెస్టులకు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాడు. అయితే వన్డేలు, టీ20లతో కూడిన పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కొనసాగుతానని స్పష్టం చేశాడు. భారత జట్టు తరఫున ఆడిన గర్వం తన మదిలో ఎప్పటికీ నిలిచిపోతుందని షమీ పేర్కొన్నాడు.

అద్భుత బౌలింగ్‌తో అభిమానులను అలరించి, ఎన్నో మధుర విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమి టెస్టులకు గుడ్‌బై చెప్పడం అభిమానులకు బాధ కలిగించే అంశమే. సుదీర్ఘ ఫార్మాట్ నుంచి రిటైరవుతున్నట్లు శుక్రవారం రాత్రి ప్రకటించాడు. 2013లో నవంబరు 6న ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన షమి 13 ఏళ్ల తర్వాత అదే రోజు వీడ్కోలు పలకడం విశేషం. తొలి మ్యాచ్‌లో ఈ బెంగాల్ పేసర్ ఏకంగా 9 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించుకున్నాడు. అంతేకాదు, టెస్ట్ క్రికెట్‌లో ఆరుసార్లు ఐదు వికెట్లు తీసి హాల్ సాధించాడు. షమీ అసలు విధ్వంసం విదేశీ పిచ్‌లపైనే కనిపించింది.

వర్షం అడ్డంకి.. ఉత్కంఠ పోరులో భారత్ విజయం

సిరీస్‌లో 2-0 ఆధిక్యం



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో టీమ్ ఇండియా మరో విజయాన్ని అందుకుంది. వెల్లింగ్టన్ వేదికగా జరిగిన రెండో వన్డేలో డక్‌వర్త్ లూయిస్ (డీఎల్ఎస్) పద్ధతిలో నాలుగు పరుగుల తేడాతో కివీస్‌పై గెలిచింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌ను 47 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 41 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌటైంది. డారిల్ మిచెల్ (55) అర్ధ సెంచరీతో రాణించగా, కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (31) ఫర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ నాలుగు వికెట్లతో సత్తా చాటగా.. ఆకిబ్ నబీ, అన్షుల్ కాంబోజ్, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. స్వల్ప లక్ష్య ఛేదనలో భారత్‌కు కివీస్ బౌలర్లు గట్టి పరీక్ష పెట్టారు. రోహిత్ శర్మ (23), శ్రేయస్ అయ్యర్ (30), కేఎల్ రాహుల్ (26) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలి బంతికే వెనుదిరిగాడు. దీంతో 26 ఓవర్లకు 113/7 స్కోరుతో భారత్ ఇబ్బందుల్లో పడింది. అయితే డీఎల్ఎస్ లెక్కల ప్రకారం అప్పటికే అవసరమైన స్కోరును అధిగమించడంతో భారత్‌ను విజేతగా ప్రకటించారు. సిరీస్‌లో ఆధిక్యాన్ని మరింత పెంచుకున్న టీమ్ ఇండియా.. మూడో వన్డేలోనూ గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. మూడో వన్డే మంగళవారం జరగనుంది.

160-180 పరుగులు చేసి ఉంటే భారత్‌ను ఓడించేవాళ్లం

- కివీస్ కెప్టెన్ శాంట్నర్



భారత్‌తో జరిగిన రెండో వన్డేలో ఓటమిపై న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ స్పందించాడు. బ్యాటింగ్ వైఫల్యమే తమ ఓటమికి ప్రధాన కారణమని అభిప్రాయపడ్డాడు. డక్‌వర్త్ లూయిస్ (డీఎల్ఎస్) పద్ధతిలో టీమిండియా నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ 134 పరుగులకే ఆలౌటైంది. మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన శాంట్నర్.. పిచ్ బ్యాటింగ్‌కు ఏమాత్రం అనుకూలంగా లేదని చెప్పాడు. ముఖ్యంగా ఆరంభంలో భారత బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారని ప్రశంసించాడు. తొలి ఓవర్లలోనే వికెట్లు కోల్పోవడం తమను దెబ్బతీసిందన్నాడు. పిచ్ పరిస్థితులను భారత బౌలర్లు సమర్థంగా ఉపయోగించుకున్నారని పేర్కొన్నాడు. "మేం 160-180 పరుగులు చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది. ఆ స్కోరు సాధించి ఉంటే విజయావకాశాలు మెరుగ్గా ఉండేవి. ఈ పిచ్‌పై ఫాస్ట్ బౌలర్లను ఎదుర్కోవడం చాలా కష్టమైంది. అయిన ప్పటికీ మా బౌలర్లు అద్భుతంగా పోరాడారు. స్వల్ప లక్ష్యాన్ని కాపా డుకోవడానికి ఆరంభంలోనే వికెట్లు తీయడం అవసరం. మా బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ భారత్‌పై ఒత్తిడి పెంచారు. కానీ వర్షం కారణంగా వారి పోరాటానికి తగిన ఫలితం దక్కలేదు"అని శాంట్నర్ వివరించాడు. వరుసగా రెండో ఓటమితో ఐదు వన్డేల సిరీస్‌లో కివీస్ 0-2తో వెనుకబడింది. సిరీస్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే తదుపరి మ్యాచ్‌లో తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మధ్యప్రదేశ్ కెప్టెన్‌గా ఆర్సీబీ స్టార్ రజత్ పాటిదార్

- ముస్తాక్ అలీ ట్రోఫీకి జట్టు ప్రకటన



టీమిండియా యువ ఆటగాడు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్‌కు మరో కీలక బాధ్యత దక్కింది. దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మధ్యప్రదేశ్ జట్టుకు అతడు నాయకత్వం వహించనున్నాడు. ఈ మేరకు 15 మంది సభ్యులతో కూడిన జట్టును మధ్యప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) ప్రకటించింది. ఈ జట్టులో అనుభవజ్ఞులతో పాటు యువ ఆటగాళ్లకు కూడా అవకాశం కల్పించారు. ఐపీఎల్‌లో గుర్తింపు పొందిన అనికేత్ వర్మ, ఆవేశ్ ఖాన్, సారాంశ్ జైన్ తదితరులు జట్టులో చోటు దక్కించుకున్నారు. గతంలోనూ పాటిదార్ సారథ్యంలోనే మధ్యప్రదేశ్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని గెలుచుకుంది. దీంతో మరోసారి అతడి నాయకత్వంలో టైటిల్ సాధించాలని జట్టు పట్టుదలగా ఉంది. ఎలైట్ గ్రూప్-సిలో ఉన్న మధ్యప్రదేశ్ తన తొలి మ్యాచ్‌లో కేరళతో తలపడనుంది. ఈ మ్యాచ్ చండీగఢ్ వేదికగా జరగనుంది. ఇక ఐపీఎల్‌లోనూ పాటిదార్ తన నాయకత్వ ప్రతిభను నిరూపించుకున్నాడు. అతడి సారథ్యంలో ఆర్సీబీ 2025లో తొలి ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ జట్టుకు మరోసారి టైటిల్ అందించి తన కెప్టెన్సీ సత్తాను చాటాలని పాటిదార్ భావిస్తున్నాడు.

మధ్యప్రదేశ్ జట్టు: రజత్ పాటిదార్ (కెప్టెన్), అంకుశ్ సింగ్, అక్షత్ రఘువన్షీ, హర్ష్ గావిల్ (వికెట్ కీపర్), అనికేత్ వర్మ, రితిక్ టడా, అపూర్వ్ ద్వివేది (వికెట్ కీపర్), సారాంశ్ జైన్, కుమార్ కార్తికేయ సింగ్, శివం శుక్లా, శివాంగ్ కుమార్, ఆవేశ్ ఖాన్, త్రిపురేశ్ సింగ్, రాహుల్ బతామ్, మంగేశ్ యాదవ్.

మైదానంలో మెరుపులు.. బయట సందడి

- కోహ్లితో ఒక రోజు ఎలా గడిచిందంటే?



న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా స్టార్ విరాట్ కోహ్లి మరోసారి అభిమానులను అలరించాడు. నవంబరు 4న జరిగిన తొలి వన్డేలో బ్యాటింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ అద్భుత ప్రదర్శన చేశాడు. ఆ మరుసటి రోజే తన పుట్టినరోజు జరుపుకున్నాడు. ఈ నేపథ్యంలో స్పోర్ట్స్ ఛానెల్ సోనీ స్పోర్ట్స్ 'కోహ్లితో ఒక రోజు' పేరుతో ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ వీడియోలో మైదానంలో కోహ్లి ఆటతీరుతో పాటు అభిమానులతో అతడికి ఉన్న అనుబంధాన్ని ఆసక్తికరంగా చూపించింది. మ్యాచ్ సందర్భంగా బౌండరీల వద్ద కోహ్లి చేసిన విన్యాసాలు, ఫీల్డింగ్‌లో అతడి చురుకుదనం, ప్రేక్షకుల నుంచి లభించిన అపూర్వ స్పందనను ఇందులో పొందుపరిచారు. మ్యాచ్ ముగిసిన తర్వాత సహచర ఆటగాళ్లతో కోహ్లి చేసిన సందడి, మైదానం వెలుపల అతడి సరదా క్షణాలను కూడా ఆవిష్కరించారు. కోహ్లి బ్యాటింగ్ చూసేందుకు అభిమానులు ఎంతగా ఎదురుచూస్తారో, మైదానంలో అతడి ప్రతి కదలికను అంతే ఆసక్తిగా గమనిస్తుంటారు. ఈ ప్రత్యేక వీడియో ద్వారా క్రికెట్ అభిమానులకు విరాట్ ఆటలోని ఉత్సాహంతో పాటు అతడి వ్యక్తిత్వంలోని మరో కోణాన్ని పరిచయం చేసే ప్రయత్నం చేసింది సోనీ స్పోర్ట్స్. ప్రస్తుతం ఈ వీడియో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది.



చైతన్య రథం
సినిమా
ఆదివారం 8 నవంబర్ 2026 X

క్రిస్మస్ బాక్సాఫీస్ వార్‌లోకి షారుఖ్ ఎంట్రీ

ఈ ఏడాది క్రిస్మస్ సీజన్‌లో బాక్సాఫీస్ పోరు మరింత రసవత్తరంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. టాలీవుడ్ నుంచి బాలీవుడ్, హాలీవుడ్ వరకు పలు భారీ చిత్రాలు ఈ పండుగ సీజన్‌ను టార్గెట్ చేస్తుండటంతో ప్రేక్షకులకు సినిమాల సందడి ముందుగానే మొదలైంది. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమ విషయానికి వస్తే.. నటసింహం నందమూరి బాలకృష్ణ, కింగ్ నాగార్జున నటిస్తున్న చిత్రాలు ఒకే విడుదల తేదీని లక్ష్యంగా చేసుకోవడం ఆసక్తికరంగా మారింది. బాలయ్య నటిస్తున్న 'దాదా', నాగార్జున కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'కింగ్ 100' సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఇప్పటికే చర్చనీయాంశమైంది. ఇప్పుడు ఈ పోటీలోకి బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ కూడా చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఆయన నటిస్తున్న భారీ యాక్షన్, రివెంజ్ ఎంటర్‌టైనర్ 'కింగ్'ను తెలుగులోనూ విడుదల చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజాగా కొన్ని మల్టీప్లెక్స్‌ల వద్ద ఈ సినిమాకు సంబంధించిన తెలుగు హోర్డింగ్స్ కనిపించడం ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూర్చింది. అదే జరిగితే క్రిస్మస్ బరిలో బాలయ్య, నాగార్జున సినిమాలతో పాటు షారుఖ్ 'కింగ్' కూడా నిలవనుంది. దీంతో మూడు చిత్రాల మధ్య పోటీ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. అయితే తెలుగు వెర్షన్ విడుదల తేదీపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అది వెలువడితే ఈ క్రిస్మస్ బాక్సాఫీస్ పోరుపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

'కల్కి-2'లో అసలు విధ్వంసం అప్పుడేనట!



యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ పుట్టినరోజు సందర్భంగా 'కల్కి 2898 ఏడీ' చిత్ర బృందం ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా దర్శకుడు నాగ్ అశ్విన్‌తో కలిసి ఉన్న అరుదైన తెరవెనుక ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. అంతేకాదు.. ఆయన్ను 'సినిమాకు సుప్రీమ్ ఫోర్స్' అంటూ అభివర్ణించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'కల్కి 2898 ఏడీ' తొలి భాగంలో సుప్రీమ్ యాస్కిన్‌గా కమల్ హాసన్ కనిపించింది కొద్దిసేపే అయినప్పటికీ.. తనదైన నటనతో ప్రేక్షకుల్లో బలమైన ముద్ర వేశారు. ముఖ్యంగా చివర్లో ఆయన పాత్రకు ఇచ్చిన ఎలివేషన్ సీక్వెల్‌పై అంచనాలను పెంచేసింది. రెండోభాగంలో యాస్కిన్ పాత్ర మరింత కీలకంగా ఉండటంతో ప్రభాస్, కమల్ హాసన్ మధ్య ఎలాంటి పోరు ఉండబోతోందనే ఆసక్తి నెలకొంది. వైజయంతీ మూవీస్ నిర్మిస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ సీక్వెల్‌లో అమితాబ్ బచ్చన్ కూడా కీలక పాత్రలో కొనసాగనున్నారు. మరోవైపు దీపికా పదుకొణె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్న నేపథ్యంలో ఆమె స్థానంలో సాయి పల్లవిని తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇక దర్శకుడు నాగ్ అశ్విన్ వెల్లడించిన సమాచారం ప్రకారం.. అక్టోబర్ 2026 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమై, 2027 మధ్య నాటికి చిత్రీకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్ పనులు కూడా ఉన్న ఈ సినిమా విడుదలకు మరికొంత సమయం పట్టే అవకాశముంది. మొత్తానికి కమల్ హాసన్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఇచ్చిన ఈ స్పెషల్ విషెస్‌తో 'కల్కి 2'పై మరోసారి అంచనాలు పెరిగాయి.

రెండు మూడేళ్లలో డైరెక్టర్‌గా..



నితేశ్ తివారీ 'రామాయణ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్. నటుడిగా మరో పదేళ్లే కొనసాగుతానని, ఆ తర్వాత దర్శకత్వంపై పూర్తిస్థాయిలో దృష్టి పెడతానని తాజాగా ఆయన తెలిపారు. ఇప్పటికే ఓ కథ రాయడం ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రణ్‌బీర్.. పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "రెండు మూడేళ్లలో డైరెక్టర్‌గా తొలి అడుగు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా. దర్శకుడిగా ఓ కథను తెరపై ఆవిష్కరించడం ఎంతో గొప్ప అనుభూతినిస్తుంది. నా తొలి చిత్రం ఏ జానర్‌లో ఉంటుందో ఇప్పుడే చెప్పలేను. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్', 'ఇట్స్ ఏ వండర్‌ఫుల్ లైఫ్', రాజ్‌కుమార్ హిరాణీ సినిమాల తరహాలో అందరికీ నచ్చే కుటుంబ కథాచిత్రాన్ని రూపొందించాలని ఉంది. నేను సంవత్సరంలో 100-125 రోజులు మాత్రమే పని చేస్తాను. కథలు రాయడానికి చాలా సమయం ఉంటుంది. నటుడిగా మరో పదేళ్లే కొనసాగుతానేమో. దర్శకత్వంవైపు మళ్లాలని ఉంది. నన్ను నేను హీరోగా పెట్టుకుని సినిమా తీయాలనే ఆలోచన లేదు. 'బ్రహ్మాస్త్ర-2', 'యానిమల్-2', 'రామాయణ: పార్ట్-2' పూర్తి చేసి రెండుమూడేళ్లలో నా తొలి చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లాలని అనుకుంటున్నా" అని వెల్లడించారు. దర్శకత్వంపై ఆసక్తిని రణ్‌బీర్ గతేడాది తన పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లోనూ వెల్లడించారు. సినిమాల విషయానికొస్తే, ప్రస్తుతం రణ్‌బీర్.. సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న 'లవ్ అండ్ వార్'లో అలియాభట్, విక్కీ కౌశల్‌తో కలిసి నటిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



పుంజుకున్న 'ఆదర్శ కుటుంబం'!

వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వచ్చిన 'ఆదర్శ కుటుంబం' బాక్సాఫీస్ వద్ద ఆసక్తికరమైన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. శ్రీనిధి శెట్టి కథానాయికగా నటించిన చిత్రం విడుదలకు ముందు పెద్దగా హైప్ లేకపోయినా.. థియేటర్లలోకి వచ్చాక మంచి ఓపెనింగ్స్‌తోపాటు పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. అయితే తొలి రోజుల్లో కనిపించిన జోరు ఎక్కువకాలం కొనసాగలేదు. వీకెండ్స్ తర్వాత వర్కింగ్ డేస్‌లో కలెక్షన్లు తగ్గుముఖం పట్టాయి. మరోవైపు వరుసగా కొత్త సినిమాలు విడుదలవుతుండటంతో థియేటర్లలో పోటీ కూడా పెరిగింది. దీంతో 'ఆదర్శ కుటుంబం' బాక్సాఫీస్ రన్ దాదాపు ముగిసినట్లేనని చాలామంది భావించారు. కానీ అనూహ్యంగా ఈ సినిమా మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా బుకింగ్స్ ట్రెండింగ్‌లోకి రావడంతో థియేటర్ల వద్ద మళ్లీ సందడి కనిపిస్తోంది. పలుచోట్ల డీసెంట్ ఆక్యుపెన్సీ నమోదవుతుండటంతో సినిమా తిరిగి పుంజుకుంటోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఒక సినిమా బాక్సాఫీస్ ప్రయాణంలో ఇలాంటి పునరాగమనం ఆసక్తికరమైన పరిణామమే. అయితే ఈసారి వచ్చిన ఊపును ఎంతవరకు నిలబెట్టుకుంటుందన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. కొత్త సినిమాల పోటీ మధ్య ప్రేక్షకులను మరోసారి థియేటర్లకు రప్పించగలిగితే 'ఆదర్శ కుటుంబం'కు అదనపు వసూళ్లు వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి దాదాపు రన్ ముగిసిందనుకున్న సమయంలో వెంకటేష్ సినిమా మళ్లీ బుకింగ్స్‌లో జోరు చూపించడం విశేషం. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించగా, హారికా హాసిని క్రియేషన్స్ నిర్మించింది.

'వృషకర్మ' నుంచి
స్వాగ్ ఆఫ్ అర్జున్



హీరో నాగచైతన్య తన కెరీర్‌లో మరో విభిన్నమైన ప్రయత్నానికి సిద్ధమవుతున్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా ఎపిక్ అడ్వెంచర్ మూవీ 'వృషకర్మ'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే ఆసక్తిని పెంచిన ఈ సినిమాకు సంబంధించి తాజాగా దీపావళి కానుకగా విడుదలైన ఫస్ట్ సింగిల్ 'స్వాగ్ ఆఫ్ అర్జున్' సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఈ పాటలో నాగచైతన్య లుక్, బాడీ లాంగ్వేజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అర్జునుడి పాత్రకు తగ్గట్టుగా ఆయన చేసిన ఫిజికల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆకట్టుకుంటోంది. స్టైలిష్ మేకోవర్‌తోపాటు గ్రాండ్ విజువల్స్, హాలీవుడ్ స్థాయి స్క్రీన్ ప్రెజెన్స్‌తో చైతన్య సరికొత్త అవతారంలో కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఇప్పటివరకు ఆయన చేయని తరహా పాత్రలో కనిపిస్తుండటంతో అభిమానుల్లో ఈ సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. సంగీత దర్శకుడు అజనీష్ లోక్‌నాథ్ స్వరాలు సమకూర్చడమే కాకుండా స్వయంగా ఆలపించిన ఈ పాట.. అర్జునుడి పాత్రలోని వీరత్వాన్ని, స్టైల్‌ను ఎలివేట్ చేసేలా సాగింది. పాటలోని సంగీతం, విజువల్స్, చైతన్య లుక్ కలిసి సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుండగా, స్పర్శ్ శ్రీవాత్సవ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. సుకుమార్ రైటింగ్స్, బీవీఎస్ఎన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్న భారీ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మొత్తానికి 'స్వాగ్ ఆఫ్ అర్జున్'తో నాగచైతన్య తన కెరీర్‌లో మరో కొత్త కోణాన్ని పరిచయం చేస్తూ 'వృషకర్మ'పై అంచనాలను పెంచేశారు.

వివేక్ ఒబెరాయ్ గ్రేట్ డెసిషన్



వెండితెరపై విలన్‌గా, హీరోగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించిన బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్.. నిజ జీవితంలోనూ తన ఉదారతతో అందరి మనసులు గెలుచుకుంటున్నారు. ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణం' సినిమా కోసం తనకు రావాల్సిన రూ.6 కోట్ల పారితోషికాన్ని క్యాన్సర్‌తో పోరాడుతున్న నిరుపేద చిన్నారుల వైద్య చికిత్సకు అందించాలని నిర్ణయించుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఆయన తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రామాయణం'లో వివేక్ ఒబెరాయ్ విభీషణుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ పాత్రకుగాను నిర్మాతలు ఆయనకు రూ.6 కోట్లు పారితోషికంగా ఇవ్వనున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఆ మొత్తాన్ని వ్యక్తిగతంగా తీసుకోకుండా, క్యాన్సర్ బాధిత పేద పిల్లల చికిత్సకు వినియోగించాలని నిర్మాత నమిత్ మల్హోత్రాను కోరినట్లు సమాచారం. ఇంతటితో ఆగకుండా తన 50వ పుట్టినరోజు సందర్భంగా మరో గొప్ప నిర్ణయం తీసుకున్నారట వివేక్. క్యాన్సర్‌తో బాధపడుతున్న 50 మంది నిరుపేద చిన్నారుల వైద్య ఖర్చులను పూర్తిగా భరించేందుకు ముందుకొచ్చారు. పిల్లలకు మెరుగైన వైద్యం అందించడమే తనకు నిజమైన సంతోషాన్నిస్తుందని ఆయన పేర్కొన్నట్లు కథనాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు 'రామాయణం' నిర్మాణ విలువలు, అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలపై కూడా వివేక్ ప్రశంసలు కురిపించినట్లు తెలుస్తోంది. భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ స్థాయిలో పరిచయం చేసే ప్రయత్నంగా ఈ చిత్రాన్ని అభివర్ణించారు.